చైతన్యం

సంకల్ప బలం

జూలై 2019

రూ. 20



కాళేశ్వరం శుభారంభం

కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం

చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి

సంపుటి -8 జూలై 2019 సంచిక -10

ఈ సంచికలో

ధారావాహికములు:

మానససరోవర యాత్ర 6

ప్రేమంటే ఇంతే 17

తెలుగు పద్య రత్నాలు 24

సంభాషణ సంస్కృతం 32

మా ఊరి నందుల కథ 36

ప్రహేళిక 46

ప్రత్యేక ఆకర్షణలు

సంపాదకీయం 4

అభిప్రాయ వేదిక 5

వారు వీరౌతారు 11

అంకెలు, సంఖ్యలు : రెండు 13

డాలస్ లో ఉత్సాహంగా యోగ 23

సాహిత్యమే శ్వాసగా జీవించిన ద్వానాశాస్త్రి 26

సంస్కృత సాహిత్యంలోలో రిపార్టీ కవితా...30

మిత్రద్రోహి 34

అందం అంటే ఏమిటి 39

గోభూమి 40

జగద్రథంలో జగన్నాథుడు 47

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

మన దేశం పయనమెటు-- అత్యాచారాలకు ఆనకట్ట వేసేదెవరు?

వరసా వావీ లేకుండా, వయస్సుతో సంబంధం లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్న కేసులు రోజు రోజుకూ ఎక్కువవుతున్నాయి. చిన్న పిల్లలని కూడా చూడకుండా అత్యాచారం చేయడం నిజంగా విచారించవలసిన విషయం. ఆ అత్యాచారం చేసేవాళ్ళు కూడా కొందరు చదువుకోవాల్సిన వయస్సులో చదువుకోకుండా కొందరు విద్యార్థులు వ్యసనాలకు పాల్పడి, ఏమిచేస్తున్నారో కూడా వారికే తెలియని పరిస్థితులలో ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారు. మరికొందరు యువకులు తల్లితండ్రులు తాత ముత్తాతలు సంపాదించిన డబ్బుతో డబ్బు అహంభావంతో, స్నేహితులతో కలిసి, అదొక ఆటగా ఆడపిల్లలను బలితీసుకుంటున్నారు. వీరందరిదీ చిన్న వయస్సంటే, భక్తి మార్గం లోకి వెళ్ళి పిల్లలకు నీతులు బోధించవలసిన పెద్దవారుకూడా కామాంధులవడం ఇంకా దురదృష్టకరం.

ఎటెళ్ళి పోతోంది ఈ దేశ సంస్కృతి.

మన పూర్వీకులు ఎంతో కష్టపడి మన సంస్కృతీ , సాంప్రదాయాలంటూ అన్ని విషయాలలోనూ మంచి చెడులను జాగ్రత్తగా గమనించి, ఒక పద్ధతిలో మన కుటుంబాలు నడిచే టట్టు తీర్చిదిద్దారు . అయితే ఈ తరం వారంతా మీది పాత చింతకాయ పచ్చడి అనీ, చాదస్తం అనీ కొట్టి పారేసి, మాతరం పద్ధతులు అంటూ ఆ క్షణం అబ్బాయికి అమ్మాయి నచ్చినా, అమ్మాయికి అబ్బాయి నచ్చినా అక్కడికక్కలే తల్లితండ్రుల ప్రమేయం లేకుండానే చెట్లమ్మటా, పుట్లమ్మటా తిరిగి, కొన్నాళ్ళు తిరిగి వారికి నచ్చితే వివాహం చేసుకోవడం, లేదంటే అలాగే విడిపోవడం. ఇలా చేయడానికి ఏమాత్రం పిల్లలు బెదరడం లేదు, తల్లితండ్రులు చెప్పినా వినడం లేదు. ఏ తల్లితండ్రులైనా గట్టిగా చెపితే హత్యలూ, ఆత్మహత్యలూ. ఇంకా కొన్ని చోట్ల తల్లితండ్రులే హత్య చేయించే పరిస్థితి. ఎలా ఉండే దేశం ఎలా అయ్యిం దో, చూడండి. తలవంచుకుని సిగ్గుపడే పరిస్థితి. మన ప్రభుత్వాలు , ప్రజలు కూడా మన సంస్కృతికీ, సాంప్రదాయాలకూ పెద్దపీట వేసి కాపాడకపోతే, ఇప్పటికే ఎవరితో మనసు విప్పి చెప్పు కోలేక కుమిలి పోతున్న ప్రజలు మానసిక బాధతో అనారోగ్యాల పాలవుతున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు.

భారత దేశ అభివృద్ధి.

అన్ని దేశాలు కష్టపడి పని చేసి అభివృద్ధి చెందుతున్నాయి. మన దేశంలో మాత్రం ఎక్కడ ఊరికే వస్తుందా ? అది అన్యాయంగా అయినా ఫరవాలేదు. మనం కదలకుండా వస్తే చాలు. అలాగే నేనే కాదు, నాపిల్లలు, నా మనవలు, వీలయితే నా ముని మనవలు కూడా కష్టపడకుండా ఏదో విధంగా సంపాదించి, మనం అనుభవించి , మిగతాదంతా వారి కోసం దాచెయ్యాలి అనే ఆరాటం ప్రజల్లో ఎక్కువగా ఉంది. మనమే కాదు, మన దేశం కూడా అభివృద్ధి చెందాలని ప్రజలకీ లేదు, ప్రభుత్వా లకీ లేదు. పదవులకోసం, అధికారం కోసం ఎంతకైనా దిగజారడానికి రెడీ అవుతున్నారు. వారు ఓట్ల కోసం, ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మును ఊరికే పేదవారికి పథకాల పేరుతో పేద ప్రజ లకంటూ ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రజలంతా గగ్గోలు పెడుతున్నారు. మేము కష్టపడిన సొమ్మును వారికి ఫ్రీగా, మీ ఓట్ల కోసం ఎందుకు ఖర్చుపెడతారు? అనేది ప్రజల ప్రశ్న. తాగుడు కోసం దుకాణాలు పెట్టి, డబ్బు ఫ్రీగా స్త్రీలకే ఇచ్చినా, వారిని కొట్టి ఆ డబ్బులు కాస్తా వారి దగ్గర లాక్కొని తాగి, భార్యా పిల్లలను కొట్టి వేధిస్తున్నారు. దేశంలో అనేక సమస్యలు ఉన్నాయి. అనేక రకాలుగా ఆ పేద ప్రజలే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారికి పని కల్పించి వారిని అభివృద్ధిలోకి తీసుకురండి. సొమ్ముకు వారి శ్రమకు విలువనిచ్చి కష్టపడి పనిచేసేటట్టు చెయ్యండి. ఏ దేశంలోనూ ఈ విధమైన పద్ధతి చూడం, మనదేశం అభివృద్ధిలోకి ఎప్పుడు వస్తుంది? ఇలా ఉంటే అని చదువుకున్న ప్రజల ఆందోళన. అన్ని విషయాలు ఇటు ప్రభుత్వం, ప్రజలు అంతా గమనించి దేశాన్ని అభివృద్ధి పథం లోకి ముందుకు తీసుకు వెళ్లాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.

తీగవరపు శాంతి

అభిప్రాయ వేదిక

మానససరోవర యాత్ర అద్భుతం. నిజంగా మా జన్మ ధన్యమయింది. మాకు కళ్ళకు కట్టినట్టుగా చూపిస్తున్నారు. మీకు ధన్యవాదాలు.
సౌజన్య, రమణి, నీలిమ, వనజ - హైదరాబాదు.

వేమూరివారి 'ఒకటి' గురించి వ్యాసం చాలా బాగుంది. ఒక అంకె కు ఇంత ప్రాముఖ్యత ఉంటుందా అనిపించింది. ఆయనకు మా నమస్సులు.
మనోజ్, రాధ, మూర్తి, రాణి - విజయవాడ.

చక్కటి సంపాదకీయం తో వెలువడ్డ జూన్ సంచిక బాగుంది. పత్రిక ఇలాగే మంచి మంచి శీర్షికలతో పైకి రావాలని ఆశిస్తూ
వెంకటేష్, సుభద్ర - అనంతపూర్

ప్రేమంటే ఇంతే సీరియల్ బాగుంటోంది. బాగా వ్రాస్తున్నారు రచయిత.
సుబ్బారావు, సీత - అనకాపల్లి

మహానటుడు ధూళిపాళ గురించి పోడూరి శ్రీనివాసరావు గారు బాగా వ్రాసారు. ఎన్నో తెలియని విషయాలను మాకు తెలియజేస్తున్నందుకు మీ పత్రికకు, మీకు ధన్యవాదాలు.
అంజలి, సుమన్, చంద్రకాంత్ - విశాఖపట్నం.

వేదుల వారి 'హితోక్తులు' బాగుంది. పద్యాలు కనుమరుగై పోతున్న ఈ రోజుల్లో ఇంత చక్కని పద్యాలు, అదీ ఛందస్సుతో వ్రాస్తున్న వాళ్ళు ఉన్నారంటే, ఇది మన తెలుగు జాతి చేసుకున్న పుణ్యం. రచయితకు ధన్యవాదాలు.
రామశర్మ, వేంకటరావు,లత - చెన్నై

కాశీఖండం అయిపోయిందంటే చాలా అసంతృప్తిగా ఉంది. ఇంత చక్కని రచయిత నుంచి మేము మరిన్ని రచనలు కోరుకుంటున్నాము. మా కోరిక మన్నించ ప్రార్ధన. ఇదంతా కలిపి ఒక పుస్తక రూపంలో తీసుకువస్తే బాగుంటుంది కదా. ఆలోచించగలరు.
పవన్ కుమార్ - తాడేపల్లిగూడెం

దంతుర్తి శర్మ గారి పద్య రత్నాలు శీర్షిక నిజంగా మీ పత్రికకే ఒక రత్నం లాంటిది. రచయితకు మా ధన్యవాదాలు.
సుబ్బలక్ష్మి, సరస్వతి - బేగంపేట, హైదరాబాదు

పూర్ణ సాహిత్య కలశం నారాయణ గౌడు అంటూ చాలా బాగా వ్రాసారు తుమ్మూరి రామమోహనరావు గారు. మంచి రచనలు అందిస్తున్నదుకు మీకు ధన్యవాదాలు. రచయితకు నమస్సులు.
సురేష్ - గోదావరిఖని

సంభాషణ సంస్కృతం అయిపోయిందంటే కొంచేమ్బాధ వేసింది. 30 పాఠాల్లో మాకు చక్కగా సంస్కృతం నేర్పారు చిలకమర్తి దుర్గాప్రసాదరావు గారు. గురువు గారికి మా కృతజ్ఞతలు.
శంకరరావు - అమలాపురం

ఆదూరి హైమవతి గారి శ్రమ కథ బాగుంది. పల్లలకు పనికివచ్చే మంచి కథలు వ్రాస్తున్నారు రచయిత్రి. ఆవిడకు మా ధన్యవాదాలు.
సుబ్బారెడ్డి, ఝాన్సీ - నెల్లూరు

రూపశిల్పి గ్రామశర్మ పేరు ఎంత బావుందో, కథ అంత బావుంది. ఎలక్ట్రాన్ గారి కథలు నేను ఒక్కటి కూడా మిస్ అవ్వను. ఆయనకు మా నమస్కారాలు.
రాజేశ్వరి, సత్యవతి - ఏలూరు

భువనచంద్ర గారి మూడు +మూడు వినూత్నంగా ఉంది. అలాగే రామానందం గారి శ్రీకూర్మ క్షేత్ర వివరణ చక్కగా ఉంది. ఆయనకు మా నమస్సులు.
చంద్రశేఖరావు, ఉమ, భవాని - ఖమ్మం

కల నిజమాయె - ముక్తినాథ్ మానస సరోవర యాత్ర

బ్రేక్ ఫాస్ట్ అవగానే చైనా బోర్డర్ కి వెళ్లి అక్కడ ఎంబసీ లో వీసా స్టాంపింగ్ చేయించుకోవాలి. రెడీగా ఉండండి అని మా టూర్ గైడ్లు, అదే షెర్పాలు అండీ, చెప్పారు.

అలాగే అందరూ రెడీ అయ్యి కూర్చున్నాం. స్యాబ్రూబేసి ఊరు నుంచి ఒక అరగంట దూరంలోనే ఉంది చైనీస్ ఎంబసీ. టైం పది దాటింది. ఇంకా బయలుదేరే సూచనలేమీ కనపడలేదు. అక్కడ చైనా ఎంబసీలో స్టాఫ్ తక్కువగా ఉన్నారు, పెద్ద పెద్ద క్యూలు ఉన్నాయి. లంచ్ తరవాత బయలుదేరదాం అని చెప్పారు గైడ్లు. అప్పటిదాకా చేసేదేముంది అని అనుకుని కొంచెం సైట్ సీయింగ్ అన్నా చెయ్యచ్చు అని చెప్పి ఊరు చూడ్డానికి బయలుదేరాం. అలా ఓ గంట తిరిగి, అందమైన దృశ్యాలను కెమెరాలలో బంధించుకుని తిరిగి హోటల్ కి చేరాం. లంచ్ కానిచ్చేశాం.

బస్ లు కూడా సిద్ధం అయ్యాయి. ఈ ఎంబసీ ఉన్న బోర్డర్ ఊరు పేరు రసువాగఢి. ఇక్కడ ఒక జల విద్యుత్ కేంద్రం (Hydro power station) కూడా ఉంది. ఈ సరిహద్దు ప్రాంతం నుంచి చైనా నేపాల్ మధ్య వాణిజ్యపు ఉత్పత్తులు మారకం జరుగుతూంటుంది. అక్కడ ఎన్నో పళ్ళతో, వస్తువులతో నిండిన భారీ ట్రక్కులు కనిపించాయి. మా బస్ ఒక అర కిలోమీటర్ దూరం లోనే ఆపేశారు. అక్కడ నుంచి మా హ్యాండ్ బ్యాగ్స్ మాత్రం తీసుకుని మేమందరం నడిచి వెళ్ళాలి. మా లగేజీలు అన్నీ కూలీలు చేరవేశారు. ఎంబసీ దగ్గర క్యూ ఎక్కువ ఉండటంతో అక్కడ ఉన్న నేపాల్ ప్రభుత్వం వారి ఇమ్మిగ్రేషన్ ఆఫీస్' లో కాసేపు కూర్చున్నాం. మన వెంబడే వచ్చిన త్రిశూలి నది ఈ రెండు దేశాల సరిహద్దు అనమాట. రెండు వైపులా ఎత్తైన కొండలు, మధ్యలో త్రిశూలి నది. ఈ నది మీద ఒక బ్రిడ్జ్ ఉంది. ఈ బ్రిడ్జ్ కి ఇటువైపున నేపాల్, అటువైపున టిబెట్ (చైనా) అనమాట. ఈ బ్రిడ్జ్ బైలీ బ్రిడ్జి మోడల్. అంటే విడి విడిగా సెక్షన్స్ తయారు చేసి సైట్ లో అసెంబుల్ చేసుకునే మోడల్ అనమాట. ఎంబసీ దగ్గర క్యూలో ఒక గంట నిరీక్షించాల్సి వచ్చింది. అందరూ ఆ బ్రిడ్జ్ మీద కూర్చున్నాం మా వంతు వచ్చేవరకు. మాతో వచ్చిన షెర్పాలు మా అందరికీ 200 చైనీస్ యువాన్ కరెన్సీ ఇచ్చారు. మాకు అర్థం కాలేదు మాకెందుకు డబ్బులు ఇస్తున్నారో. అప్పుడు వాళ్ళు చెప్పినదేమిటంటే వాళ్ళను అం త డబ్బుతో బోర్డర్ దాటనివ్వరు. అందుకని టూరిస్టులకు ఏమీ అభ్యంతరం చెప్పరు కాబట్టి మాతో ఆ డబ్బు పంపించి, అటువైపు వెళ్ళిన

తరవాత తిరిగి మాదగ్గర నుంచి వెనక్కు తీసుకుంటారని. ఈ డబ్బు దారిలో అనుకోని అవాంతరాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే మాకోసం ఖర్చు పెట్టటానికి టూర్స్ మేనేజ్ మెంట్ వాళ్ళు గైడ్స్ కి ఇచ్చే డబ్బన్నమాట. ఇదేదో బాగానే ఉందనిపించింది. ఎంబసీ ముందు నేపాల్ బోర్డర్ సెక్యూరిటీ వాళ్ళు మా పాస్ పోర్ట్ లు చూసి ఒక్కొక్కళ్ళనీ లోపలికి పంపించారు. బోర్డర్ నుంచి ఈ టూర్ ఏర్పాట్లు చూడటానికి ఒక లయాజన్ ఏజెంట్ వచ్చాడు. మా కైలాష్/మానస సరోవర్ యాత్ర పూర్తి అయ్యి మళ్ళీ తిరిగి మేము ఎంబసీ నుంచి బయట పడేదాకా, లోకల్ అథారిటీస్ తో కో ఆర్డినేట్ చెయ్యటానికి ఆతను మాతోనే ఉంటాడు.

అలా ఓ గంట వెయిట్ చేసిన తర్వాత మా వంతు వచ్చింది. ఆ ఎంబసీ బిల్డింగ్ చాలా మెజెస్టిక్ గా ఉంది. చాలా అందంగా కట్టారా బిల్డింగ్. అంత కొండలలో తమ ధనబలం ప్రదర్శించుకోటానికే అంత గొప్ప బిల్డింగ్ కట్టారా! అనిపించింది. ఎంబసీ లోకి క్యూ లైన్ లో ప్రవేశించాం. ఇంకో పక్కన మా లగేజీలన్నీ స్కాన్ అయ్యాయి. మా హ్యాండ్ బ్యాగ్స్ అన్నీ తనిఖీ చేశారు. మా లగేజీ లో ఉన్న సమిధలు, నెయ్యి అవీ చూసి మావి ఉంచుతారా లేక తీసేస్తారా? అని కంగారు పడి, దేముణ్ణి మనులోనే తలచుకున్నాను.

భగవంతుడి కరుణ వల్ల, మా సామాను ఏమీ చెక్ చెయ్యలేదు. మాలో కొందరు వాళ్ళతో తీసుకెళ్ళిన పూజ పుస్తకాలు తెలుగు భాషలో ఉండటంతో, ఆ భాష వాళ్లకి తెలియక, సీజ్ చేశారు. చెప్పా కదా, దలైలామాకు సంబంధించిన సాహిత్యం ఏమీ మనం దగ్గర ఉంచుకోకూడదని. తెలుగు, ఆ సెక్యూరిటీ వాళ్లకి తెలియని భాష అవటంతో, వాళ్ళ రూల్స్ ప్రకారం, సేఫ్ సైడ్ గా ఉండడానికై పుస్తకాలు సీజ్ చేశారు.

వీసా స్టాంపింగ్ అయిన తరవాత అఫీషియల్ గా చైనా (టిబెట్)లో అడుగుపెట్టాం. అక్కడ రెడీగా ఉన్న బస్ లో ఎక్కి కూర్చున్నాం. ఆ బస్ మన గరుడ బస్సు లాగా చాలా లగ్జరీగా ఉంది. జై భోలేనాథ్, హర హర మహాదేవ్ ఇలా నినాదాలతో మా బస్సు బయలుదేరింది. బస్సులో ప్రతి సీటు దగ్గరా, యు ఎస్ బి చార్జింగ్ పాయింట్లు ఉండడంతో అందరూ తమ తమ గాడ్జెట్లను చార్జింగ్ లో పెట్టారు. చక్కటి రోడ్లు, రోడ్లు పక్కన క్రాష్ గార్డ్ రైల్స్, ప్రయాణం చక్కగా సాగుతోంది. అలా త్రిశూలి నది వెంబడే, నదీ ప్రవాహానికి ఎదురుగా మా ప్రయాణం సాగింది. చైనా బాగా ధనవంతమైన దేశం. ఈ విషయం వాళ్ళ బస్సులు, రోడ్లు చూస్తుంటేనే తెలిసిపోతుంది. ఒక సామాన్య దేశమైన నేపాల్ నుంచి చైనా లోకి అడుగుపెట్టిన మాకు ఆ ధనబలం తేడా ఇట్టే తెలిసిపోయింది.

ప్రకృతికి ధనిక - బీద అని తేడా ఏమీ లేదని చెప్పటానికా అన్నట్టు, అక్కడ కూడా నదీ ప్రవాహానికి రోడ్డు కోసుకుపోయి, బస్సులు ఆగిపోవాల్సి వచ్చింది. ఇదే అదను అనుకుని కిందకు దిగి కాసిని ఫోటోలు తీసుకున్నాం. రోడ్డు రిపేరు చాలా హడావుడిగా చేస్తున్నారు. కొంచెం సేపు అలా గడిచిన తర్వాత, మా టూర్ గైడ్ వచ్చి చెప్పాడు- అయిపోయింది, అందరూ బస్ ఎక్కండి అని. మా తరవాత మజిలీ కేరుంగ్ అనే వూరు. అది మనం

చైతన్యం సంకల్ప బలం

ఇందాక క్రాస్ చేసిన నేపాల్ సరిహద్దు నుండి 26 కిమీ దూరంలో వుంది. ఎక్కువగా ఘాట్ రోడ్డు. ఈ రోడ్డు అంతా చాలా సీనిక్ గా, అందంగా వుంది. పచ్చదనం పరచుకున్న కొండలు, లోయలు కళ్ళకు విందు కలిగించాయి. సాయంత్రానికి కేరుంగ్ చేరాము. 4 స్టార్ హోటల్ లో మాకు బస ఏర్పాటు చేసారు. హోటల్ చాలా బాగుంది. ఇక్కడ కూడా ఫ్రీ వై ఫై సదుపాయం వుంది. కాని నేను ఇదివరలో చెప్పినట్లు మన ఫోన్ కి వి పి ఎన్ (వర్ట్యువల్ ప్రైవేట్ నెట్ వర్క్) సదుపాయం ఉండాలి. ఈ యాప్ ను మేం ముందే డౌన్ లోడ్ చేసుకుని ఉండడంతో, మాకు ఏ సమస్యా రాలేదు. మా సహ యాత్రికులలో కొందరికి ఈ విషయం తెలియలేకపోడం వల్ల వాళ్ళు ఈ ఫ్రీ వై ఫై సదుపాయం వాడుకోలేకపోయారు. మేం చెప్పిన తరవాత వాళ్ళు కూడా వి పి ఎన్ యాప్ డౌన్ లోడ్ చేసుకున్నారు. ఇంకో విషయం ఇక్కడ గమనించింది ఏమిటంటే హోటల్ రిసెప్షన్ లో ఉన్నవాళ్ళు అస్సలు ఇంగ్లీష్ మాట్లాడరు. వాళ్లకి చాలా భాషాభిమానం ఉంది అనిపించింది. ఊరు చిన్నదే అయినా ట్రాఫిక్ లైట్ల వ్యవస్థ అంతా చక్కగా ఉంది. ఇక్కడ కూడా ట్రాఫిక్ కుడి పక్కకే. మన ట్రాఫిక్ ఎడమ పక్క కదా.మంచి టూరిస్ట్ ప్లేస్ అవటం వలన కామోసు

ఎన్నో షాపులు ఉన్నాయి ఇక్కడ. సరదాగా ఊరంతా నడచుకుంటూ తిరిగాం. కొందరు ఔత్సాహికులైతే పక్కనే వున్న చిన్న కొండ మీదకు ట్రెక్కింగ్ కు వెళ్ళారు. రాబోయే కైలాష్ ట్రెక్కింగ్ కు ఇది ప్రాక్టీస్ సెషన్ లాగా. మేము అలా నడచుకుంటూ వెళ్తుంటే మాకొక బౌద్ధుల మందిరం కనిపించింది. దర్శనం చేసుకుందామని లోపలికి వెళ్లాం. ఈ మందిరం 'పగోడా' శైలిలో ఉంది. ఎక్కువ బౌద్ధ మొనాస్టరీలు ఈ ఆకారంలోనే ఉంటాయి. అక్కడ మూడు ధ్వజ స్తంభాలలాంటివి, చెట్టు మానుతో చేసినవి ఉన్నాయి. ఈ బౌద్ధారామాల్లో ప్రార్ధనా చక్రాలు- ప్రేయర్ వీల్స్ కి ఇది సరియైన తెలుగు అనువాదమే అనుకుంటాను- ఉంటాయి. వీటిని మణిచక్రాలు అని కూడా అంటారు. సంస్కృత భాషలోని 'చింతామణి' అనే పదానికి కుదించిన మాటే ఈ మణి. చింతామణి అంటే మదిలో అనుకున్న కోర్కెలను తీర్చేది అని అర్ధం. భక్తులు ఈ గొట్టపు (సిలిండ్రికల్) ఆకారంలో ఉన్న చక్రాలను చేత్తో తిప్పుతారు. ఇవి తిప్పుతున్నప్పుడు 'ఓం మణి పద్మే హుం' అనే మంత్రా-

న్ని ఉచ్చరిస్తూ తిప్పుతారు. ఈ చక్రాన్ని తిప్పటం ధర్మ చక్రాన్ని తిప్పటం అని భావిస్తారు. ఈ గొట్టపు ఆకారపు చక్రాలను సాధారణంగా రాగితో కాని, చెక్కతో కానీ చేస్తారు. వాటి మీద ఇందాక చెప్పిన మంత్రమే కాకుండా ఇంకా కొన్ని మంత్రాలను చెక్కుతారు. ఈ గొట్టాలను తిప్పటం ఆ మంత్రాలను ఉచ్చరించటంతో సమానమని భక్తుల విశ్వాసం. ఎంత ఎక్కువ మార్లు తిప్పితే అంత పుణ్యం వస్తుందని కూడా వీరు నమ్ముతారు. ఈ గొట్టాలను తిప్పటం మనసుకు ప్రశాంతత చేకూర్చే ఒక ప్రక్రియ అని చెబుతారు. పండు ముసలివాళ్ళు కూడా ఇవి తిప్పుతూ ప్రదక్షిణం చేయటం మాకు కనబడింది. ఈ ఆచారం మన భారతీయ బౌద్ధ గురువు ఆచార్య నాగార్జున ప్రవేశపెట్టినదే అని అక్కడ వాళ్ళు చెప్పారు. మేము కూడా అవి తిప్పుతూ ప్రదక్షిణ చేసాం.

ఆ తరవాత కొంచెం ఊళ్ళో తిరిగి హోటల్ కి చేరాం. ఊరు చాలా అందంగా ఉంది. పచ్చటి కొండల మధ్యలో, దూది పింజల్లా ఎగురుతున్న మబ్బులు మనని తాకుతుంటే నిజంగా ఆ అనుభూతి వర్ణించరానిది. హోటల్ కి రాగానే మా గైడ్స్ చెప్పారు ఇక్కడే మీరు మీ కరెన్సీని చైనీస్ యువాన్ లోకి మార్చుకోండి. ముందరకు పోతే మీకు కష్టం అవుతుంది అని చెప్పారు. ఇంటర్నేషనల్ డెబిట్ కార్డ్ ఉన్నవాళ్ళు ఎ టి ఎమ్ లనుంచి చైనీస్ యువాన్ లు తీసుకున్నారు. ఆ కార్డులు లేనివాళ్ళకోసం అక్కడ 'మనీ చేంజర్స్' కూర్చుని వున్నారు. హోటల్ లోనే వాళ్ళు ఉంటారు. ఎక్కువగా ఆడవాళ్లే ఉంటారు. వాళ్ళు మన రూపాయలు (డాలర్స్ ఉంటే-డాలర్స్) తీసుకుని యువాన్ లు ఇస్తారు. మాకు ఒక యువాన్ కి 11 రూపాయల ఇరవై పైసల చొప్పున పడింది. ఆ రోజు ఎక్స్చేంజ్ రేట్ అన్న మాట. మేము ఒక 45 వేల దాకా రూపాయల్ని యువాన్ లోకి మార్చుకున్నాం. నా సలహా ఏమిటంటే మీరు వెళ్ళేటప్పుడు కొంచెం ఎక్కువ డబ్బే తీసుకువెళ్ళండి. దార్లో ఏమి అవసరాలు వస్తాయో తెలీదు కదా. ఎక్కడ వాతావరణ సమస్యలు వస్తాయో తెలియదు. రహదార్లు బ్లాక్ అయిపోతే, హెలికాప్టర్ లో వెళ్ళటానికి ఎక్స్ట్రా డబ్బు మనమే పెట్టుకోవాలి కదా! అలాగే హోటల్ బస కూడా నిర్ణీత సమయం కన్నా ఎక్కువ అవ్వచ్చు. అలాంటప్పుడు అయిన ఎక్స్ట్రా ఖర్చు మనమే

భరించాలి. దారిలో క్రెడిట్ కార్డులు తీసుకోరు. ఈ విషయం తప్పకుండా గుర్తుంచుకోండేం!

రాత్రి భోజనాలకై హోటల్ నుంచి ఒక అర కిమీ దూరంలో ఉన్న డైనింగ్ హాల్ కి వెళ్ళాలి అని చెప్పారు. ఆగస్ట్ నెల కావటంతో కొంచెం వాన తుంపర్లు పడుతున్నాయి. అలాగే నడచుకుంటూ వెళ్ళాము. అక్కడ 'మధుబన్' అనే స్వచ్ఛంద సంస్థ యాత్రికులకు భోజనాలు అరేంజ్ చేసారు. నిజంగా వాళ్ళ సేవకి జోహర్లు చెప్పాల్సిందే. మే నెల నుంచి సెప్టెంబర్ నెల దాకా, అంటే దాదావు 5 నెలలపాటు, కైలాష్ మానససరోవర్ యాత్రికులు వస్తూనే వుంటారు. వెళ్ళిన వాళ్ళందరికీ, అసలు ముఖంలో విసుగు అనేది కనపడనివ్వకుండా, ఆప్యాయంగా వేడి వేడిగా భోజనం పెడ్తున్నారు. అందులో మన వంటలు, మన రుచులతో పెడ్తున్నారు. అక్కడ చక్కటి భోజనం చేసి మళ్ళీ హోటల్ కి

తిరిగి వచ్చాం. కాసేపు హోటల్ లాంజ్ లో కూర్చుని భజనలు కూడా చేసాం. ఆ మరునాడు రెస్ట్ డే. ఎక్లమటైజేషణ్, అంటే మన శరీరాలు ఈ వాతావరణానికి, ఆల్టిట్యూడ్ కి అలవాటు పడటం కోసం ఆ వూళ్ళో ఒక రోజు ఉంచుతున్నారనమాట. అంటే ఎల్లుండి పొద్దున్న పది గంటల కల్లా మా యాత్ర తిరిగి కొనసాగుతుంది. హోటల్ రూమ్ లో గీజర్ అన్నీ ఉండడంతో, పొద్దున్న స్నానాలకు వేడినీళ్ళ సమస్య లేదు. పొద్దున్నే మళ్ళీ

నడచుకుంటూ డైనింగ్ హాల్ కి వెళ్లి వేడి వేడి పూరీ, ఉప్మా, కార్న ఫ్లేక్స్ తిన్నాం. ఒక స్వీట్ ఐటమ్ కూడా ఉందండోయ్. అక్కడ కాఫీ, టీ, హార్లిక్స్, బూస్ట్ అన్నీ వున్నాయి. ఏది కావాలంటే అది తాగచ్చు. అక్కడ తాగిన తరవాత మళ్ళీ రూమ్ లో ఇంకో రౌండ్ తాగటానికి, మాతో తీసుకువెళ్ళిన ఫ్లాస్క్ లో కూడా కాఫీ నింపి తెచ్చుకున్నాం. మళ్ళీ ఊరు చూడటానికి బయలుదేరాం. అక్కడ టిబెటన్ డ్రస్సుల దుకాణం ఒకటి కనపడింది. రండి ట్రై చెయ్యండి అంటూ పిలిచారు మమ్మల్ని. మాలో చాలామంది ఆడవాళ్ళం సరదాగా ఆ టిబెటన్ గౌన్లు వేసుకుని ఫోటోలు దిగాం. వాళ్ళు మమ్మల్ని కొనమని అసలు బలవంతపెట్టలేదు. వాళ్లకు థాంక్స్ చెప్పి వాళ్ళ డ్రస్సులు వాళ్లకి ఇచ్చేసి మళ్ళీ విండో షాపింగ్ చేసుకుంటూ బయలుదేరాము. మధ్యాహ్నం 'మధుబన్' వారి భోజనాలు చేసి కొంచెం విశ్రమించాం. తరువాత రూములు ఖాళీ చేసి, మనకోసం రెడీగా ఉన్న బస్సులో వచ్చి కూర్చున్నాం. నెమ్మదిగా బస్సు బయలుదేరింది హర హర మహాదేవ్ నినాదాల మధ్య. ఊరికి ఓ నాలుగైదు మైళ్ళ దూరంలో ఉన్న చెక్ పోస్ట్ దగ్గరకు చేరాం.

....మళ్ళీ నెల కలుద్దాం

పాలెపు బుచ్చిరాజు

వారు వీరౌతారు

ఆర్నెల్లు సహవాసం చేస్తే వారు వీరౌతారని అంటారు. అంతవరకు బాగానే ఉంది. కాని, వారిలో ఒకరు మంచీ, మరొకరు చెడూ అయినప్పుడు వస్తుంది చిక్కు. మంచి చెడుగా మారుతుందా? లేక చెడు మంచిగా మారుతుందా?

సరిగ్గా అదే ధర్మసంకటం వచ్చింది రామయ్యగారికి. రామయ్యగారి అబ్బాయి సంజయ్ ఏడోక్లాసు చదువుతున్నాడు. సన్నగా పీలగా, అర్భకంగా ఉంటాడు. కానీ చదువులో మాత్రం చాలా చురుకు. ఇలా ఒక్కసారి చెప్పగానే పట్టుకుంటాడు. క్లాసులో ఫస్టు మార్కులు ఎప్పుడూ వాడివే! పిట్టకొంచెం, కూత ఘనం అన్నట్టు, ఇంతబాగా ఎలా చదువుతాడు? అన్నది అందరికీ ఒక ప్రశ్నగానే మిగిలి పోయింది. క్రమం తప్పకుండా బడికి వస్తాడు. ముందరి బెంచిలో కూర్చుంటాడు. పాఠాలు శ్రద్ధగా వింటాడు.

రామయ్యగారి పక్కింటిలోనే లోనే భుజంగం గారు ఉంటారు. వాళ్ళబ్బాయి నాగేశం కూడా ఏడోక్లాసులోనే ఉన్నాడు. వయసులో సంజయ్ కంటే రెండేళ్ళు పెద్ద. కానీ, రెండేళ్ళనుంచీ డింకీలు కొడుతూ, ఇంకా ఏడోక్లాసులోనే ఉన్నాడు. మనిషి మాత్రం ఒడ్డూ, పొడుగూ బాగుంటాడు. పహిల్వానులా ఉంటాడు. చదువులో మాత్రం ఎప్పుడూ వెనక బడే ఉంటాడు. అసలు క్లాసుకి రావడమే ఆలస్యంగా వస్తాడు. వచ్చినా వెనక బెంచిలో కూర్చుంటాడు. పంతులుగారు వాడిని ఎప్పుడూ తిడు తూ ఉంటారు. "సంజయ్ ని చూసి నేర్చుకో" అని చెప్పుతూ ఉంటారు.

కాని అదెలా కుదురుతుంది? సంజయ్ వాళ్ళ నాన్న అతన్ని రోజూ కూర్చోబెట్టి, లెక్కలు, ఇంగ్లీషు నేర్పుతూ ఉంటారు. తెల్లవారు ఝామున లేపి హోమ్ వర్కు చేయిస్తారు. ప్రొద్దుటే స్నానం చేసి పూజలు పూర్తి చేసికాని ఎవరూ ఇంట్లోంచి బైటికి రారు. నాగేశం విషయం వేరు. వాళ్ళనాన్న గవర్నమెంటు ఆఫీసులో క్లార్కు. బాగా తింటాడని అందరూ చెప్పుకుంటారు. పై రాబడి బాగా ఉండడంతో, సిగరెట్లు, తాగుడు అలవాటయింది. ఇంటికి వచ్చే అతని స్నెహితులూ అందుకే వస్తారు. వాళ్ళు మందు పార్టీలు చేసుకున్నప్పుడు సిగరెట్టు పెట్టెలూ, మందు బుడ్లూ తెమ్మని నాగేశానికి పురమాయిస్తాడు భుజంగం. ఇంక వాడికి చదువుకోవడానికి టైము ఎక్కడ దొరుకుతుంది? అదికాక నాన్న రోజూ పేకాడడం, సిగరెట్లు తాగడం చూసిన నాగేశానికి అందులో అంత తప్పేమీ కనిపించలేదు. మందు రుచి ఇంకా మరగలేదు, కాని, సిగరెట్లు ఊదడం మాత్రం నేర్చుకున్నాడు.

ఏమైనా, పరీక్షల్లో ఫెయిలవడం తోటి విద్యార్థులు హేళన చేయడం, పెద్దవాళ్ళు చివాట్లేయడం నాగేశానికి తలవంపుగా ఉండేది. ముఖ్యంగా సంజయ్ తో పోల్చి వాడిలా ఉండడం నేర్చుకోమని ఎవరైనా అంటే, ఒళ్ళు మండేది. వాడి మొహం. వేలెడంత లేడు. 'ఉఫ్ ' అంటే ఎగిరిపోతాడు. గట్టిగా కసిరితే ఏడుపు లంకించుకుంటాడు. వాడూ ఒక మొగాడేనా? అనిపించేది.

రానురాను ఈ సమస్య నాగేశం మనసుని తొలిచేయ సాగింది. దీని నుంచి బైట పడడానికి అడ్డదారులు వెదక సాగాడు. ఎలాగైనా సంజయ్ తో

స్నేహం చేసి, వాడిని ముగ్గులోకి దింపి, వెనబెంచిలోకి లాగేస్తే బెడద తప్పుతుందని ఆలోచించాడు.

అనుకున్నవెంటనే తన ప్లాను అమలులో పెట్టడం ప్రారంభించాడు. మంచి కబుర్లు చెప్తుతూ, నెమ్మదిగా సంజయ్ తో చేయీ, చేయీ కలిపాడు. సరదా సరదాగా కబుర్లు చెప్పాడు. బడికి వస్తున్నప్పుడు, బడినుంచి వెళ్తున్నప్పుడు అతనితో కలిసి నడవ సాగాడు. సంజయ్, తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అని నమ్మే సాత్వికుడు. నాగేశం తనతో స్నేహం కలపడంలో అతనికేమీ తప్పు కనిపించలేదు.

నాగేశం ప్లానులో మొదటి భాగం స్నేహం. అది కలవగానే, నెమ్మదిగా వెనక బెంచి లోంచి ముందు బెంచిలో సంజయ్ ప్రక్కన కూర్చోవడం మొదలు పెట్టాడు. సంజయ్ ముందు బెంచిలో కూర్చోవడమే కాకుండా, పాఠాలు శ్రద్ధగా వింటాడు. ఆ సమయంలో ప్రక్కన బాంబు పడినా అతనికి వినిపించదు. అదుగో, అలాంటి సమయంలో ప్రక్కన జేరి, వేలుతో పొడుస్తూనో, దూరంగా మైదానంలో ఆడుకుంటున్న పిల్లల్ని చూపిస్తూనో, సంజయ్ ధ్యానాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నించేవాడు నాగేశం. సమయం చూసి, పుస్తకంలో పేజీలు చింపేసి, సంజయ్ బాధపడుతూ ఉంటే, చూడనట్టు నటించి, తన పుస్తకం ఎరువు ఇచ్చేవాడు.

ఆటవిడుపు సమయంలో ఒకనాడు, నాగేశం సంజయ్ ని దూరంగా ఉన్నవేపచెట్టు వెనక్కి తీసికెళ్ళి, సిగరెట్టు ముట్టించి, తాగమని బలవంతాన నోట్లో కుక్కాడు. సంజయ్ "అలవాటు లేదు నాకు వద్దు బాబోయ్ !" అంటే "తాగకపోతే నామీద ఒట్టే!" అన్నాడు. సంజయ్ కి తనకంటే బలవంతుడైన నాగేశాన్ని చూస్తే అదోకలాంటి భయం ఉంది. తప్పదురా భగవంతుడా! అని ఒకసారి గట్టిగా దమ్ములాగాడు ఉక్కిరి బిక్కిరి అయి ఒక్కసారిగా దగ్గు తెరలు తెరలుగా వచ్చింది. "ఫరవాలేదు కొంచెం అలవాటయే వరకు అలాగే ఉంటుంది. కాని తరవాత చాలా బాగుంటుంది. ఏవైనా మరిచిపోయిన పాఠాలు గుర్తు చేసుకోవాలంటే, ఒక దమ్ము లాగితే, చాలు అన్నీ గుర్తుకొచ్చేస్తాయి. నేనలాగే చేస్తాను." అని సర్ది చెప్పాడు.

మరొకనాడు, ఖాళీగా ఉన్న పీరియడులో పేక ముక్కల దస్తా తీసుకొచ్చి, 'ఆడుకుందాం! రా!' అని పిలిచాడు. నాగేశం. సంజయ్ 'వాటి రంగులు కూడా నాకు తెలియవు వద్ద'న్నాడు. 'ఇదేమీ పెద్ద బ్రహ్మ విద్య కాదు. నీలాంటి తెలివైన వాళ్ళకి తేలిగ్గా వచ్చేస్తుంది. ఇస్పేటు, కళావరు నల్ల రంగులు, ఆఠీను, డైమాను ఎర్ర రంగులు. ఒక్కక్కటీ పదమూడు ముక్కలుంటాయి.' అన్నాడు నాగేశం ముక్కలు పంచుతూ. "ఏమో! బాబూ! నాకు భయం. ఎవరైనా చూసి హెడ్ మాస్టారికి చెప్పేస్తే?" అన్నాడు సంజయ్. "నువ్వొత్తి పిరికి వాడివి." అని ఎగతాళి చేసేడు నాగేశం. అయినా సంజయ్ పేక మీద చెయ్యి వేయలేదు. ఇంతలో తరవాతి పీరియడు మాస్టారు క్లాసులోకి వచ్చారు.

ఇలా జరుగుతుండగా ఒకనాటి సాయంత్రం రామయ్య గారి దగ్గర స్నేహితుడు, గోపాలరావు గారు పని గట్టుకుని వాళ్ళింటికి వచ్చి, కూర్చున్నాడు.

"ఏంటి విశేషాలు?" అడిగారు రామయ్యగారు.

"విశేషాలకేం! చాలా ఉన్నాయి. నువ్వు వినాలనుకుంటే! నీ మేలు కోరే వాడిని కాబట్టి చెప్తుతున్నాను. ఈ మధ్య నీ కొడుకు సంజయ్ , ఆ భుజంగంగారబ్బాయి నాగేశంతో కలిసి చెట్టాపట్టాలేసుకుని మరీ తిరుగుతున్నాడు. వాడొట్టి తుంటరి వెధవ అని అందరికీ తెలుసు. అలాంటి వాడితో నీ కొడుకుని ఎందుకు తిరగనిస్తున్నావు?" అన్నాడు.

"అలాగా! అని ఆశ్చర్యపడి, "నేనెప్పుడూ ఆ విషయాన్ని గురించి ఆలోచించనే లేదు. ఏదో ఇద్దరూ ఒకే క్లాసులో ఉన్నారు కదా, స్నేహం కలిసిందని అనుకుని ఊరుకున్నాను.

(16 వ పేజీ చూడండి)

వేమూరి వేంకటేశ్వరరావు

అంకెలు, సంఖ్యలు: రెండు

రెండు కి సంబంధించిన మాటలు తెలుగులో జోడీ, జోడు, జత, జంట, ఇరు, ఉమ్మడి అన్న మాటలలోనూ, సంస్కృతంలో యుగళ, యుగ్మ, ఉభయ, ద్వి, ద్విగు, ద్వంద్వ, ద్వయి, ద్వైత, మొదలైన రూపాలలోను కనిపిస్తాయి.

జోడీలు అంటే జతలు, జంటలు. జోళ్ళు అంటే పాదరక్షలు; ఈ జంటలో ఒకే ఒక దానిని గురించి మాట్లాడవలసి వచ్చినప్పుడు దానిని పాదరక్ష అనో, చెప్పు అనో చెప్పవచ్చు. సులోచనాలని కళ్ళజోడు అని మనం అంటే, ముక్కుజోడు అని తమిళులు అంటారు.

ఈరు, ఇరు అన్నప్పుడు రెండు, ఇద్దరు అని రెండర్థాలు ఉన్నాయి. ఈరారు అంటే 12, ఈరేడు అంటే 14, ఈరెనిమిది 16.

ఇరుకెలకులు, ఇరుచక్కి, ఇరుదిసలు, ఇరువంకలు – ఈ మాటలన్నిటికి 'రెండు పక్కలు' అని అర్థం.

ఇరుగు, పొరుగు వారితో సఖ్యంగా ఉండాలంటే వారితో ఉమ్మడి వ్యాపారం చెయ్యకూడదు.

యుగళ గీతం అంటే 'డూయట్' లేదా ఇద్దరు పాడే పాట. ఈ ఇద్దరిలోను ఒకరు ఆడ, మరొకరు మగ అవాలని నిబంధన ఉందో, లేదో నాకు తెలియదు. ఇద్దరు మగవాళ్ళు యుగళగీతం పాడడం నేనెప్పుడూ వినలేదు.

యుగళ అనే మాట యుగ్మం లోంచి వచ్చింది. పూజ చేసేటప్పుడు 'వస్త్రయుగ్మం సమర్పయామి' అన్నప్పుడు, పంచ, కండువా కాని, చీర, రవికల గుడ్డ అని కాని మనం అర్థం చేసుకోవాలి.

ఈ యుగ్మం లోంచి వచ్చినదే యోగ అన్న మాట. యోగం అంటే మనస్సునీ, శరీరాన్నీ సంధించటం. అంటే మనస్సు అధీనం లోకి శరీరాన్ని తీసుకురావటం. ఈ ప్రక్రియలో యోగాసనాలు ఒక చిన్న భాగం మాత్రమే.

స్త్రీ యొక్క అండంతో పురుషుడి బీజం సంయోగం చెందిన తర్వాత మిగిలేదే యుగ్మం + అండం = యుగాండం, లేదా ఇంగ్లీషులో 'జైగోట్'. మనం బజారులో కొనుక్కునే కోడిగుడ్డు అండమా, యుగాండమా అని నాకు ఇప్పటికీ అనుమానం నివృత్తి కాలేదు.

రెండు వేదాలు చదివిన పండితుడు ద్వివేది. వేదుల, ద్వివేదుల అన్న ఇంటిపేర్లు తెలుగు వారిలో బాగానే కనిపిస్తాయి కాని, త్రివేదుల, చతుర్వేదుల కొంచెం తక్కువ, మనలో. ఉత్తరాది వారిలో త్రివేదీ, చతుర్వేదీ బాగా కనిపిస్తారు. వేదుల వారు మాత్రం ఒంటి వేదుల వారే.

రెండు భాషలు వచ్చిన ఆసామీ దుబాసీ. ఇదే మాటని 'ట్రాన్స్‌లేటర్' అన్న అర్థంలో మనం వాడేస్తూ ఉంటాం.

వైష్ణవుడు అయినవాడు జపించవలసిన మంత్రాలలో ద్వయం ఒకటి. "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే. శ్రీమతే నారాయణాయనమః" అనేది ద్వయ మంత్రం. దీనినే మంత్రరత్నం అని కూడ అంటారు.

మధ్వాచార్యులవారు స్థాపించిన శాఖ ద్వైతం. అహం బ్రహ్మాస్మి అంటే వీరు ఒప్పుకోరు. జీవాత్మ, పరమాత్మ ద్వివిధమైన ఆత్మలు అని వీరి సిద్ధాంతం.

మహాభారతంలో ద్వైతవనం అనే అడవి కనిపిస్తుంది. కాని ఈ

అడవిలో ఉన్న ద్వైతం ఏమిటో? కలనేత వస్త్రాన్ని హిందీలో 'దోరంగి' అంటారు. అంటే రెండు రంగుల బట్ట. ఈ 'దో' లోంచి వచ్చినదే 'దోయి'. కనుదోయి, చనుదోయి అన్నవి తెలుగు మాటలే. రెండు చేతులని కలిపి దొన్నెలా చేస్తే వచ్చేది దోయిలి. దీన్నే మనం దోసిలి అని కూడ అంటాం.

కంప్యూటర్లు వాడకం లోకి వచ్చేక ద్వియాంశ ('బైనరీ') పద్ధతి పరపతి పెరిగింది; అంతవరకు అంకెలని దశాంశ పద్ధతిలోనే లె-క్కించేవారు.

ద్వితీయం అంటే రెండవది. కాని, రెండవ పెళ్ళి అన్న అర్థం లోనే ఎక్కువగా వాడతారు. అద్వి-తీయం అంటే మొదటిది అనే అర్థం – మొదటి పెళ్ళి అని కాదు. ఆలోచిస్తే "మొదటి పెళ్లి" అనే పదబంధానికి అర్థం లేదు.

జీవశాస్త్రంలో ప్రతి జంతువుకీ, మొక్కకీ ద్వినామ ('బైనరి') పద్ధ-తిలో పేర్లు పెడతారు; మొదటిది జాతి పేరు, రెండవది శాల్తీ పేరు. మనకి ఇంటి పేరు, పెట్టిన పేరు ఉన్నట్లే ఇది కూడ.

ద్విత్వాక్షరం అంటే ఒక అక్షరం కింద మరొకటి రావటం. ద్విత్వా-క్షరం అన్న మాటలో మూడు ద్వి-త్వాక్షరాలు ఉన్నాయి. ఒక అక్షరం కింద అదే అక్షరం పునరుక్తం అయితే అది ద్విరుక్తాక్షరం. అమ్మ, అక్క, కర్ర, కప్పు మొదలైన మాటలలో రెండవ అక్షరాలు ద్వి-రుక్తాక్షరాలు. ద్విత్వానికీ, ద్విరుక్తా-నికీ మధ్య ఉన్న ఈ తేడాని చాల మంది గమనించరు.

ద్విరదం అంటే రెండు కోరలు కలది. – ఏనుగు. రెండు కోరలు కల జంతువులు ఇంకా ఉన్నాయి కాని, సందర్భ శుద్ధి లేనప్పుడు ఏనుగనే చెప్పుకోవాలి. ద్విజి-హ్వాలు అంటే రెండు నాలుకలు గలవారు. అమెరికా రాజకీయ నాయకులు ఒకళ్ళకి చెయ్యమ-ని చెప్పేది ఒకటి, వారు చేసేది మరొకటి కనుక వీరిని ద్విజిహ్వా-లు అంటే నేను ఏమీ అనుకోను. నేనిలా అన్నానని మనం అమెరికా వాళ్ళ మీద విరుచుకు పడిపో-నక్కర లేదు. మన వాళ్ళు ఏమీ తక్కువ కాదు; వారి కంటె వీరు రెండాకులు ఎక్కువ చదివిన వారే.

ద్విపద అంటే రెండు పాదాలు కల ఒక పద్య విశేషం.

ద్విరేఫం అంటే రెండు 'రేఫ'లు – అనగా 'ర' కారాలు – కలది, భ్రమరం. దీనినే మనం తుమ్మెద అని కూడ అంటాం. ఇది ఒక జాతి తేనెటీగ.

ద్విజం అంటే రెండు జన్మలు కలది. గుడ్డు లోంచి పుట్టిన జీ-వులన్నీ ద్విజములే. మానవుల-లో రెండు సార్లు పుట్టిన వారు ద్విజులు – అనగా ఉపనయనం అయిన వారు.

రెండు జడల సీతని ద్విజడ అనొచ్చు కానీ, రెండు జడల సీత అంటేనే బావుంటుంది.

నదిలో రెండు వైపులా నీరుండి మధ్యలో నేల ఉంటే అది ద్వీపం. ద్వీపం లో పుట్టిన వాడు ద్వైపా-యనుడు. అలా పుట్టిన వాడు నల్లగా ఉంటే అతగాడు కృ-ష్ణద్వైపాయనుడు అవుతాడు. వ్యాసుడు పేరు లేని వాడు; అతని తల్లిదండ్రులు పేరు పెట్టే లోగానే అడవులలోకి తపస్సు చేసుకుందికి వెళ్ళిపోయేడు. ద్వీపంలో పుట్టిన నల్లవాడు కదా అని మొదట్లో కృష్ణద్వైపాయను-డు అని పిలచే వారు. దరిమిలా వేదాలని సంస్కరించేడు కదా అని "వ్యాసుడు" అనే బిరుదుతో పిలుస్తున్నాము. .

రెండర్థాలు ఉన్న పద్యాన్ని ద్వ్యర్థి అంటారు.

ద్విచక్కెర అంటే రెండు చక్కె-రలు కలసి ఉన్న పదార్థం. మనం కాఫీ లో వేసుకునే పంచదారలో గ్లూకోజు, ఫ్రూక్టొజు అనే రెండు చక్కెరలు ఉన్నాయి కనుక అది ద్విచక్కెరే.

ఎలక్ట్రానిక్స్ లో తారసపడే కొన్ని శూన్య నాళికలో ఒక ఏనోడు, ఒక కేథోడు ఉంటాయి కనుక వీటిని 'ద్వియోడు' అనాలని నా గోడు.

ద్విగుణీకృతం అంటే రెట్టింపు చెయ్యటమే కాని, ద్విమాత్రకం అంటే రెండు కొలతలు కలది అని అర్థం. దీనిని ఇంగ్లీషులో 'టు డైమెన్షనల్' అంటారు.

రెండుకి సంబంధించిన మాటలు ఇంగ్లీషులో కొల్లలు. రెండుని ఇంగ్లీషులో 'టు' అంటాం. ఈ 'టు' స్పెలింగు 'టి, డబల్‌యు, ఒ'. ఈ మూడింటిలో మొదటి రెండక్షరాలు అయిన 'టి. డబల్‌యు' లు పక్క పక్కని ఎప్పుడు వచ్చినా 'రెండు' అనే అర్థం స్ఫురిస్తుంది. 'ట్వైలైట్' అంటే పగలు కాదు, రాత్రి కాదు; ఈ రెండింటికి మధ్య ఉన్న సంధ్య వేళ. 'ట్వైన్' అంటే రెండు పేటలు వేసి పేనిన దారం. మనం మరచి పోయేం కాని, దీనినే తెలుగులో జమిలిదారం అనేవారు. 'ట్విల్' అంటే రెండు రకాల దారాలతో నేసిన బట్ట. ఒక కొమ్మ చీలి రెండుగా అయితే వచ్చినది 'ట్విగ్'.

డూప్లికేట్ అంటే జతలో ఒకటి. ఇదే మాటని మనం 'నకలు' అనే అర్థంలో వాడతాం. 'అసలు' రైలు బండి ఏ కారణం చేతనైనా ఆగిపోతే దాని స్థానంలో వచ్చే మరొక బండిని 'డూప్లికేటు' అనే వాళ్ళం – నా చిన్న తనం లో.

'డూస్' అంటే రెండు. టెన్నిస్ లో 'డూస్' అన్నప్పుడు, మరి రెండు 'పాయింట్లు' వరుసగా ఎవ్వరు గెలిస్తే వారు ఆట గెలిచినట్లు.

'బి', 'బిస్', 'బై', అనే ప్రత్యయాలని జోడించి, 'రెండు' మాటలని ఎన్నో తయారు చెయ్యవచ్చు. రెండు సార్లు (లేదా, రెండు వైపులా) ఉడికించినది కనుక 'బిస్కట్' అన్నారు. రెండు పక్కలా కాల్చిన అట్టు కనకనే మన దోశలోని 'దో' వచ్చిందేమో అని నాకు చిన్న ధర్మ సందేహం వస్తున్నాది. రెండు కళ్ళకీ అమరే పరికరం కనుక 'బైనాక్యులర్స్' అయింది. రసాయన శాస్త్రం లో రెండింతలు అనటానికి 'బిస్' అనే పూర్వ ప్రత్యయం వాడతారు.

రెండు సమభాగాలుగా విడదీసినప్పుడు 'బైసెక్ట్' అన్న మాటని వాడతాము గాని ఇక్కడ రెండుగా విడతీయటంలో చెడు ఏమీ జరగలేదు. కాని, 'డై, డిస్' అనే ప్రత్యయాలు వాడినప్పుడు చీల్చటం, విడదీయటం అనే అర్థాలు వస్తాయి కాని, ఇక్కడ ఈ విడతీయటం మంచిది కాదు అనే అర్థం స్ఫురిస్తుంది. ఏ కీలుకా కీలు కోసేసే పద్ధతిని ఇండియాలో 'డిస్సెక్ట్' అనీ, అమెరికాలో 'డైసెక్ట్' అనీ అంటారు. ఈ జాతికి చెందిన మాటలే 'డిస్రప్ట్', 'డిస్టర్బ్', 'డివోర్స్' మొదలైనవి.

'బైసెక్ట్' గురించి మరొక విషయం. వృత్తలేఖిని, కొలబద్ద సహాయంతో ఒక గీతని కాని, కోణాన్ని కాని సమద్విఖండన చేయవచ్చని రేఖాగణితంలో దిట్టలయిన గ్రీకులు ఎప్పుడో కనుక్కున్నారు.

గణితంలో రెండుకి ఉన్న ప్రత్యేకత ఏమిటంటే ప్రధాన సంఖ్యలలో ఇదొక్కటే సరి సంఖ్య; మిగిలినవి అన్నీ బేసి సంఖ్యలే. రెండు ఫిబొనాచీ సంఖ్య. రెండు రెళ్ళని కలిపినా, గుణించినా నాలుగే వస్తుంది. ఇదే విధంగా ఏ అంకెని మూడు సార్లు వేసి కలిపినా, గుణించినా ఒకే సమాధానం వస్తుందో చెప్పుకోండి, చూద్దాం. కావలిస్తే కాగితం, కలం వాడండి. రెండు యొక్క వర్గమూలాన్ని పైథాగోరస్ సంఖ్య అంటారు. దీనిని ఏ రెండు సంఖ్యల నిష్పత్తి గాను రాయలేము కనుక ఇటువంటి సంఖ్యలని అనిష్ప సంఖ్యలు ('ఇర్రేషనల్ నంబర్స్') అంటారు. ఇక్కడ 'ఇర్రేషనల్' అన్నప్పుడు తర్కాభాసమని కాకుండా 'రేష్యో' (నిష్పత్తి) కాని' అని తాత్పర్యం చెప్పుకోవాలి.

ఈ వ్యాసం ముగించే లోగా అంకెల మాటలతో చిన్న చెలగాటం ఆడదాం. ఈ దిగువ చూపిన అంకెల వరస ('సీక్వెన్స్') వెనక ఉన్న వరస (తర్కం) ఏమిటో చెప్పుకోండి చూద్దాం?

1, 11, 21, 1211, 111221, 312211, 1311221, …

సూచన: కొద్ది సేపు ఆలోచించినా చెప్పుకోలేక పోతేనే ఈ దిగువ ఇచ్చిన సమాధానం చూడండి. ఈ ఆట ఇంగ్లీషులో బాగా రాణిస్తుంది. తెలుగులో కూడ ప్రయత్నించి చూద్దాం. ఇక్కడ లెక్కల 'ట్రిక్కు' ఏమీ లేదు. మాటలతో చెలగాటమే. కొంచెం సేపు ఆలోచించి సమాధానం తెలియకపోతేనే దిగువ ఇచ్చిన సమాధానం చదవండి.

సమాధానం: మొదటి అంకె ఒకటి కదా. దీనిని 'ఒక ఒకటి' అని తెలుగులోనూ, 'వన్ వన్'

అని ఇంగ్లీషు లోనూ అంటాము కదా. ఇంగ్లీషులో 'వన్ వన్' అని అన్నప్పుడు, మొదటి వన్ విశేషణం, రెండవది విశేష్యం. ఇప్పుడు ఈ రెండింటిని విశేష్యాలుగానే భావిస్తే 'వన్ వన్' కాస్తా 11 అవుతుంది. అవునా? ఇప్పుడు 11 'రెండు ఒకట్లు' లేదా 'టు వన్స్' కనుక దీనిని '21' అని రాయవచ్చు. ఇప్పుడు ఈ '21' ని 'ఒక రెండు, ఒక ఒకటి,' అనొచ్చు. దీనినే ఇంగ్లీషులో అంటే, 'వన్ టు, వన్ వన్' అవుతుంది. ఇదే తర్వాత వచ్చే సంఖ్య – 1211.

ఈ 1211 ని వన్ వన్, వన్ టు, టు వన్స్' అందాం. ఇందులో మొదటి 'వన్ వన్ ని 11 గా రాద్దాం. అలాగే 'వన్ టు' ని 12 గా రాద్దాం. 'టు వన్స్' కి బదులు 21 అని రాద్దాం. ఇప్పుడు వీటన్నిటినీ గుత్తగుచ్చితే 111221 వస్తుంది. తమాషాగా లేదూ?

వారు వీరౌతారు

(12 వ పేజీ తరువాయి)

ఇంతకీ ఏమైంది?" అని అడిగారు రామయ్యగారు.

"అంటే? నువ్వు ఏమైనా అయ్యే దాకా కాలిమీద కాలేసుకుని కూర్చుంటావా? చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం? ముందుగానే జాగ్రత్తపడమని చెప్తున్నాను. ఇనుముతో స్నేహం అగ్ని దేవుడంతటి వాడికి సమ్మెట దెబ్బలకి దారి తీసిందన్న సామెత నువ్వు వినలేదా? "

"నువ్వు చెప్పింది నిజమేనయ్యా! కాని, మా సంజయ్ మీద నాకు గట్టి నమ్మకం ఉంది. బాగానే చదువుతున్నాడు కూడా. అల్లరి చిల్లరిగా తిరిగే అలవాటు లేదు వాడికి. అదీ కాక నాగేశంతో తిరిగినంత మాత్రాన సంజయ్ పాడైపోతాడని ఏముంది? అగ్నితో స్నేహం కలపడం వల్లనే ఇనుప ముక్క మనకి కావలసిన రూపంలో తయారవుతుంది కదా! అలాగే సంజయ్ ని చూసి నాగేశంలోనే మార్పు రావచ్చుకదా!" అన్నారు రామయ్యగారు.

"నీదంతా వితండ వాదం. అయినా కందకిలేని దురద కత్తిపీటకి ఎందుకని, నా కెందుకొచ్చిందిలే! వస్తాను." అంటూ వెళ్ళిపోయారు గోపాలరావుగారు.

సంజయ్ నాగేశంల స్నేహం కొనసాగుతూనే ఉంది. సంజయ్ ని వెనక బెంచీలోకి లాగడం కష్టం కాబట్టి నాగేశానికి ముందు బెంచిలో కూర్చోక తప్పడంలేదు. ఆ కారణంగా మేష్టారు చెప్పినవి బలవంతంగా చెవినపడి కొంతలో కొంత చదువు అబ్బసాగింది. మరి వెనక బెంచిలోలాగా, నిద్రపోవడం, చీట్లాట ఆడుకోవడం ఇక్కడ సాగదు కదా! తను పది చెప్పినా, సంజయ్ చెప్పింది ఒక్కటేనా విన వలసి వస్తోంది.

నిత్యమూ సంజయ్ తోటే కాలం గడిచి పోవడంవల్ల టైము చాలక సిగరెట్లు తాగడం కూడా తగ్గింది. సమయానికి ఇంటి పట్టున ఉండక పోవడంతో, వాళ్ళ నాన్న భుజంగం, తానే స్వయంగా బజారుకి పోయి మందు బుడ్లు, సిగరెట్లు కొనుక్కుంటున్నాడు.

ఈ విధంగా కొంత మాస్టారు చెప్పింది, కొంత సంజయ్ చెప్పింది వంట బట్టి, అర్ధ సంవత్సరం పరీక్షల్లో పాస్ మార్కులకంటే ఎక్కువ గానే మార్కులొచ్చాయి నాగేశానికి. క్లాసులో కుర్రాళ్ళందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. సంవత్సరాంతంలో అందరితోబాటు నాగేశమూ పాసై పై క్లాసుకి వచ్చేశాడు.

"ఈ వెధవ పనికొచ్చేలా ఉన్నాడే!" అన్నాడు వాళ్ళనాన్న భుజంగం భార్యతో.

ఇప్పుడు సంజయ్ ని నాగేశం 'గురూ' అని పిలుస్తున్నాడు.

ఆర్నెల్లకి మించిన సహవాసమే కాబట్టి వారు వీరయ్యారు.

ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

"బావా, నిన్ను నేను ఎప్పుడూ శ్రీకృష్ణుని గానే భావించాను. ఎంతమందికో నువ్వు ఎన్నో విధాల సహాయం చేసావు, ఎంతమందినో ఆదుకున్నావు, చేరదీశావు, ఎంతో మంది ప్రేమికులని కలిపావు. ఎన్ని రకాలుగా ఎంతమందికి సహాయాలు అందించినా 'నేను ఇది చేసాను' అని ఏనాడు చెప్పుకోని ఉత్తముడివి. చేసిన సహాయాలకి ప్రతిఫలం ఆశించకపోవడమే కాదు, షాజహాన్ లాంటి ప్రాణమిత్రుడు ప్రతిఫలంగా తన బిజినెస్‌లో వాటా ఇస్తానన్నా సున్నితంగా తిరస్కరించావు. అలాంటిది నువ్వు ఈ రోజు నీకు అత్యంత ఆత్మీయురాలైన అనూకి ఇచ్చిన మాట తప్పి తాగుతానంటే నేను చూస్తూ ఊరుకోను. దానికి నువ్వు నాకు ఏ శిక్ష విధించినా నేను ఆనందంగా స్వీకరిస్తాను" అని ఉద్వేగంతో అన్నాడు అవినాశ్.

"అవినాశ్" అని కోపంగా అరిచి, "ఏమిటిది? ఆప్తుడివి, ఆత్మీయుడివి అని నీతో నా బాధ పంచుకుని, కాస్త డ్రింక్ తీసుకొని రిలాక్స్ అయితే నా మనోవ్యధ తీరి ఉపశమనం కలుగుతుందని నీ దగ్గరికి వస్తే, నాకు సహకరించడం లేదు" అన్నాడు కృష్ణమోహన్.

ఇక లాభం లేదనుకొని "బావా ఒక పని చెయ్యి, నా కోసం డ్రింక్ చేయకుండా కాస్సేపు ఆగు, అప్పటికీ నీకు డ్రింక్ చెయ్యాలని అనిపిస్తే చెయ్యి, నేను అభ్యంతర పెట్టను, సరేనా?... పొద్దున్న నుండి తిండి కూడా సరిగా తిన్నావో లేదో, ఈ స్నాక్స్ తింటూ వుండు, కాస్త హార్లిక్స్ కలిపి తీసుకు వస్తాను అది తాగి సేదతీరు. తరువాత నీ నిర్ణయాన్ని శిరసావహిస్తాను"

లోపలికి వెళ్ళి హార్లిక్స్ కలిపి అందులో ఒక చిన్న టేబ్లెట్ ముక్క కలిపి తీసుకు వచ్చి కృష్ణమోహన్‌కి ఇచ్చాడు అవినాశ్. హార్లిక్స్ తాగుతూ "ఇందాకా కోపంగా మాట్లాడినందుకు ఐ యాం సారీ బావా" అని నొచ్చుకుంటూ అన్నాడు కృష్ణమోహన్.

"ఏమిటి బావా ఈ ఫార్మాలిటీస్. నువ్విలా థాంక్స్‌లూ, సారీలు చెప్పి నన్ను పరాయివాడిని చేయకు. అది సరే, డ్రింక్ చేసే లోపల నువ్వు నాకు ఒక మాట ఇవ్వాలి. లావణ్య పెళ్ళి ఎల్లుండే కదా, అందుకని నువ్వు అన్ని విషయాలూ మరచిపోయి రేపు ఉదయం నుండి హుషారుగా పెళ్ళి పనులలో పాల్గొనాలి, లేకపోతే నువ్వు అనూని చూసి కలత చెందావన్న సంగతి తెలిసందంటే, అందరి దృష్టి మీ ఇద్దరి మీదే వుండి అక్కడ పెళ్ళి సంగతి మరచిపోయి అందరూ మీ ఇద్దరినే సినిమా చూసినట్లు చూస్తూ వుంటారు. నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకుంటే ఎక్కువ నష్టపోయేది అనూరాధే ఆలోచించు" అన్నాడు అవినాశ్. అవినాశ్ మాటలు కృష్ణమోహన్ మీద ప్రభావం చూపాయి. "అవును బావా, నువ్వు కరక్ట్‌గా చెప్పావు, నువ్వు చెప్పినట్లే చేస్తాను" అన్నాడు. అవినాశ్ కలిపిన మత్తు మందు బాగానే పనిచేసింది, మాట్లాడుతూ, మాట్లాడుతూ నిద్రలోకి జారుకున్నాడు కృష్ణమోహన్.

కృష్ణమోహన్ ఇక్కడికి వస్తున్నట్లు ఎవరికీ చెప్పలేదన్నాడు అందుకని రుక్మిణి వాళ్ళు కంగారు పడతారు అనుకొని చేతికున్న గడియారం చూసుకున్నాడు అవినాశ్...తొమ్మిదీ ఏభై అయింది, వెంటనే ఫోన్ డైల్ చేసాడు.

రాత్రి పది అవుతున్నాది ఈయన ఎక్కడికి వెళ్ళారో, ఏం చేస్తున్నారో అని రుక్మిణి చాలా కంగారు పడుతున్నాది, అయితే తన

కంగారు బయటికి కనపడకుండా జాగ్రత్త పడుతున్నాది. ఎంత జాగ్రత్త పడినా ఆమె కంగారుని అనూరాధ పసిగట్టింది. బావ నా కోసం ఆలోచిస్తూ తిండీ తిప్పలూ లేకుండా ఎక్కడ తిరుగుతున్నాడో అని తనకీ కంగారుగానే వుంది, ఆ కంగారుని ఆపుకోలేక "ఏమండీ, మీ వారు ఇంకా రాలేదా?" అని అడిగింది.

"అదే చూస్తున్నానండి ఆలస్యం అవుతుంది కంగారు పడకు అన్నారు, అయినా సమయం పది అవుతున్నాది, ఫోన్ కూడా చెయ్యలేదు" అంది రుక్మిణి. అదే సమయంలో ఫోన్ మ్రోగింది. మురళి ఫోన్ ఎత్తి "హలో" అన్నాడు.

మురళి గొంతు గుర్తు పట్టి "ఆ మురళి ఏమిటి సంగతులు? బాగున్నావా" అని అడిగాడు అవినాశ్.

"హలో బాస్ నువ్వా! ఏమిటి విశేషం? ఈ సమయంలో ఫోన్ చేసావు?" అన్నాడు.

"చెబుతాను, ముందు మీ పెద్ద వదినకి ఫోన్ ఇయ్యి మాట్లాడాలి" రుక్మిణి ఫోన్ తీసుకొని "చెప్పు అన్నయ్యా" అంది.

"చూడమ్మా, బావ ప్రస్తుతం మా ఇంట్లోనే వున్నాడు, నిద్ర పోతున్నాడు" అని అంటూ వుండగానే..." ఆయనకి ఏమయింది? ఎలా వున్నారు?" అని కంగారుగా అడిగింది రుక్మిణి.

"చెల్లమ్మా, అనవసరంగా కంగారు పడకుండా నేను చెప్పేది విను, నువ్వు కంగారు పడితే అక్కడ మిగతా వాళ్ళంతా ఏదో జరిగిందని కంగారు పడతారు. బావకి ఏమీ అవలేదు, క్షేమంగా వున్నాడు. మా ఇంటికి వచ్చాడు, చాలా వ్యాకులత చెంది వున్నాడు...డ్రింక్ చేద్దామని విస్కీ కూడా తీసుకొచ్చాడు, కష్టపడి ఎలాగో ఆపగలిగాను. హార్లిక్స్లో ఒక టేబ్లెట్ కలిపి ఇచ్చాను, హాయిగా నిద్ర పోతున్నాడు... అమ్మా రుక్మిణీదేవి, మీ శ్రీకృష్ణుడు బాగానే వున్నాడు, ఈ అర్జునుడికే సరదా తీరిపోయింది" రుక్మిణి అందోళన పడకుండా వుండడం కోసమే వేళాకోళం చేస్తూ మాట్లాడాడు అవినాశ్.

"ఇంతకీ ఆయన భోజనం చేసారా లేదా అన్నయ్యా, నేనక్కడికి రానా"

"అంతేనమ్మా, పెళ్ళయ్యాక ఆయన భోజనం చేసారా? లేదా? అనే అడుగుతారు ఆడపిల్లలు, అంతేగాని అన్నయ్యా నువ్వు తిన్నావా? లేదా? అని అడగరు". అవినాశ్ గురించి బాగా తెలిసిన రుక్మిణి అవినాశ్ కావలనే జోక్స్ వేసి పరిస్థితి సీరియస్గా లేదని చెబుతున్నాడని అర్థమయింది.

"అయితే ఆయనకి ఇపుడపుడే తెలివి రాదా?"

"ఉంకొక గంటలో తెలివి వస్తుంది. అప్పుడు లేచి మళ్ళీ డ్రింక్స్ అంటే ఆపడం నా తరం కాదు. అందుకని నువ్వు మురళిని తీసుకొని, ఇద్దరు మనుషులకి సరిపడ భోజనం తీసుకొని కారులో మా ఇంటికి రండి. మీ భోజనాలు పూర్తి చేసుకొని రండి, కంగారు లేదు. ఎవరికీ ఏమీ చెప్పొద్దు, ముఖ్యంగా అనూరాధకి. ఎవరైనా అడిగితే ఏదో ఒకటి చెప్పి సంబాళించు, ఒక సారి మురళికి ఫోన్ ఇయ్యి"

మురళి ఫోన్ అందుకున్నాక "నువ్వు మీ పెద్దవదిన కారులో మా ఇంటికి రండి, మీ వదినని ప్రశ్నలు ఏమీ అడగవద్దు, ఇక్కడికి వచ్చాక విషయం నేను చెబుతాను, కంగారు ఏమి పడవద్దు, నిదానంగా రండి" అన్నాడు అవినాశ్.

రుక్మిణి కంగారుగా ఫోన్లో మాట్లాడడం అంతా అనూరాధ గమనించింది. ఇటునుండి మాట్లాడిన మాటలు బట్టి కృష్ణమోహన్ తన గురించే ఆలోచిస్తూ ఏదో చేసి వుంటాడని అర్థమైంది. అతను క్షేమంగా వుండాలని మనసులో భగవంతుడిని వేడుకొంది. రుక్మిణిని అడిగితే ఏమనుకుంటుందో అని మొహమాట పడింది. అయితే రుక్మిణి, మురళి బయటకు వెళ్ళడం చూసి "కృష్ణ ఫోన్ చేసాడా?" అని ఆత్రుతగా అడిగింది.

"ఇప్పుడే ఫోన్ వచ్చింది, ఆయన మా ఇంట్లో వున్నారండి, అవినాశ్ని మీకు తెలుసు కదా అతను, ఈయన కబుర్లలో పడి టైం మరచిపోయారట, అలసటగా వుంది అక్కడికే క్యారేజీ తీసుకు రమ్మన్నారు. అందుకే మేము వెళుతున్నాము" అని ఆ క్షణానికి తోచినది చెప్పింది. రుక్మిణి అబద్ధం చెబుతున్నాదని తెలిసినా, అంతకంటే వివరాలు అడగటం సంస్కారం కాదని ఊరుకొంది అనూరాధ. రుక్మిణి వెళ్ళి పరిస్థితిని చక్కదిద్దుతున్నాది

కదా అని ఊరట చెందింది.
"వైదేహి వదినగారు కనబడలేదు, మీరు ఆవిడని కలిసి రేపు ఉదయం ఆరు గంటలకల్లా వస్తామని నా మాటగా చెప్పండి" అని అనూరాధతో చెప్పి మురళితో బయలుదేరింది రుక్మిణి.
మురళికి అంతా గందరగోళంగా వుంది. అవినాశ్ వాళ్ళింటికి రమ్మన్నాడు, వదినేమో అన్న య్యా తన ఇంట్లోనే వున్నట్లు మాట్లాడుతున్నాది, అసలేం జరుగుతున్నాదో అర్థం కాలేదు. కారు దగ్గరకి వెళ్ళిన తరువాత "అవినాశ్ ఇంటికేనా?" అని అడి గాడు, రుక్మిణి అవునని తల ఊపింది.

****

సోఫాలో పడుకున్న కృష్ణమోహన్ని నిశితంగా చూస్తున్నాడు అవినాశ్. కలత చెందటానికి కారణమైన కృష్ణమోహన్ గతం అంతా ఒక్కసారి అవినాష్ కళ్ళ ముందు తిరిగింది ...

అవి కాకినాడ ఇంజనీరింగ్ కాలేజిలో చదువుతున్న రోజులు...

మొదటి సంవత్సరం పరీక్షలయిన తరువాత వేసవి సెలవులకి కృష్ణమోహన్ విశాఖ పట్నం వెళ్ళినపుడు అతని హైస్కూల్ మిత్రుడొకడు తన పిన తల్లి కొడుకు అవినాశ్ గురించి చెప్పాడు. కృష్ణమోహన్ రెండవ సంవత్సరంలో వుండగా అవినాశ్ మొదటి సంవత్సరంలో చేరాడు. అవినాశ్ కూడా కృష్ణమోహన్ లాగే మెకానికల్ ఇంజనీరింగ్ అవటం వలన అవినాశ్కి కృష్ణమోహన్ మంచి గయిడెన్స్ ఇచ్చి అతనికి కాలేజీలో ఒక గురువుగా, గాడ్ ఫాథర్గా వుండేవాడు.

అవినాశ్ని సీనియర్స్ నుండి ప్రొటెక్ట్ చేయడానికి అతను తన మేనత్త కొడుకు అని కాలేజిలో అందరికీ చెప్పాడు కృష్ణమోహన్. వాళ్ళిద్దరూ బాగా సన్నిహితులయి 'బావా' అని పిలుచుకునే దాకా ఎదిగింది వారి స్నేహం. కాలేజీలో అందరూ వీళ్ళిద్దరినీ "కృష్ణార్జునులు" అని పిలిచేవారు. ఆ రోజుల్లో ఇంజనీరింగ్ చదువు ఐదు సంవత్సరాలు. అందుకని వీళ్ళిద్దరూ నాలుగు సంవత్సరాలు కలిసి చదువుకున్నారు. జీవితంలో అది ప్రపంచాన్ని సరైన దృక్కోణంలో అర్థం చేసుకోవడం మొదలుపెట్టే దశ.
1972లో కృష్ణమోహన్ నాలుగవ సంవత్సరంలోకి వచ్చిన కొత్తలో ఒకసారి సత్యనారాయణ వాళ్ళ వూరు ముమ్మడివరం వెళుతూ కాకినాడలో దిగి అతని పిన తల్లి పార్వతమ్మగారింటికి వచ్చాడు. పార్వతమ్మగారి భర్త విశ్వనాథం గారికి సుమారు ఒక ఆరు నెలల ముందు విజయనగరం నుండి కాకినాడ బదిలీ అయ్యింది. ఆయన జీవితభీమా సంస్థలో పని చేస్తున్నారు. కృష్ణమోహన్ని రామారావుపేటలో వున్న వాళ్ళిం టికి తీసుకుని వెళ్ళాడు సత్యనారాయణ.

ఆదివారం కావటం వలన విశ్వనాథంగారి కుటుంబ సభ్యు లంతా ఇంట్లోనే వున్నారు. సత్య నారాయణ ముందుగా తన పిన్ని, బాబయ్యలని పరిచయం చేసాడు...కృష్ణమోహన్ వారికి నమస్కారం చేసి "బాగున్నారా" అని అడిగాడు. తరువాత వాళ్ళ పెద్ద అబ్బాయి రాజేశ్వరరావుని, అతని భార్య కవితని, రెండవ అబ్బాయి రవికుమార్ని, పెద్దమ్మా యి అనూరాధని సత్యనారాయణ పరిచయం చేసాడు...

రాజేశ్వరరావు కరీంనగర్లో ఆంధ్రా బ్యాంక్లో ఉద్యోగం చేస్తున్నాడు వారిద్దరు సెలవుమీద కాకినాడ వచ్చారు. రవికుమార్ ఎం. కాం. చదివి ఉద్యోగ ప్రయత్నాలలో వున్నాడు. అనూరాధ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాది. చివరిగా వారి రెండవ అమ్మాయి వాణిని, ఆఖరి అబ్బాయి సతీష్ని పరిచయం చేసాడు. వారు ఇంటర్ మొదటి సంవత్సరం, ఏడవ తరగతి చదువుతున్నారు. వీళ్ళందరిని సుమారు ఏడేళ్ళ క్రితం తన అక్క వైదేహి పెళ్ళిలో చూసాడు కృష్ణమోహన్ అందువలన పెద్దగా గుర్తు లేదు. పార్వతమ్మగారు మిగతావారు బలవంతం చేస్తే మొహమాట పడుతూనే రాత్రి కూడా అక్కడే భోజనం చేసాడు కృష్ణమోహన్. విశ్వనాథంగారు తప్ప ఇంట్లో అంతా సరదాగా కృష్ణమోహన్తో కబుర్లు చెప్పారు. ఆయన కొంచం ముభావంగా వున్నారు. రవి, అనూరాధ, తను ఇంచుమించు ఒకే ఈడువారు అవటం వలన వాళ్ళిద్దరూ ఎక్కువసేపు అతనితో గడిపారు. "రాత్రి తొమ్మిది దాటింది, అబ్బాయిని హాస్టల్ దగ్గర దిగబెట్టి రా" అని

పార్వతమ్మగారు రవికి చెప్పారు.

అతను వెళ్ళేటపుడు "మొహమాటపడకుండా ఎప్పుడు రావాలననుంటే అప్పుడు వస్తూ వుండు" అని పార్వతమ్మగారు మరీ మరీ చెప్పారు. రవి తన స్కూటర్ మీద కృష్ణమోహన్ని హాస్టల్ దగ్గర విడిచిపెట్టాడు.

"పైకి రా, మా సామ్రాజ్యాన్ని చూద్దువుగాని" అని రవిని తన గదికి తీసుకువెళ్ళాడు కృష్ణమోహన్.

కృష్ణమోహన్ని చూస్తూనే అవినాశ్ "బావా ప్రొద్దున్న నుండి నువ్వు లేక తోచక పిచ్చి ఎక్కినట్లు వుంది, నువ్వు వచ్చావు ప్రాణం లేచి వచ్చింది" అని మాంచి ఉత్సాహంగా అన్నాడు. ఆ తరువాత కృష్ణమోహన్తో ఉంకో మనిషి కూడా వచ్చాడని గుర్తించాడు.

"ఇతను అవినాశ్ మా రూంమేట్, నా బ్రాంచే మూడవ సంవత్సరం చదువుతున్నాడు, ఇతనిదీ మా వూరే, గత రెండు సంవత్సరాల నుండి బాగా క్లోజ్ అయ్యాము" అని "ఇతను రవి, మా బావగారికి పిన్ని కొడుకు" అని ఒకరినొకరికి పరిచయం చేసాడు కృష్ణమోహన్.

"హలో, మిమ్మల్ని కలవటం చాలా ఆనందంగా వుంది" అని అవినాశ్తో కరచాలనం చేసాడు రవి.

"బాస్ నువ్వు నన్ను మీరు అంటే నాకు ఆనందంగా లేదు, ఇబ్బందిగా వుంది. మోహన్కి నువ్వు కూడా బావ వరసే గనుక నేను నిన్ను బ్రదర్ అని పిలుస్తాను" అన్నాడు అవినాశ్.

"ఓకే బ్రదర్ నువ్వు అనే అంటాను ఆనందమేనా" అన్నాడు రవి. ఆ మాటలకి ముగ్గురూ నవ్వుకున్నారు.

"మోహన్ వచ్చే వారం కూడా రా సరదాగా గడుపుదాము. కాస్సేపు కార్డ్స్ ఆడుకుందాము, కబుర్లు చెప్పుకుందాము, ఏదైనా సినిమాకి వెళదాము, ఇంటి భోజనం తిన్నట్లు వుంటుంది" అన్నాడు రవి.

"అలాగే చూద్దాము వీలైతే తప్పక వస్తాను" అన్నాడు కృష్ణమోహన్.

"బ్రదర్ వచ్చే వారం మోహన్ తో నువ్వు కూడా మొహమాటపడకుండా మా ఇంటికి రా, సరదాగా గడుపుదాము" అని అవినాశ్ తో అన్నాడు రవి.

"బ్రదర్ నేను మన ఇంటికి రావడానికి మొహమాటం ఎందుకు? మోహన్ రాకపోయినా నేను వస్తాను, ఎందుకంటే ఈ హాస్టల్ తిండి తిని తిని మొహం వాచి, ఇంటి భోజనం కోసం ఆవురావురుమని వున్నాను" అన్నాడు అవినాశ్.

అతని చొరవ చూసి ముచ్చటపడి "నువ్వు నాకు నచ్చావు తమ్ముడూ, మోహన్ మొహమాట పడుతున్నాడు, సో అతనిని కూడా నువ్వు లాక్కు రావాలి" అన్నాడు రవి.

"అలాగే తప్పకుండా బ్రదర్, బావగారు కదా! కాస్త అల్లుడు బెట్టు వుంటుంది, నాకు వదిలేయ్ నేను చూసుకుంటాను" సరదాగా అన్నాడు అవినాశ్.

"ఏయ్ అవీ పరిచయం అయి పది నిముషాలవలేదు, అప్పుడే ఏమిటి ఆ చనువు" రవి ఏమనుకుంటాడో అని మొహమాటపడ్డాడు కృష్ణమోహన్.

"ఏం పరవాలేదు బావా...ఇలా పిలుస్తున్నాని మరోలా అనుకోకు, అఫ్కోర్స్ మన వరస అదే అయినప్పటికీ, ఊహ వచ్చేక ఈ రోజే మనకి పరిచయం అయింది. అవినాశ్లో నాకు నచ్చినది అతని నిష్కాపట్యమే" అన్నాడు రవి.

"సరేలే 'మియా బీబీ రాజీ హోతో క్యా కరేగా ఖాజీ' అన్నారు. ఎంతైనా మీరిద్దరూ బ్రదర్స్, నేనే గా పరాయివాడిని" అన్నాడు కృష్ణ మోహన్.

"మరి మావాడిని చేసుకుంటాం రావయ్యా అంటే నువ్వు మొహమాటపడుతున్నావు, ఇప్పుడేమో పరాయివాడిని చేసామని నిష్టూరం వేస్తున్నావు" అని నవ్వుతూ అన్నాడు రవి.

"అలాగే వస్తాములే, ఇప్పటికే పది దాటింది ఇంట్లో కంగారు పడతారు నువ్వు వెళ్ళు" అన్నాడు కృష్ణమోహన్.

రవి వెళ్ళినాక ఆ రోజు రవి వాళ్ళింట్లో జరిగిన విశేషాలు అవినాశ్ కి చెప్పాడు కృష్ణమోహన్.

"నువ్వు ఇదివరకు మీ అక్కయ్య పెళ్ళిలో వీళ్ళందరినీ చూసావు కదా గుర్తు పట్టావా?"

"లేదు. పెద్దవాళ్ళిద్దరూ కొంచెం గుర్తున్నారు. అయితే ఆ పెళ్ళిలో ఈ విశ్వనాథంగారు కొంచెం హడావిడి చేసారు, దానికి మా పెద్దనాన్నగారికి చాలా కోపం వచ్చింది. మా నాన్నగారు, మా చిన్నతాతగారు సర్ది చెప్పారు, గొడవకి కారణం నాకు ఈ రోజు వరకు

తెలియదు. ఈ రోజు వాళ్ళని చూసాక మళ్ళీ ఆ విషయం జ్ఞాపకం వచ్చింది"

"అబ్బో పెద్ద కథే వుందన్నమాట"

"ఛలో పడుకుందాము, రేపు కాలేజి వుంది"

******

శనివారం నాడు రవి హాస్టల్ కి ఫోన్ చేసి కృష్ణమోహన్ని, అవినాశ్ని ఆదివారం రమ్మని మరీ మరీ చెప్పాడు.

ఆదివారం హాస్టల్లో బ్రేక్ఫాస్ట్ చేసాక అవినాశ్ని తీసుకొని కృష్ణమోహన్ రవి వాళ్ళింటికి వెళ్ళాడు విశ్వనాథంగారు ఏదో పని మీద ఏలూరు వెళ్ళారు. అక్కడ వాళ్ళందరితో అవినాశ్ పరిచయ కార్యక్రమం అయిన తరువాత కాస్సేపు కేరమ్స్ ఆడుకుందామని అనూరాధ అంది.

"అలాగే, కాని నువ్వు నా జోడీగా వద్దు" అన్నాడు రవి.

"ఏం ఎందుకని బ్రదర్" అని అడిగాడు అవినాశ్ .

"తనకి సరిగా రాదు, పిచ్చి పిచ్చిగా ఆడుతుంది"

"నీకు బాగా వస్తే, నువ్వు నేను జోడీగా వుందాము, ఎందుకంటే నేను ఏవరేజ్. కృష్ణమోహన్ చాలా బాగా ఆడుతాడు, అతను లాస్ట్ ఇయర్ కాలేజ్ చాంపియన్ అందుకని అతను అనూరాధ గారు ఒక టీంగా వుంటారు"

"మీరు రవిని బ్రదర్ అన్నారు గనుక నాకు కూడా మీరు బ్రదర్, అందుకని నేను మిమ్మల్ని 'అన్నయ్యా' అని పిలుస్తాను, మీరు నన్ను 'అనూ' అని మా ఇంట్లో వాళ్ళు పిలిచినట్లు పిలవండి" అంది అనూరాధ.

"సరే నో ఇస్యూస్, కానీ అన్నయ్యా అని పిలుస్తూ ఆ మీరు, అండీ బాగోలేదు" అన్నాడు అవినాశ్.

"అలాగే అన్నయ్యా" అంది అనూరాధ నవ్వుతూ.

"బావా, నువ్వు అసలు ఏమీ మాట్లాడకుండా చిరునవ్వు నవ్వుతూ కూర్చున్నావు, అనూతో కలిసి ఆడటానికి నీకు ఓకేయేనా" అన్నాడు రవి.

"బ్రదర్, కృష్ణపరమాత్మ ఎక్కువ మాట్లాడడు, అలాగే ఎప్పుడూ చిద్విలాసంతో వుంటూ అవసరమైనపుడు విశ్వరూపం చూపిస్తాడు. కాలేజీలో, హాస్టల్లో కూడా ఏదైనా సమస్య వచ్చినపుడు మిగతా అందరూ క్రిందా మీదా పడిపోతూ వుంటే, ఈయన ఇలాగే నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుని ఆఖరున ఫినిషింగ్ టచ్ ఇచ్చి, కథ సుఖాంతం చేస్తాడు" అన్నాడు అవినాశ్ ... అతని మాటలకి అందరూ నవ్వుకున్నారు.

అనూరాధ కృష్ణమోహన్ గురించి ఆలోచిస్తున్నాది..."ఇతను ఏదో చిత్రమైన వ్యక్తిలా వున్నాడు. రవి అతనిని బావా అని పిలుస్తున్నాడు, కరక్టే వరసకి బావే అవుతాడు కానీ తను అలా పిలవడానికి సిగ్గుగా వుంది, పిలిస్తే ఏమనుకుంటాడో? మరి ఎలా పిలవడం? అందరూ అతనిని మోహన్ అని పిలుస్తున్నారు గనుక తను ప్రత్యేకంగా 'కృష్ణా' అని పిలుద్దాము అని నిర్ణయించుకుంది. కానీ ఆ విషయం అందరి ముందూ చెప్పడానికి మొహమాటమనిపించి తరువాత ఒంటరిగా వున్నప్పుడు చెబుదామనుకుంది"

కేరమ్స్ చాలా సీరియస్గా ఆడారు. అనూరాధ సరిగా ఆడకపోవడం చూసి కృష్ణమోహన్ ఆమెని ప్రోత్సహించడమే కాకుండా, స్ట్రైకర్ ఎక్కడ పెట్టి ఏ ఏంగిల్లో కాయిన్ని కొడితే అది పడుతుందో చెప్పి ఆడించాడు. మొదటి మూడు బోర్డులు రవి అవినాష్ గెలిచి స్కోర్ పన్నెండుకి చేరుకున్నారు. రవి అనూరాధని ఏడిపించడం మొదలు పెట్టాడు. అవినాశ్ కూడా మొదటిసారిగా కృష్ణమోహన్ టీం మీద గెలుస్తామని "బావా గత రెండేళ్ళ బట్టి నీ మీద గెలవలేకపోయాను, కానీ మొదటి సారి నీ టీం మీద విజయం సాధిస్తానని నమ్మకంగా వుంది" అన్నాడు. అది విన్న కృష్ణమోహన్ ఒక చిరునవ్వు నవ్వాడు. అది చూసి "ఏమిటి ఈ పెద్దమనిషి చిరునవ్వు నవ్వుతాడు, ఈ గేమ్ ఓడిపోతే రవి నన్ను ఇంకా ఏడిపిస్తాడు ఎలారా బాబూ" అనుకుంది అనూరాధ.

నాలుగో బోర్డులో కృష్ణమోహన్ తన చాన్స్ వచ్చాక మిగతా వారికి ఇక అవకాశం ఇవ్వకుండా మొత్తం వాళ్ళ కాయిన్స్ అన్నీ రెడ్తో సహా వేసి స్కోర్ పదమూడుకి తీసుకెళ్ళి, మిగతా ముగ్గురినీ ఆశ్చర్యపరిచాడు. ఆ దెబ్బకి రవి, అవినాశ్లు "అయ్య బాబోయ్ విశ్వరూపం చూపించాడు" అనుకున్నారు. అనూరాధ చిన్నపిల్లలాగ ఆనందం పట్టలేక ఎగిరి గంతేసి కృష్ణమోహన్కి షేక్ హ్యాండ్ ఇచ్చింది. అనూరాధ

అలా చెయ్యడం కృష్ణమోహన్కి కొంచెం ఇబ్బందిగాను,మొహమాటంగాను వుండటమేకాక ఆశ్చర్యాన్ని కలిగించింది. షేక్ హ్యాండ్ ఇచ్చిన తరువాత అనూరాధ కూడా ఇదేమిటి ఇలా ప్రవర్తించాను, నా గురించి కృష్ణమోహన్, అవినాశ్, రవి ఏమనుకుంటారు అని ఇబ్బందిగా ఫీల్ అయింది.

ఆమె పడుతున్న ఇబ్బందిని కృష్ణమోహన్ గమనించి, అసలేమీ జరగలేదన్నట్లుగా ఆమె దృష్టి ఆట మీదకి మళ్ళించడానికి "ఈ సారి మీరు కూడా మీ వంతు వచ్చినపుడు కాయిన్స్ మొత్తం వెయ్యాలి" అని అనురాధతో అన్నాడు.

అవినాశ్ పరిస్థితిని తేలి కపరచడానికి "బ్రదర్ వాళ్ళు ఇలా మొత్తం ఉడ్చేస్తే ఇంక మనమెందుకు ఆడటం, మనం ఈ లోపల అలా మసీదు సెంటర్ దాకా వెళ్ళి ఇరానీ చాయ్ తాగి వద్దాము" అని జోక్ చేసాడు.

ఐదో బోర్డ్ లో ఎనిమిది పాయింట్లు, ఆరో బోర్డ్ లో మిగతా పాయింట్స్ వచ్చి కృష్ణమోహన్, అనూరాధ గెలిచారు. ఐదు, ఆరు బోర్డుల్లో అనురాధ చేత దగ్గర వుండి ఎక్కువ కాయిన్స్ వేయించాడు కృష్ణమోహన్. అతని ఆట చూసి "అద్భుతం" అన్నాడు రవి.

"ఒరేయ్ జీవితంలో ఒక్కసారైనా నా మీద గెలవవే అన్నావు ఇప్పుడేమంటావు" అనూరాధ రవితో అని "మీరు చాలా బాగా ఆడారు" అని కృష్ణమోహన్తో అంది.

"మీరిద్దరూ నన్ను ములగ చెట్టు ఎక్కిస్తున్నారు, ఇదేం బ్రహ్మవిద్యా?" అన్నాడు కృష్ణమోహన్.

"మీరు నాకు కోచింగ్ ఇవ్వండి, త్వరలోనే వీడిని సింగిల్సులో కూడా ఓడించి నా పగ తీర్చుకుంటాను" రవిని ఉద్దేశ్యించి కృష్ణమోహన్తో అంది అనూరాధ.

"నీకంత సీను లేదు" అన్నాడు రవి.

"చూద్దాము" అంది అనూరాధ.

"ఓకే చెల్లెమ్మా బావ నీకు కోచింగ్ ఇస్తాడుగాని, నాకు కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి. ఇంటి భోజనం ఎప్పుడు తిందామా అని ఆవురావురుమని వున్నాను" అన్నాడు అవినాశ్.

"సమయం ఒంటిగంట అయింది, భోజనం చేద్దురుగాని లేవండి" అని పిలిచింది పార్వతమ్మగారు.

రవి, అవినాశ్ వాష్రూంకి వెళ్ళారు. కృష్ణమోహన్ ఒంటరిగా వుండడం చూసి "నేను మీకన్నా చిన్నదాన్ని అందుచేత మీరు నన్ను "మీరు" అని సంభోదించకండి నాకు ఇబ్బందిగా వుంది. ఇంకొక విషయం మిమ్మల్ని అందరూ "మోహన్" అని పిలుస్తారని క్రిందటి ఆదివారం మా ఇంటికి వచ్చినపుడు మాటలలో చెప్పారు, మీకు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని "కృష్ణా" అని పిలుస్తాను ప్లీజ్" అంది అనూరాధ.

"నో ప్రోబ్లం, కానీ రెండు షరతులు. ఒకటి నన్ను నువ్వు అని సంభోదించాలి, రెండు నేను నిన్ను అందరూ పిలిచినట్లు "అనూ" అని కాకుండా "రాధా" అని పిలుస్తాను సరేనా" అన్నాడు కృష్ణమోహన్.

"అలాగే పిలవండి, సారీ పిలువు. నువ్వు చెప్పినట్లుగానే నిన్ను సంభోదిస్తాను, థాంక్యూ"అంటూ అతని కళ్ళలోకి సూటిగా చూసింది అనూరాధ. కృష్ణమోహన్ ఆ చూపులకి కొంచెం బిడియపడ్డాడు. పిల్లలందరికీ భోజనం వడ్డించి అనూరాధ, పార్వతమ్మగారూ తరువాత తిందామనుకున్నారు. అది గమనించిన కృష్ణమోహన్ "అత్తయ్యగారూ మీకు, రాధ కి కూడా వడ్డించుకోండి, అందరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేద్దాము" అన్నాడు.

"వద్దులే మోహన్ మీకు వడ్డించటం కష్టం అవుతుంది, మేము తర్వాత తింటాము" అంది పార్వతమ్మగారు.

"ఏం పరవాలేదు దొడ్డమ్మగారూ, మేము కూడా వడ్డిస్తాము అందరం సరదగా తిందాము" అని అవినాశ్ లేచి రెండు కంచాలు వేసి మంచి నీళ్ళు పెట్టాడు. అతని కలుపుగోలుతనం చూసి పార్వతమ్మగారు ముచ్చటపడి.."ఇతనిని చూస్తే ముచ్చటగా వుంది, మా రవిలాగానే తొందరగా కలిసిపోతాడు, కొత్త లేదు" అంది.

కృష్ణమోహన్కి భోజనం చేసేటపుడు ఒక అలవాటు వుంది అదేమిటంటే వంటకాలలో వచ్చే కరివేపాకు, కొత్తిమిరి, మిరప కాయలు, పోపు వగైరా తినడు, అవి పక్కన పెట్టేస్తాడు. ఇంట్లో, హాస్టల్లో ఒక ఖాళీ ప్లేట్ వుంచుకొని అందులో వేస్తాడు.

(ఇంకా వుంది)

డాలస్ లో ఉత్సాహంగా యోగా

ఇర్వింగ్ నగరంలో నెలకొని ఉన్న మహాత్మా గాంధీ మెమోరియల్ వద్ద మహాత్మా గాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది ప్రవాస భారతీయులు ఉత్సాహంగా 5వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఇర్వింగ్ నగర మేయర్ రిక్ స్టోఫర్ ముఖ్య అతిథిగాను, కాన్సుల్ రాకేష్ బనాటి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

సంస్థ కార్యదర్శి రావు కల్వల అతిథులకు స్వాగతం పలికి, యోగా చేయడం వల్ల ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. సంస్థ ఉపాధ్యక్షుడు బి.ఎన్ రావుమాట్లాడుతూ అందరూ ఒక చోట చేరి ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవడానికి మహాత్మా గాంధీ మెమోరియల్ ప్రధాన వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు.

మహాత్మా గాంధీ మెమోరియల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ ఎన్నో వేల సంవత్సరాల క్రితమే యోగా అనే ప్రక్రియను భారతదేశం ప్రపంచానికి అందించిన ఒక గొప్ప కానుకగా వర్ణిస్తూ, యోగా చేయడానికి వయస్సు, జాతి, మతం, కులం అడ్డు కావని అందుకే 170 దేశాలకు పైగా కోట్లాది ప్రజలు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటున్నారని అన్నారు. యోగా సంవత్సరానికి ఒక సారి వచ్చే పండుగలా గాక దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని అన్నారు. ఈ యోగాను ఇర్వింగ్ నగరంలో ఉన్న అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టాలని ఇర్వింగ్ మేయర్ కు సూచించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

ఇర్వింగ్ నగర్ మేయర్ రిక్ స్టోఫర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, ఎన్నో దేశాల ప్రజలు యోగా ను తమ జీవితాలలో ఒక ముఖ్య భాగంగా చేసుకోవడం విశేషమని, యోగాను ఆవిష్కరించిన భారతదేశానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాన్సుల్ రాకేష్ బనాటి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపును అనుసరించి ఐక్యరాజసమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించటంతో ప్రపంచవ్యాప్తంగా యోగా జరుపుకోవడం భారతదేశానికి గర్వకారణం అన్నారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, డాలస్ విద్యార్థులకు మహాత్మా గాంధీ మెమోరియల్ సంస్థ 2,000 డాల్లర్ల స్కాలర్షిప్ ను యూనివర్సిటీ ఏషియా సెంటర్ డైరెక్టర్ మోనిక్ వేడేర్బర్న కు మేయర్ చేతుల మీదుగా అందజేశారు.

"92వ స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీలలో" విజేతలుగా నిలిచిన అభిజాయ్ కొడాలి, సోహుమ్ సుఖతన్కర్, రోహన్ రాజాలను, వారి తల్లిదండ్రులను డా. ప్రసాద్ తోటకూర, బోర్డు సభ్యులు, మేయర్ రిక్ స్టోఫర్, కాన్సుల్ రాకేష్ బనాటిలు ఘనంగా సత్కరించారు.

దాదాపు రెండు గంటల పాటు యోగా గురువులు విజయ్, పెగ్గీ నేతృత్వంలో యోగాలోని మెళకువలను ఉత్సాహంగా ప్రవాస భారతీయులు నేర్చుకొని సాధన చేశారు.

సంస్థ కోశాధికారి అభిజిత్ రాయిల్కర్ ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించడానికి తోడ్పడిన స్వచ్ఛంద సేవకులకు, విచ్చేసిన అతిథులకు, మీడియా మిత్రులకు, ఫోటోగ్రఫీ, సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసిన వారికి, వాటర్ బాటిల్స్ ఉచితంగా అందజేసిన సరిగమ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన వారందరికీ గాంధీ మెమోరియల్ సంస్థ వారు యోగ్యతా పత్రాలను, అల్పాహారం అందజేశారు.

ఆర్. శర్మ దంతుర్తి

తెలుగు పద్య రత్నాలు - 4

క్రితం నెల పద్యంలో భీష్ముడి మీద కృష్ణుడి కృప ఎలా ప్రవహించిందో అనేది చూసాం. అయితే భగవంతుడెప్పుడూ ధర్మం వైపు ఉంటాడని కదా తెల్సిన విషయం? పన్నెండేళ్ళు అరణ్యవాసం, మరో ఏడు అజ్ఞాతవాసం చేసాక కూడా దుర్యోధనుడు నేను రాజ్యం ఇవ్వనూ అన్నప్పుడు సంజయుడు రాయబారానికి వస్తాడు పాండవుల దగ్గిరకి. అలా వచ్చిన సంజయుడు ధర్మరాజు తో చెప్తాడు, "ఇదిగో ఇలా పంపించారు నన్ను. మీరూ మీరూ కలిసి ఉండాలి. ధర్మం చూస్తే నీకు రాజ్యం ఇవ్వాల్సిందే. కానీ నా మనసులో మాట కూడా విను, వాళ్ళు రాజ్యం ఇవ్వకపోతే భిక్ష ఎత్తి జీవించడం మంచిది కానీ నీ వంటి వాడు యుద్ధానికి రాకూడదు," అని. ఈ మాట విన్నాక ధర్మరాజు అడుగుతాడు, "సంజయా నన్ను భిక్ష ఎత్తుకోమనడం బాగానే ఉంది. మరి అది క్షత్రియుడినైన నా ధర్మమా కాదా అనేది నాకు అంతు బట్టటం లేదు. ధర్మం అనేది సూక్ష్మాతి సూక్ష్మం కనక మా వైపు ఉన్న కృష్ణుడు ఏం చెప్తే అలాగే చేస్తాను" అంటాడు. అక్కడే ఉన్న కృష్ణుడికి వళ్ళు మండుతుంది ఇదంతా విని.

అప్పుడు కృష్ణుడు చెప్తాడు సంజయుడితో, "భలే చెప్తున్నావయ్యా నీతులు. ధర్మరాజు క్షత్రియుడు. క్షత్రియ ధర్మం యుద్ధమా, భిక్ష ఎత్తుకోవడమా? నిన్ను ఇలా నీతులు చెప్పమని ఆ పెద్దమనిషి ధృతరాష్ట్రుడు పంపించాడా? ఇది ధర్మం అనేనా, అక్కడున్న భీష్మ, ద్రోణ, కర్ణ, కృపాచార్యులు అనుకునేది? వాళ్లకి 'ఇదీ ధర్మం' చెప్పడానికెవరూ లేరా? సరే, నువ్వు వెళ్ళు, నేనే స్వయంగా వస్తున్నాను వాళ్ళకి చెప్పడానికి. నేనొచ్చి ధర్మం అంటే ఏమిటో వీళ్ళకి చెప్పకపోతే రేపు కానీ యుద్ధం జరిగితే ఈ కృష్ణుడు అన్నీ చేయగలిగి ఉండీ చూస్తూ కూర్చున్నాడనే మాట పడుతుంది నామీద."

సంజయుడు వెళ్ళిపోయాక కృష్ణుడు సాత్యకితో పాటు హస్తినాపురం వెళ్తాడు రాయబారానికి. సభలో ఉన్న అందరికీ నీతులన్నీ చెప్పాక చివరకి ఈ మాట కూడా చెప్తాడు. అదే తిక్కన రాసిన మహాద్భుతమైన పద్యం.

ధర్మం అనేది ఎటువంటిది? సారమైనది, ఎవరి మూలానా కళంకం కానిది. అటువంటి ధర్మం పాపం చేతా, ఏ మాలిన్యమూలేని సత్యం, (సత్యం పరం ధీమహి అని కదా?) అబద్ధాల చేతా చెడిపోయే దశ వచ్చినప్పుడు మీ లాంటి సమర్థులైనవారు, చేతకాని వాళ్ళలా చూస్తూ కూర్చుని ఉపేక్ష చేస్తే అది వారికి సర్వనాశనాన్ని తీసుకొస్తుంది. అంతేకానీ ధర్మం పాడైపోయి నాశనం అవుతుందని

ఉ.

సారపు ధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాఱినదైన యవస్థదక్షు లె
వ్వార లుపేక్షచేసి రది వారలచేటగుఁ గాని ధర్మ ని
స్తారకమయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్

అనుకోకండి. ఎందుకంటే, ధర్మాన్ని కాపాడి గట్టెక్కించడానికి, సత్య శుభస్థితిని యోగ్యులకు సమకూర్చేదీ అయిన దైవము ఎల్లవేళలా కాసుకుని ఉంటాడు.

ధర్మం పాడవుతున్నప్పుడు "ఆ, పోనీయ్ నాకెందు కులే" అని చూస్తూ కూర్చుంటే ఆ అలసత్వం అలా ఉపేక్షించేవాళ్లని కాటేస్తుంది కానీ ధర్మం పాడవదుట. ఎందుకంటే, ధర్మాన్ని రక్షించడానికి భగవంతుడెప్పుడూ సిద్ధం గా ఉంటాడు. అందుకే భగ వంతుడంటే ఎవరనే ప్రశ్న వచ్చినప్పుడు సత్యమే, ధర్మ మే భగవంతుడని చెప్పడం. ఈ పద్యంలో మరో విశేషంఏమిటంటే భగవంతుడే ఈ మాట చెప్పడం.

"యుద్ధం రాబోతోంది, అది వారించడానికి నేను వచ్చాను. లోకులు నన్ను వేలెత్తి చూపకుండా ఉండడానికీ, మీరు ఏమీ చేయకపోవడం చూసి, మీరు చేయగలిగిన పని చేయటం లేదని చెప్పడానికీను. అయినా మీరేం చేయకపోతే రాబోయే యుద్ధంలో నేను – భగవంతుణ్ణి – ధర్మాన్ని రక్షించడానికి అటు పాండవుల వేపు జేరాల్సి ఉంటుంది. అప్పుడు – వినండి సరిగ్గా –ధర్మాన్ని రక్షించనందుకు అది మిమ్మల్ని కాటు వేసి తీరుతుంది." ఇంత కన్నా సులభంగా ఇంకేమిటి చెప్పడం?

ఇంత చెప్పినా చివరకి యుద్ధం జరుగుతుంది. భీష్ముడు అంపశయ్య మీదకి జేరతాడు. మొత్తం పద్దెనిమిది అక్షౌహిణీల సేన తుడిచిపెట్టుకుపోతుంది. చివరి రోజుల్లో భీష్ముడి ప్రాణం పోయేముందు ధర్మరాజుని వెంటబెట్టుకుని మళ్ళీ వస్తాడు కృష్ణుడు అంపశయ్య దగ్గిరకి. "కృష్ణా నేనెప్పుడూ ధర్మం తప్పిన వాణ్ణి కాదు, మరి నాకింత నెప్పి, ఇలా జీవితం చాలించాల్సిన అవసరం కలిగిందే?" అని అడిగితే కృష్ణుడు చెప్తాడుట అప్పుడు, "ఆ రోజు ద్రౌపదికి సభలో చేసిన అవమానానికీ, యుద్ధం తప్పు అని తెలిసీ ఏమీ చేయకచూస్తూ కూర్చోవడం వలన వచ్చిన అనర్థం ఇది," అని. "దక్షులెవ్వార లుపేక్షచేసి రది వారలచేటగుఁగాని.." అంటే ఇదే. తన తండ్రి కోసం భీకర ప్రతిజ్ఞ చేసాక కూడా మొత్తం కౌరవ పాండవ వంశాలు నాశనం కాకుండా ఉండడానికి ఎంతో కృషి చేసిన అతి దక్షుడైన భీష్ముడు చేయాల్సిన పని చేసాడా అని ప్రశ్న వేసుకుంటే లేదనే సమాధానం వస్తోంది కదా? అదే ధర్మాన్ని ఉపేక్ష చేయడం అంటే.

భగవంతుడు ధర్మ రక్షణ కోసం ఏం చేస్తాడో అనేది మళ్ళీ యుద్ధం ముందు భగవద్గీతలో ఆయనే చెప్ప డం గమనించవచ్చు,

"యథాయథాహి ధర్మస్య గ్లానిర్భవతు భారతః..." అంటూ.

రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

– సంపాదకురాలు

చైతన్యం సంకల్ప బలం

చందా రేట్లు

విడిప్రతి	రూ. 20.00
సంవత్సరానికి	రూ. 200.00
పోస్ట్ ద్వారా	రూ. 230.00

Please deposit your subscription in favour of
CHAITANYAM SANKALPABALAM
A/c No. 1626201002070 - Canara Bank
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:
చైతన్యం
సామాజిక విలువల మాస పత్రిక
నెం. 903, రాయల్ పెవీలియన్, బిగ్ బజార్ ఎదురు రోడ్డు, గణపతి ఆలయం దగ్గర, అమీర్‌పేట, హైదరాబాద్ – 500 016.
Email: teega51@gmail.com
visit: www.chaitanyam.net

తుమ్మూరి రాంమోహన్ రావు

సాహిత్యమే శ్వాసగా జీవించిన డా.ద్వా.నా శాస్త్రి

కొందరి వ్యక్తులతో పరిచయం జీవితంలో కొత్త వెలుగుల్ని ప్ర-సరింప జేస్తుంది.నా మిత్రుడు తాళ్లపల్లి మురళీధర గౌడు పరిచయం చేసిన అనేకమంది సాహితీ మూర్తులలో ద్వానాశాస్త్రి ఒక అరుదైన వ్య-క్తి.'సాహిత్యమే శ్వాసగా ' ఆయన చివరి పుస్తకానికి ముఖచి-త్రం గురించి మాట్లాడటానికి వారింటికి మేం మొదటి సారి వెళ్లాం.

పరిచయమై అప్పటికి చాలాకా-లమే అయినా అప్పుడో ఇప్పుడో కలుసుకున్నప్పుడు మాట్లాడ-టం వేరు.ఇంటివద్ద ఇష్టాగోష్ఠిగా మాట్లాడు కోవటం వేరు.అప్ప-టికే ఆయన ఐదారు పుస్తకాలకు నేను ముఖ చిత్రాల్ని రూపకల్పన చేసాను.కానీ ఈ చివరిపుస్తకాని-కోసం (అది చివరిదౌతుందనుకో-లేదు) ఇంటికి వెళ్లి ఆయన ఫోటో నాఫోన్ కెమెరాలో తీసుకుని దాన్ని ముఖ చిత్రానికి వాడుకున్నాం.ఆ పుస్తకంలో మరి కొన్ని ఫోటోలు చేర్చటానికి కూడా నేను తోడ్పడ-టమే గాక ఆయనతో కలిసి ఆత్మీయంగా మాట్లాడుకోవ-టం జరిగింది.నా గజల్ సంపుటి 'మహెఫిల్లో కోయిల'గజల్ సంపుటి వేస్తున్నానని చెప్పాను. అందులోని ఒక గజల్ పాడి వి-నిపించమన్నారు. నేను పాడి వనిపించగానే ఆనందించి ఈ పుస్తకావిష్కరణ సమయంలో నేను ఐదువేలు ఇస్తాను అని సంతోషంతో అన్నారు.నేను సీరియస్ గా తీసుకోకపోయి-నా ఆయన మరచి పోకుండా నిజంగానే సభకు వచ్చి తను ఇస్తానన్న డబ్బు కవర్లో పెట్టి ఇవ్వటం నన్ను సంభ్రమాశ్చర్యా-లకు గురి చేసింది.ఏదో మాట-వరసకు అన్నారనుకున్నాను.కానీ ఆ తరవాత తెలిసింది అలాంటివి ఆయనకు అలవాటని.ఎందరినో అలా సత్కరించారని.బతికిన-న్ని రోజులు సాహిత్యమే శ్వాసగా జీవించిన అరుదైన వ్యక్తి ద్వానా.

పలుకరిస్తే సాహిత్య ప్రసం-గం,బోధిస్తే తెలుగు సాహిత్య చరిత్ర,కలమూనితే కమ్మని కవి-త్వం,వింగడిస్తే విమర్శనాత్మక వ్యాసం ఇలా బహు ముఖీనంగా సాహిత్యమే శ్వాసగా నిరంతర



సాహితీ కృషీవలులుగా జీవిస్తూ, ద్వానాగా ప్రచలిత నామం సంతరించుకున్న డా.ద్వాదశి నాగేశ్వర శాస్త్రి గారు దేశవిదేశాల తెలుగు వారికి సుపరిచితులు.

1948 జూన్ పదిహేనో తేదీన , కృష్ణాజిల్లా,కైకలూరు తాలూకా ముదినేపల్లి సమీప గ్రామం లింగాలలో జన్మించారు.తల్లిదండ్రులు శ్రీమతి లక్ష్మీ ప్రసన్న ,శ్రీ వెంకట శివరామకృష్ణ శాస్త్రుల తృతీయ కమారులైన వీరు ఉన్న ఊళ్లోనే ప్రాథమిక విద్య నభ్యసించారు.మండపల్లిలో ఉన్నత పాఠశాల విద్య,ఏలూరులో సర్.సి.ఆర్.రెడ్డి కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు.గణితము,శాస్త్రవిజ్ఞానాలతో పట్టభద్రులైన వీరు,ఆంధ్ర విశ్వ విద్యాలయం లో ఎం.ఏ తెలుగుతో చేయటం యాదృచ్ఛికమే అయినా తెలుగు సాహిత్యానికి,తెలుగు భాషకు ఎంతో మేలు చేకూర్చింది.బాల్యదశలో ఇంట్లో కొద్దో గొప్పో సాహిత్య వాతావరణం ఉన్నా ద్వానా శాస్త్రిగారికి ఎం.ఏ తరువాతనే అభిరుచి ఏర్పడింది. అయితే పాఠశాల స్థాయిలో ఆంజనేయులుగారనే తెలుగు పండితులు,డిగ్రీ స్థాయిలో బండ్లమూడ్ సత్యనారాయణ అనే తెలుగు లెక్చరర్ వల్ల తెలుగు భాషపై మమకారం ఏర్పడిందని వీరు ప్రస్తావిస్తారు.ఎం.ఏ చదువుకునే రోజుల్లో కళాశాల గ్రంథాలయంలోని పుస్తకాలు,గురువులబోధనలు,సహాధ్యాయ మిత్రులతో చర్చలు ఆయనలోని సాహితీ వ్యక్తిత్వానికి సానపట్టినాయి. తరువాత ఉస్మానియాలో భాషాశాస్త్రం లో డిప్లమా,నాగార్జునలో మారేపల్లి రామచంద్ర శాస్త్రి పై ఎం.ఫిల్.,తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహితీ సంస్థలపై పిహెచ్.డి చేసి తమ విద్యా తృష్ణ తీర్చుకున్నారు.ఆచార్యులు తూమాటి దొణప్ప,చేరా,కొత్తపల్లి వీరభద్రరావులు వివిధ దశల్లో వీరిని తీర్చి దిద్దిన గురువులు.

అమలాపురం భానోజీ రామర్సు కాలేజీలో 1972 నుండి 2004 దాకా 32 సంవత్సరాలు తెలుగు అధ్యాపకునిగా పని చేసి మంచి పేరుగడించారు. ఆయనకోసమే ఆకళాశాలలో చేరిన విద్యార్థులున్నారనేది అతిశయోక్తి కాదు.

సాహితీ సవ్యసాచి అనే బిరుదుకి నూటికి నూరుపాళ్లు సార్థకత చేకూర్చిన వారు ద్వానా.ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు సాహిత్యంలో తమ ఉనికిని చాటుకున్నారు.కళాశాలలో తిక్కన నాటకీయతఅనే అంశంపై విమర్శా వ్యాసంతో మొదలైన ఆయన రచనావ్యాసంగం మూడు పాయలుగా పయనించి నేటికీ వెలుగులు విరజిమ్ముతున్నది. సృజనాత్మక రచనలు,విమర్శనాత్మక రచనలు,భాష సంబంధి రచనలుగా వాటిని చెప్పుకోవచ్చు. విమర్శ విభాగంలోనిదే సమీక్ష.

ఆయన చేసిన పుస్తక పరిచయ సమీక్షలు కోకొల్లలు. సమాధిలో స్వగతాలు,ద్వానా కవితలు,సాహిత్య నానీలు,బుష్ కాకి,నానీలలో సినారె,మనిషిలోకి ప్రవహించాలి మొదలైనవన్నీ ఆయన సృజించిన కవితా సంపుటాలు. ఉద్యోగ విరమణ జేసి భాగ్యనగరం చేరిన తరువాత ఆయన సాహిత్య విజృంభణం ఆరంభమయిందని చెప్పవచ్చు. తెలుగు సాహిత్య చరిత్ర ద్వానాకు పర్యాయ పదం.వివిధ పోటీ పరీక్షల విద్యార్థుల కోసం రూపొందించిన ఈ పుస్తకంలో అటు ప్రాచీన కవుల నుండి అత్యంతాధునిక కవుల పరిచయాలు,జానపదం నుండి పోస్ట్మాడర్నిజం దాకా అనేక సాహిత్య కృథాలూ,-వాదాలు మరియు పలు సాహిత్య సందర్భాలూ కలిపి ఇదీ టూకీగా తెలుగు సాహిత్య చరిత్ర స్వరూపం అని సరళ సుందరంగా పొందు పరిచారు.రెండు దశాబ్దాల కాలంలో పన్నెండు సార్లు పునర్ముద్రణకు నోచుకున్న ఈ పుస్తకాన్ని విశాలాంధ్ర రాజేశ్వరరావుగారు ప్రచురణ బాధ్యతలు గైకొన్నారు. సివిల్స్ వంటి పోటీ పరీక్ష విద్యార్థులకు కల్పతరువుగా నేటికీ ప్రాచుర్యంతో ఉన్నది.వారికోసం పుస్తకం రాయడమే గాక కోచింగ్ కూడా ఇస్తూ,అనేక మంది విద్యార్థులు తెలుగు భాషను ఒక ఐచ్ఛికంగా ఎంపిక చేసుకునే దిశకు మళ్లించిన ఘనత ద్వానాది.

కొత్తదనాన్ని అందించాలనే వీరి తపన పుట్పాత్ మీద అమ్మే ఎప్పటివో పాత పుస్తకాలై పడింది. అంతే నూరు అరుదైన పుస్తకాల గురించి వ్యాసాలు రాసి పత్రికలో ప్రచురించిన తరువాత పుస్తక రూపంలోకి తెచ్చారు.ద్వానా తనకి తాను అపురూపంగా భావించడమేగాక అటు రచయితలు,-పాఠకులు కూడా అంతే అపురూపంగా తలచుకునే పుస్తకం 'మా నాన్నగారు'.ప్రసిద్ధులు,లబ్ధ ప్రతిష్ఠులయిన కవులు,రచయితల పుత్రులు,పుత్రికలు వారి వారి నాన్నల గురించి హృదయావిష్కరణం చేయడం సాహిత్య ప్రపంచంలో అరుదైన విషయం. అటువంటి అరుదైన అంశాన్ని చేపట్టి అనేక మందిని సంప్రదించి ఒప్పించి రచనలు చేయించి-,పత్రికా ముఖంగా ముందుగా వెలువరించి ఆపై పుస్తకరూపంలో ఆవిష్కరించారు.

సహజంగా చమత్కార ప్రియులు,వ్యంగ్యవైభవోపేతులు,సరసవినోదులు కూడా అయిన ద్వానా శాస్త్రిగారు వెలువరించిన మరో పుస్తకం తెలుగు సాహిత్యంలో హాస్యం.ఇంతవరకు ఎవరూ చేపట్టని ప్రక్రియలను ఎంచుకోవడంలోనే ఉంది ద్వానా ప్రతిభ అంతా.అందుకే సమకాలీన సాహితీ స్రష్టలంతా ఆయనకు సన్నిహితులే.తెలంగాణా ఏర్పడ్డ తరుణంలో తెలంగాణ ప్రాంత సాహితీ పరుల గురించిన వివరాలతో 'తెలంగాణా సాహిత్య రతనాల వీణను'వెలువరించటం వీరి సమయజ్ఞతకు నిదర్శనం.భాషాపరమైనవి మరియు పలు విమర్శగ్రంథాలు రచించిన వీరు కుసుమ ధర్మన్నను తొలి దళితకవిగా గుర్తించి వారి గురించిన విశేషాలతో పుస్తకం వెలువరించారు.నడింపల్లి రామభద్ర రాజు,పురిపండా అప్పలస్వామి,తూమాటి దోణప్ప,దాశరథి కృష్ణమాచార్యులు,చేకూరి రామారావుల వంటి విశిష్ట సాహితీపరుల జీవిత చరిత్రలు వ్రాయటం వారి బహుముఖీన సాహిత్య ప్ర-

జ్ఞకు చక్కని ఉదాహరణం.చిరకాలంగా సినారె తో సాన్నిహిత్యం కలిగిన ద్వానా ఆయన గురించి నూరు నానీలలో చెప్పిన పుస్తకం సినారె నానీలు.దీనికి ఆంగ్లానువాదాన్ని వెలువరించటం ప్రపంచానికి సినారె పరిమళాలందించటం కోసమే.అరవైకి మించిన ఆయన రచనలను వింగడించటం అలవి కాని పని.కానీ ఆయన రచనలన్నీ నవ్యతను,రమ్య తను, విషయ సంగ్రహతను,విశిష్టతను సంతరించు కున్నవే నని చెప్పక తప్పదు.

రచన ప్రక్రియను కొన సాగిస్తూనే తన సాహిత్య సంపదను పలు ప్రసంగాలద్వారా పంచి పెట్టిన సాహిత్యైకజీవి ద్వానా.అంతటితో ఆగక పలుకరిస్తే ప్రసంగం అని పృచ్ఛకులడిగిన సాహిత్య సంబంధమైన ప్రశ్నలకు జవాబులిస్తూ పన్నెండు గంటలు నిర్విరామంగా కార్యక్రమాన్ని నిర్వర్తించి రికార్డు సృష్టించారు. పలు సంస్థలు నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని అనేక సాహిత్యాంశలపై కీలకోపన్యాసాలు చేసిన సాహిత్య విశ్వరూపం చూడాలంటే ఆయనంత కృషి సల్పిన వారికే సాధ్యమవుతుంది. ఇంతటి సాహితీ తాళతరువైనా పండితుల నుండి పామరులదాకా ఆయనకున్న పరిచయాలు చూస్తే ఆయన వ్యక్తి సులభుడుగా కనిపిస్తారు.ఇంతటి భేషజాలు లేని మనిషిని,ఎంతటి వారినైనా

నిర్భీకంగా విమర్శించే నిక్కచ్చితనం గల వ్యక్తిని,సంపాదన కంటే దాని సద్వినియోగానికే ప్రాధాన్యతనిచ్చే పురుషపుంగవుని సాహిత్యలోకంలో మరొకరిని ఈయనకు సాటిగా చూపలేం. తనకు లభించిన లక్షరూపాయల పురస్కారంతో ద్వానా సాహితీ కుటీరం నెలకొల్పి తద్వారా ఆయన పుట్టిన రోజు సందర్భంగానో, ఇతరంగానో వరిష్ఠుల్ని సత్కరించే సంప్రదాయం వారి ఔన్నత్యానికి,ఔదార్యానికీ ప్రతీక. ఇంతటి అరుదైన సాహితీ వ్యక్తిత్వం గనుకనే ద్వానాపై అయిదు పరిశోధన గ్రంథాలు వెలువడినాయి.

ఈయన పొందిన సన్మానాలు,సత్కారాలు, పుర స్కారాలకు లెక్క లేదు.సింగపూర్,మారిషస్,అమెరికా,శ్రీలంక,ఇండొనేషియా వంటిదేశాలు పర్యటించి అక్కడి తెలుగువారిని తమ ప్రసంగాలతో ప్రసన్నపరచిన ద్వానాను సత్కరించని తెలుగు సాహిత్య వేదిక లేదనేది నిర్వివాదాంశం.సాహిత్య సవ్యసాచిగా పిలువబడే ద్వానా బద్దలు కొట్టిన రికార్డులు అన్నీ ఇన్నీ కావు.గతనలభై ఆరేళ్ళుగా వివిధ పత్రికల్లో వేలాది పుస్క సమీక్షలు రాయడం,శ్రమదమాదులకోర్చి వందేళ్లనాటి సాహిత్యకారుల ఛాయాచిత్రాలు సేకరించి ప్రచురించడం,కీర్తిశేషులయిన సాహితీమూర్తుల పిల్లలచే వారిగురించి వ్యాసాలు రాయించి మా నాన్నగారు పుస్తక రూపంలో తేవడం,పన్నెండు గంటలపాటు నిర్విరామ ప్రసంగం,ఆరుగంటల పాటు పలుకరిస్తే ప్రసంగం చేసి వండర్ బుక్ఆఫ్ వరల్డ్ లాంటి రికార్డులు సాధించటం,నూటాఎనభై ఎనిమిది నిమిషాలపాటు ఎనిమిదిశతకాలలోని వ్యక్తిత్వవికాసం పై ప్రసంగించటం వంటివి ఎన్నో ఉన్నాయి.

సాహిత్యమే శ్వాసగా జీవిస్తూ రచన,పరిశోధన, బోధన,విమర్శ,ప్రసంగం వంటి ప్రక్రియలను నిత్యకృత్యాలుగా జేసుకుని నిత్య చైతన్యశీలిగా ఆదర్శ సాహితీ మూర్తిగా వెలుగొందుతున్న డా. ద్వాదశి నాగేశ్వరశాస్త్రి గారికి సప్తతి వేడుకలు జరుపుకున్న కొద్దిరోజులకే 25 ఫిబ్రవరి 2019 న అకస్మాత్తుగా కన్నుమూయటం సాహిత్యలోకానికి తీరని లోటు.

చిలకమర్తి దుర్గా ప్రసాదరావు

సంస్కృతసాహిత్యంలో రిపార్టీ కవితా ప్రక్రియ

సంస్కృతసాహిత్యం ఆకాశం కంటే విశాలమైంది, సముద్రం కంటే లోతైంది . ఎందుకంటే సంస్కృతసాహిత్యం అన్ని ప్రాచీనసాహిత్య ప్రక్రియలకు నిధి అవడమే కాకుండా అన్ని ఆధునికసాహిత్యప్రక్రియలకు కూడ మాతృకగా కనిపిస్తోంది. అది ప్రాచీనంలో ప్రాచీనం ఆధునికంలో ఆధునికం . ఇక ఆంగ్ల సాహిత్యంలో Repartee అనే ఒక సాహిత్య ప్రక్రియ ఉంది . రిపార్టీ అంటే Ready reply అని A witty reply అని Talk characterized by clever and witty replies. ‘అని నిర్వచిస్తారు

సాధారణంగా మానవులలో ఇతరులను ఆక్షేపించే స్వభావం ఎక్కువగా కనిపిస్తుంది . ఏదో వంక పెట్టుకుని ఎక్కడో అక్కడ ఎవరో ఒకరిని ఆక్షేపిస్తూనే ఉంటారు . ఆక్షేపణలు సహించలేని వాళ్ళు తగిన సమాధానం చెబుతూనే ఉంటారు .

ఈ ఆక్షేపణ ముఖ్యంగా మూడు స్థాయిల్లో ఉంటుంది . కొంతమంది వేళాకోళంగా ఇతరులను ఆక్షేపిస్తూ ఉంటారు, వారి మనస్సుల్లో ఎటువంటి చెడు ఉద్దేశం ఉండదు. మరికొంత మంది మనస్సులో ఒకటి పెట్టుకుని ఇతరులను ఆక్షేపిస్తూ ఉంటారు. మరికొంతమంది సూటిగా కఠినంగా ఆక్షేపిస్తారు . ఎవరు ఏస్థాయిలో, ఎంత మోతాదులో , ఏ విధంగా ఆక్షేపిస్తే వారికి ఆ స్థాయిలో అంతే మోతాదులో ఆ విధంగా సమాధానం చెప్పడం Repartee అనుకోవచ్చు . ఈ విధంగా మృదువు , కఠినం , అతికఠినంగా చేసే ఆక్షేపణలు దానికి తగిన సమాధానాలు సంస్కృత సాహిత్యంలో కోకొల్లలు . అవి ఎలా ఉంటాయో స్థాలీపులాక న్యాయంగా కొన్నిటిని పరిశీలిద్దాం

ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల చిలిపి సంభాషణలు , వేలాకోలాలు జగత్ప్రసిద్ధాలు . పార్వతి వాస్తవానికి అచలపుత్రికే అయినా చలచిత్తం కలది. చాల చిలిపిది. ఒకనాడు సరదాగా తన భర్తను ఒక ఆటపట్టిద్దామనుకుంది . కాని ఆయన తనకంటే తెలివైన వాడని మాత్రం ఊహించలేక పోయింది పాపం. ఏమండి ! నాకు అమ్మ నాన్న ఇద్దరూ ఉన్నారు . నాకున్నట్లుగా మీకు అమ్మానాన్నలెక్కడున్నారో చూపించండి అంది కొంటెగా. శివుడు దానికి సమాధానంగా ఓహో అదా ! నాకు అత్తా మామ ఇద్దరూ ఉన్నారు . నాకున్నట్లుగా నీకు అత్తా మామలు ఎక్కడున్నారో చూపించు అన్నాడు నవ్వుతూ. ఏం చూపిస్తుంది ? వెంటనే ఉడుక్కుంటూ బుంగమూతి పెట్టి ఆయన ఒడిలోకి వంగి వాలిపోయి ఉంటుందని ఊహిద్దాం. ఈ విధంగా పార్వతి కొంటె ప్రశ్నకు తగిన సమాధానం చెప్పిన ముక్కంటి మాటలు మనల్ని రక్షించుగాక

క్వ తిష్ఠత: తే పితరౌ మమేవే
త్యపర్ణయోక్తే పరిహాసపూర్వం
క్వ వా మమేవ శ్వశురౌ తవేతి
తామీరయన్ సస్మితమీశ్వరోఽవ్యాత్

ఇప్పుడు ఎంతో స్నేహం గల ఇద్దరు యువతులమధ్య వేళాకోళం (ఆక్షేపణ సమాధానం) ఎంత అందంగా ఉంటుందో చూద్దాం.

ఒకసారి శివకేశవులిద్దరూ తమ భార్యలతో ఒక చోట సమావేశమయ్యారు. ఒక ప్రదేశంలో శివకేశవులులిద్దరూ కూర్చొని

ఏవో మాట్లాడుకుంటున్నారు. మరొక ప్రదేశంలో లక్ష్మీపార్వతులు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. పార్వతి లక్ష్మితో ఏమమ్మా! చంచలమైనదానా! నిన్నొమాటడుగుతాను సమాధానం చెబుతావా? అంది . సరే అడగవమ్మా! శివుని పెళ్ళామా! అంది లక్ష్మి. మీనాన్న ఎవరు? అంది పార్వతి. వెంటనే లక్ష్మి సముద్రుడు అని సమాధానం చెప్పింది. వెంటనే పార్వతి ఊరుకోవమ్మా! ఎవరు నమ్ముతారు. నీళ్లకెక్కడైన పిల్లలుపుడతారా! నేను నమ్మను గాక నమ్మను అంది. ఓహో! సరేలే! నువ్వు నమ్మకపోతే మానెయ్యి. పర్వతాలకు పిల్లలు పుట్టగాలేంది సముద్రానికి మాత్రం పిల్లలు పుట్టరా ఏంటి? అంది . అది ఎవరు నమ్ముతారో వాళ్లే ఇది కూడా నమ్ముతారులే అని లక్ష్మి సమాధానం చెప్పింది. నువ్వు పర్వతం కూతురువైనప్పుడు నేను సముద్రం కూతుర్ని ఎందుకు కాకూడదు అని లక్ష్మి సమాధానం లోని అంతరార్థం.

ఈ విధంగా పరస్పరం వేళాకోళాలాడుకుంటున్న లక్ష్మీపార్వతుల సరససల్లాపాలను వింటూ హరిహరులు లోలోపల ఎంతో ఆనందిస్తున్నారట. అటువంటి ఆ శివకేశవుల ఆనందం మన విఘ్నాలు పోగొట్టి మనలను రక్షించుగాక అని ఒక కవి అందమైన శ్లోకం వ్రాశాడు.

లోలే! బ్రూహి కపాలికామిని ! పితాకస్తే? పతి: పాథసాం
క: ప్రత్యేతి జలాదపత్యజననం?
ప్రత్యేతి య: ప్రస్తరాత్
ఇత్థం పార్వతిసింధురాజసుత-
యోరాకర్ణ్యవాక్చాతురీం
సంస్మేరస్య హరేర్హరస్య చ
ముదో నిఘ్నంతు విఘ్నం తు
వ:

ఇవి కేవల వేళాకోళపు మాటలు వానికి తగిన సమాధానాలు. ఇపుడు కొంచెం మోతాదు మించిన ఆక్షేపణలు దానికి తగిన సమాధానాలు ఎలా ఉంటాయో తెలుసుకుందాం.

మనం ఎంత గొప్ప వాళ్లమైనా కావొచ్చు గాని ఇతరుల్ని కించపరిస్తే అది మనకు ముప్పు తెచ్చి పెడుతుంది. ఒక్కొక్కప్పుడు మన అస్తిత్వానికే ప్రమాదం తెచ్చి పెడుతుంది. ఆత్మశ్లాఘ ఎంత ప్రమాదమో పరనింద అంతకంటే ఎక్కువ ప్రమాదం. అందువల్ల మనం ఎంత ఉన్నతంగా ఉన్నామో అంత అణకువగా కూడ ఉండడం నేర్చు కోవాలి. లేకపోతే సమాజమే మనకి గొప్ప గుణ పాఠం చెబుతుంది. ఇతరుల్ని కించపరిస్తే కల్గే నష్టాన్ని ఒక సంస్కృత కవి ఎంత చక్కగా వివరించాడో స్వయంగా చూడండి.

ఒకరోజు లక్ష్మి వైకుంఠం నుంచి బయలుదేరి కైలాసంలో ఉన్న పార్వతి ఇంటికి వెళ్లింది. పార్వతి, ఇంటికి వచ్చిన అతిథిని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టింది. లక్ష్మి ఆ పరిసరాలన్నీ పరికించింది. పార్వతికి లక్ష్మికున్నంత ఐశ్వర్యం లేదు, డాబు లేదు. పరిసరాలన్నీ సామాన్యంగా ఉన్నాయి. లక్ష్మికి అనుకోకుండా పార్వతిని ఓ ఆట పట్టించాలనే ఆలోచన కల్గింది.

"భిక్షార్థీ స క్వ యాత:?" అని చిన్న ప్రశ్న వేసింది. మీ ఆయన ఎక్కడికెళ్లాడమ్మా అంటే బాగుండేది కాని లక్ష్మి అలా అనలేదు. ఆ ముష్టివాడు ఎక్కడికెళ్లాడమ్మా అంది. శివుడు ఆది భిక్షువు కదా! లక్ష్మి ఆ విషయాన్ని ఎత్తిపొడుస్తూ వెటకారంగా మాట్లాడింది. పార్వతి కి ఈ ప్రశ్న చాల బాధ కల్గించింది . ఏ ఆడదైనా తనను ఎన్నన్నా సహిస్తుందిగాని తన భర్తను నిందిస్తే ఏమాత్రం సహించలేదు కదా! కాని ఏంచేస్తుంది. ఇంటికి వచ్చిన అతిథిని మందలిస్తే బాగుండదు. అలాగని సరిపెట్టుకుని ఊరుకోనూలేదు. ఏదో సమాధానం చెప్పాలి. ఏంచెప్పాలి? కొంచెం ఆలోచించింది.

"సుతను బలిమఖే "

అంది. 'బలి చక్రవర్తి చేస్తున్న యాగం దగ్గరకు వెళ్లారమ్మా! అని సమాధానం. ఆ సమాధానం వినేసరికి లక్ష్మికి తలతిరిగి పోయింది. బలి దగ్గరకు వెళ్లిన ముష్టివాడు తనభర్త శ్రీమహావిష్ణువు. వామనావతారంలో ఆయన బలి-

చక్రవర్తిని మూడడుగులు నేల అడగడం లోకవిదితమే. 'మా ఆయనే కాదు మీ ఆయన కూడా ముష్టివాడే, మా ఆయనకన్నా మీ ఆయనే దారుణం. కేవలం మూడడుగుల నేలకోసం ముష్టివాడయ్యాడు'

అనే భావం పార్వతి మాటల్లో తొంగి చూసింది. లక్ష్మి కొంతసేపటికి ఎలాగో తేరుకుంది. మళ్లీ ఏదోవిధంగా పార్వతిని ఉడికించాలని సమాయత్తమయింది. రెండో ప్రశ్న వేసింది.

"తాండవం క్వాద్య భద్రే!"

అనడిగింది. అమ్మా! మీ ఆయన ఈ రోజు నాట్యం ఎక్కడ చేస్తాడు? అని దానర్థం. మీ ఆయన ఏ పని పాట లేకుండా దిగంబరంగా నాట్యం చేస్తుంటాడని లక్ష్మి మాటల్లోని అంతరార్థం. అప్పటికే ఆరితేరిన పార్వతి వెంటనే అందుకుంది.

"మన్యే బృందావనాంతే"

అంది. బృందావనంలో అనుకుంటున్నానమ్మా! అని ఆ మాటలకర్థం. బృందావనంలో నాట్యం చేసే ప్రబుద్ధుడు కృష్ణుడు, శివుడు కాదు. 'మా ఆయనే కాదు మీఆయన కూడ నాట్యం చేస్తాడు. ఎటొచ్చీ మా ఆయన ఒంటరిగా నాట్యం చేస్తాడు అంతే గాని మీ ఆయన లాగ అందరి ఆడవాళ్లను వెంటేసుకుని నాట్యం చెయ్యడు' అని సమాధానం. పార్వతి సమాధానం ఇంత పదునుగా ఉంటుందని లక్ష్మి ఊహించలేదు. ఆమెకు మతిపోయినంత పనయింది. ఏలాగో సంబాళించుకుంది. ఈ సారి తనకు ఇబ్బంది లేని విధంగా మాట్లాడాలనుకుంది.

"కృనుచ మృగ శిశు: "?

అని మరో ప్రశ్న వేసింది. మీ ఏనుగు మొగంవాడు ఎక్కడమ్మా? అని అర్థం. లక్ష్మి కొడుకు మన్మథుడు చాల అందగాడు. పార్వతి కొడుకు వినాయకుడు ఎంత అందగాడో వివరించి చెప్పనవసరంలేదు. 'మా అబ్బాయి చాల అందగాడు మీ అబ్బాయి మాత్రం కురూపి' అని లక్ష్మి ఆక్షేపణలోని అభిప్రాయం. పార్వతి చాల నొచ్చు కుంది. కాకి పిల్ల కాకికి ముద్దన్నట్లు ఎవరిపిల్లలు వాళ్లకు ముద్దు. పార్వతి మెదడులో ఒక ఆలోచన తళుక్కుమని మెరిసింది. వెంటనే అంది.

"నైవ జానే వరాహం"

అని. "ఇక్కడేదో పంది తిరుగుతూ ఉంటే దానివెంట వెళ్లాడమ్మా ఎక్కడున్నాడో తెలీదు" అంది. మా అబ్బాయిది ఏనుగు ముఖమేగాని మీ ఆయన పూర్తిగా వరాహావతారమే సుమా! అని పార్వతి సమాధానం లోని చమత్కారం. ఇది లక్ష్మికి దిగ్భ్రాంతి కల్గించింది. కొంతసేపటికి ఎలాగో తేరుకుంది. ఈసారి జాగ్ర త్తగా తనకు ఎదురుదెబ్బ తగలని విధంగ పార్వతికి దెబ్బకొట్టాలనుకుంది. అటు ఇటు కాసేపు చూసింది.

బాలే! కచ్చిన్న దృష్ట : జరత వృషపతి:?

అనడిగింది. 'మీ వాహనం, అదే ఆ ముసలి ఎద్దు ఎక్కడా కనబడడం లేదేమిటమ్మా! అని ప్రశ్న. 'మాది గరుడ వాహనం విమానాల్లో వలే ఆకాశంలో తిరుగుతాం. మీరు నేలపై తిరుగుతారు. మీ వాహనం ముసలి ఎద్దు. అది కదల్లేదు మెదల్లేదు' అని ఆక్షేపం. మేం పై స్థాయి వాళ్లం మీరు నేలబారు మనుషులు అని వెక్కిరింపు. ఆ వెక్కిరింపు అర్థం చేసుకోలేనంత అమాయకురాలు కాదు పార్వతి. అందుకే వెంటనే అందుకుంది.

"గోప ఏవాస్య వేత్తా"

అంది. 'ఆవులసంగతి ఎద్దుల సంగతి గోవుల్ని కాసేవాణ్ణి అడిగితే తెలుస్తుంది గాని నన్నడిగితే ఏం లాభమమ్మా? పో మీఆయన్నే అడుగు' అని చిన్న చురక అంటించింది. మా ఆయన నడిపే వాహనాన్ని మీఆయన మేపుతాడు. మీకంటే మేమే ఎక్కువ అని పార్వతి ఆంతర్యం. ఈ సమాధానానికి లక్ష్మి పూర్తిగా అవాక్కయింది. తిన్నగా జారుకుం ది.

నిజానికి ఇదంతా వారిద్దరి మధ్య వేళాకోళంగా జరిగిన సంభాషణ. ఇందులో నిందగాని వెక్కిరింపుగాని ఏమాత్రంలేవు. ఇతరులను అవమానపరిస్తే అది మనకు

ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంద-నే సత్యాన్ని చెప్పడానికే ఒక కవి లక్ష్మీపార్వతులను పాత్రలుగా చేసుకుని ఈ సన్నివేశాన్ని కల్పించాడు. ఇందులో నీతి ముఖ్యం గాని ప్రశ్నలు సమాధానాలు ముఖ్యం కాదు. వారిరువురి మధ్య జరిగిన ఈ సరసమైన సంభాషణ మనందరిని రక్షించుగాక అని చమత్కరించాడోకవి. ఇంత సరసమైన భావాన్ని తనలో దాచుకున్న ఈ శ్లోకం చదవండి.

భిక్షార్థీ స క్వ యాత: ?సుతను బలిమఖే " తాండవం క్వాద్య భద్రే ?
మన్యే బృందావనాంతే క్వను చ మృగశిశు:? నైవ జానే వరాహం బాలే కచ్చిన్న దృష్ట: జరతవృష పతి:? గోప ఏవాస్య వేత్తా లీలాసంలాపఇ-త్థం జలనిధిహిమవత్కన్యయో: త్రాయతాం న :

పెళ్లంటే కొంతమందికి నూతేళ్ల పంట. మరి కొంతమం దికి నూతేళ్ల వంట . ఇంకా కొంతమందికి నూతేళ్ల పెంట. ఒకాయన తన స్నేహితునితో ' ఒరేయ్! నేను ఇంటికి వెళ్లే దాక నా భార్యాపిల్లలు భోజనమేచెయ్యరు' అన్నాడట. ఆ స్నేహితుడు చాలసంబరపడిపోతూ ' అబ్బా! నువ్వంటే నీ భార్యాపిల్లలకు ఎంత ప్రేమరా! నువ్వు నిజంగా చాల అదృష్ట వంతుడివి' అని మెచ్చుకున్నాడట. వెంటనే వాడు ప్రేమాకాదు దోమాకాదు. ఇంటికెళ్లి నేనే వంటచెయ్యాలి' అన్నాడట తాపీగా. నిజానికి మానవజీవితానికి వంటకి అవినాభావసంబంధం ఉంది. కాబట్టి ఎంతటి బంగారు పళ్లేనికైనా గోడచేర్పు ఎలా అవసరమో ఎంతటి గొప్పమగాడికైనా వంట నేర్పు కూడ అంతే అవసరం

ఒక విధంగా ఆలోచిస్తే దమయంతి ఇంద్రాది దేవతలందర్ని త్రోసిరాజని సామాన్యుడైన నలమహారాజునే పెళ్లి చేసుకోడానికి, అలాగే ద్రౌపది పాండవుల్లో అందరికంటే భీముణ్ణే ఎక్కువగా ఇష్ట పడడానికి కారణం వారికి గల పాకశాస్త్ర ప్రావీణ్యమే అని అనిపించక మానదు. ఏది ఏమైన she లో he ఒదిగి నట్లుగా woman లో man ఒదిగినట్లుగా వంటపనిలో పురుషుడు భార్య వెనుక ఒదిగే ఉంటున్నాడు. వంట చెయ్యనంటే జీవితంలో మిగిలేది పెంటే.

వంట పేరుతో తమ జీవితాల్ని పెంట పాలు చేసుకున్న ఒక జంట మధ్య జరిగిన వాగ్వివాదం ఇక్కడ పొందుపరచ బడింది. సరదాగా చదువుకుని ఆనందించండి. ఇది చదివేక వంటరాని వారు కొద్దో గొప్పో వంట నేర్చుకోండి. కనీసం వంటచేసేవారికి సహాయసహకారాలు అందజెయ్యండి.

ఒకాయన పాపం ఎప్పుడూ ఇంట్లో ఆయనే వంట చేసేవాడు. అనుకోకుండా ఒకరోజు పొరుగూరు వెడుతూ ఆపని భార్యకు పురమాయించాడు. ఆమె అయిష్టంగానే తలూపింది

తిరిగి తిరిగి ఎప్పటికో ఇంటికి చేరుకున్నాడు. కడుపు నకనక లాడుతోంది. వంటచేశావా? అన్నాడు. వెంటనే 'నో" అంది. అసలే ఆకలితో ఉన్నాడేమో ఒళ్లు మండి పోయింది.

పాపాత్మురాలా! వంట ఎందుకు-చెయ్యలేదే ? అన్నాడు.

ఏంటి నేను పాపాత్మురాలనా! కాదు మీనాన్నే పాపాత్ముడు అంది.

ఏమే తప్పుడుదానా ఏంటి వాగుతున్నావు అన్నాడు.

ఆ పదం మీఅమ్మకి మీచెల్లికి వర్తిస్తుంది నాక్కాదు అంది.

వెంటనే ఈ ఇంట్లోంచి బయటికి పోవే అన్నాడు .

ఇది నీ ఇల్లు కాదు పొమ్మనడానికి నీకు హక్కు లేదంది.

భగవంతుడా ! నాకు కనీసం చావు నైన ప్రసాదించవయ్యా అన్నాడు

ఆవిడ కూడ తక్కువదేమీకాదు. 'మీలో తప్పుంటే మీరు పోతారు నాలో తప్పుంటే నా మాంగళ్యం పోతుంది' అనేంతటి గొప్ప ఇల్లాలు. అందుకే ఏమీ తడుముకోకుండా నాకంత అదృ ష్టమా అంది.

(35 వ పేజీ చూడండి)

ఆదూరి హైమవతి

మిత్రద్రోహి

పర్తివారిపల్లెలో అనంతమూ,ఆనందమూ అనే ఇద్దరు స్నేహితు లుండేవారు. ఇద్దరూ రైతులే. ఆనందు ఎప్పుడూ నిజాయితీగా తన రాబడిని అమ్ముకుంటూ పొదుపుగా సంసారానికి సంపాదన వాడు కుంటూ కాస్తంత సొమ్ము వెనకేశాడు.

కొడుకు చదువ్వూ, కూతురి పెళ్ళీ ఉండటాన ఏనాడూ ఏ వృధాఖర్చూ చేసే వాడు కాదు. పొదుపుచేసిన సొమ్మును పొరుగూర్లో ఉన్న బ్యాక్ లో దాచుకున్నాడు.

అనంతం మాత్రం అమితంగా స్థాయికి మించి ఖర్చుచేస్తూ పొలం మీది రాబడి నంతా విచ్చలవిడిగా పిల్లల గుడ్డలకూ, భార్య సొమ్ము కూ, సరదాలకూ ఖర్చుచేసి సంవత్సరాంతానికి ఆనందం వద్దకు అప్పులకు వచ్చేవాడు. ఎక్కువగా ఆనందే అనేకమార్లు ఆదుకునే వాడు.

ఆనందూ!నీవు లేకపోతే నేనేమై పోయేవాడినో కదా!నీ ఋణం తీర్చుకో లేనిది."అంటూ మాట్లాడే వాడు.

అనంతూ కాస్తంత పొదుపు పాటించవయ్యా! బిడ్డలకోసం చేయా ల్సిన ఖర్చులు ముందున్నాయి " అని చెప్పేవాడు ఆనందు.

వీరిద్దరికీ ఎలాస్నేహం కుదిరిందాని ఊళ్ళోవారు ఆశ్చర్యపడేవారు. ఒకరు పొదుపరీ, ఒకరు వృధావ్యయం చేసేవాడూ కనుక.

ఇద్దరి పిల్లలూ పెరిగి పెద్దవాళ్ళు కాసాగారు. మంచి సంబంధం కుదరడంతో ఆనందు కూతురిపెళ్ళి ఖాయం చేశాడు. పెళ్ళి ఖర్చులనిమిత్తం పొరుగూరి బ్యాంక్ లోదాచుకున్న సొమ్ము తెచ్చు కోను వెళ్ళి, అంతా ఒక సంచీలో కాక రెండు సంచీల్లో సగం సగం సొమ్ము దాచి, తిరుగు ప్రయాణమయ్యాడు. సొమ్మును పంచె లోపల నడుముకు కట్టుకున్నాడు. ఊరి పొలిమేరల్లోకి వచ్చాక పొలం గట్ల మీద నడుస్తూ అల్పాచమా నానికి వెళ్లవలసి వచ్చి , పంచె వదులు చేసుకుని , పనికానిచ్చి బయల్దేరాడు.

ఇంటికొచ్చి చూసుకుంటే ఒకేసంచీ ఉంది. రెండో సంచీ ఎక్కడో జారి పోయి ఉంటుందని భావించి ఉరుకులూ పరుగుల మీద వెతు క్కుంటూ బయల్దేరాడు. చమటతో తడిచి భయంతో వణుకుతూనే వెతుక్కుంటూ వెళుతుండగా, దార్లో అనంతం కనిపించి,"ఎక్కడికి ఆనందూ ! చెమట క్రక్కుతూ బయల్దేరావ్?" అని పలకరించాడు. "అనంతూ ! ఆడబిడ్డ పెళ్ళికోసం నోరు కట్టుకుని పొరుగూరి బ్యాంక్లో దాచిన సొమ్ము తీసు కుని, తెచ్చుకుంటూ ఉండగా ఊరిపొలిమేరల్లో డబ్బున్న ఒక సంచీ ఎక్కడో పడి పోయిందయ్యా! దాని కోసం వెతుకు తున్నాను." అనిచెప్పాడు వెతుకుతూ నడుస్తూనే. "అయ్యో పాపం! నేనూ వెతికి పెడతాను. ఎలాఉంటుందాసంచీ?" అన్నాడు అనంతు.

గులాబీరంగు సంచీ మూతి తెల్ల దారంతో కట్టిఉంది"అన్నాడు ఆనందు .

ఆమాటలు విన్న అనంతు తన బొడ్లో ఉన్న వస్తువును ఒకమారు చేత్తో తాకి చూసుకున్నాడు.

ఎంతవెతికినా ఎక్కడా డబ్బు సంచీ కనిపించక బాధపడుతున్న ఆనందు తో " పోయిన వస్తువు ఎలా కనిపిస్తుంది ఆనందూ! పద పోదాం ,ఎక్కడో అప్పు చేద్దువు గాని,తర్వాత తీర్చుకోవచ్చు. ముందు శుభ కార్యం గట్టెక్కనీ-"అంటూ వెనక్కు తీసుకువచ్చి-ఆనందును ఇంట్లో దింపిపో-

యాడు.
మూడు నాలుగు రోజులు బాధపడ్డాక ఆనందు అప్పుకోసం ఎవరిని అడగాలా అనుకుంటుండగా అనంతు వచ్చి " మా బావమరిది ఇక్క డ పొలం కొనాలనుకుంటూ కొంతడబ్బు నావద్ద ఇచ్చి వెళ్ళాడు. ముందు నీ పని గడవనీ నాకు ఎన్నిమార్లు సాయంచేశావు?ఇంద ఉంచు ,"అంటూ కొంత డబ్బున్న సంచీ ఆనందు చేతిలో పెట్టాడు.

ఆనందు అనంతును ఆలింగనం చేసుకుని ఆసొమ్ము ఇంట్లో దాచ మని భార్య కిచ్చాడు. ఆమరునాడు ఆనందు పెళ్ళిఖర్చుల కోసం అనంతు ఇచ్చిన సంచీ తెరిచి చూడగా తాను బ్యాంకు నుంచీ తీసు కున్నసొ-మ్మును కట్టలు కట్టి ఇచ్చిన దారం అదే లాగా ఉండటంతో , బ్యాంకు అధికారులు సొమ్ము ఇచ్చినపుడు నోట్ల నెంబర్లు ఒక కాయి తం మీదరాసి ఇచ్చిన గుర్తొచ్చి,ఆకాయితం తెచ్చి రెండూ ట్యాలీచేసి చూశాడు, నిజం తెలిసింది. అనంతుకే ఆసంచీ దొరికింది, దాన్ని దాచి ఆ సొమ్మేతనకు బావమరిది సొమ్ము ని ఇచ్చాడు. ఇంత మిత్ర ద్రోహితోనా తాను ఇంతకాలం స్నేహం చేసింది అని బాధపడ్డాడు ఆనందు.

ఆనందు కొడుకు అనంతు వద్ద కెళ్ళి" మామా! మీ బావమరిది ఎక్క డుంటాడో చెప్తావా? అతడికే మా నాన్న పోగొట్టుకున్న డబ్బు సంచీ దొరికింది. అతడ్ని పోలీసులకు పట్టివ్వాలి,ఆ నోట్ల మీది నెంబర్లే బ్యాంక్ అధికారు లు డబ్బిస్తూ మా నాయన గారికి ఒక కాయితం మీద వ్రాసి ఇచ్చారు" అంటూ అడిగేసరికి ,అనంతు ఆనందు కొడుకు చేతు లు పట్టుకుని, "బాబ్బాబు మన్నించు, దీన్ని బయట పెట్టకు, బుద్ధి గడ్డి తిని మిత్ర ద్రోహం తలపెట్టాను. ఇవిచేతులుకావు , దొరగ్గానే ఇవ్వాలనిపించినా నా దుర్వ్యయం నా బుద్ధినిపెడమార్గం పట్టిం చింది." అంటూ కళ్ళనీరు పెట్టుకున్నాడు.

మామా మా నాన్నగారు చెప్తూనే ఉన్నారు. పొదుపరి తనం నేర్చుకో మని ,దుబారా మనిషిచేత ఏచెడ్డపనై-నా చేయిస్తుంది." అంటూ వెళ్ళాడు. పొదుపరితనం మంచితనానికి మదుపు.

****

సంస్కృతసాహిత్యంలో రిపార్టీ కవితా ప్రక్రియ

(33 వ పేజీ తరువాయి)

(36 వ పేజీ చూడండి)

ఇంతటి భీకరమైన వాగ్వివాదం తనలో పొందుపరచుకున్న ఈ మనోహర శ్లోకం చదవండి.

ఆ: పాకం న కరోషి పాపిని? కథం పాపీ త్వదీయ: పితా
రండే జల్పసి కిం? తవైవ జననీ రండా త్వదీయా స్వసా
నిర్గచ్ఛ త్వరితం గృహాద్బహిరితో నేదం త్వదీయం గృహం
హాహా! నాథ! మమాద్య దేహి మరణం తావన్న భాగ్యోదయ:

కాబట్టి ఇతరులతో మాట్లాడేటప్పుడు వారిమనస్సు నొచ్చుకోకుండా మాట్లాడగలగడం ఒక కళ.

నందుల ప్రభాకర శాస్త్రి

మా ఊరి నందుల ఆత్మీయ కథ

మొలకల పున్నమి

ఇది కూడా పిల్లలు ఎక్కువ ఇష్టపడే పండగ. పాడ్యమి రోజు పిల్లలు ఇంటింటికి పోయి అన్ని రకాలైన ధాన్యాలు సేకరిస్తారు. మా ఊరి రామాలయంలో గర్భగుడికి ఇరువైపుల రెండు గదులుండేవి. ఈ గదుల్లో అడుగు ఎత్తున మా ఊరి చెరువులో ఉండే ఒండ్రు మట్టిని తట్టలతో పోసి నీళ్ళు చల్లేవాళ్ళం. పిల్లలు సేకరించిన ధాన్యం ఒకరోజు నీటిలో నానబెట్టి ఈ రెండు గదులలో ఉండే మట్టిలో చల్లేవాళ్ళం. రాతి రోజూ నీళ్ళు చిలకరిస్తూ ఉండేవాళ్ళం. అవి మొలకెత్తి దినదిన ప్రవర్ధమానమౌతాయి. పౌర్ణమి రోజు పెద్దలందరూ వచ్చి పరిశీలించి ఏ రకమైన ధాన్యం బాగా మొలకెత్తి పెరిగిందో ఆ సంవత్సరం ఆ పంట బాగా ఎక్కువగా వేసేవాళ్ళు.

పౌర్ణమి రోజు పిల్లందరూ తలస్నానాలు చేసి, జొన్న దంట్లు చీల్చి ఆ బెండ్లతో రకరకాల గాజులు, బాణాలు చేసి ప్రభలు కట్టేవాళ్ళు. ఒక ఇంచి బెండుకు జొన్న ఈనెను గుచ్చి, ఆ బెండును కుంకుమ నీళ్ళలో ముంచి, రెండవ కొనను ఆ బెండు యొక్క రెండవ కొనలో గుచ్చితే, అది గాజు అవుతుంది. గుచ్చకుండా అలాగే ఉంచితే అది బాణం అవుతుంది. అట్లా పసుపు నీళ్ళతో, బొగ్గు నీళ్ళతో ఇలా రంగు రంగు గల ఆకారాలు చేసి, పొడవాటి కట్టెకు కట్టి, అడ్డ కట్టెకు వేలాడదీసి, ఈ మొలకెత్తిన వాటినన్నిటినీ పీకకి ఈ ప్రభలకి కట్టి అందరూ పోలేరమ్మ గుడి దగ్గరకు వెళ్లి,మొలకలు అక్కడ పెట్టి ఈ ప్రభలను ఆ విగ్రహం ముందు కొట్టి వచ్చేవాళ్ళు.

అంకాలమ్మ తిరునాల

ఈ గుడి మా ఊరికి అయిదు మైళ్ళ దూరంలో వుండే 'మున్నెల్లి' అనే వూర్లో ఉండేది. ఈ తిరునాల ఎండాకాలంలో జరుగుతుంది. చుట్టుపక్కల ఓ పాతిక ఊర్ల వాళ్ళు ఈ పండగలో పాల్గొంటారు. పిల్లలందరూ ఈ తిరునాల్లకని చాలా రోజుల నుంచి డబ్బులు కూడబెట్టుకుంటారు. చేలో గీక్కున్న సెనక్కాయలు అమ్మి, వరి చేలో పరిగలు ఏరుకుని అమ్మి డబ్బు కూడబెట్టుకుంటారు. ఆ తిరుణాల నాడే, మా ఇంట్లో మా జేజినాయన తద్దినం వస్తుంది. అందుకై అమ్మ తెల్లవారు ఝామున మూడు గంటలకు లేచి, అపరాహ్ణానికి వంటలు తయారు చేసి,సాయంత్ర మూడు కల్లా భోజనాలు అయిపోయేలా చేస్తుంది. తిరునాళ్ళకు అందరూ బండి కట్టి అంకాలమ్మ గుడి చుట్టూ తిప్పుతారు. అలా తిప్పితే పశువులకు మంచిదట.

బండిని రంగు రంగుల కాగితాలతో అలంకరించి మంచి రంగు రంగుల చీరలతో బండిపై

గుడి లాగ కట్టి బండిలో పానకం, గుగ్గుళ్ళు పెట్టుకుని బయలుదేరతారు. గుడి చుట్టూ బండిని విపరీతమైన వేగంతో తోలుతుంటారు. గుగ్గుళ్ళు అడుక్కునేవాళ్ళు కట్టెలకు గుడ్డ సంచీ కట్టి దూరంగా వుండి బండి దగ్గరకు ఈ సంచిని పట్టుకుంటే ఆ సంచీలో గుగ్గుళ్ళు వేస్తారు బండిలో వుండే మనిషి. మరికొంతమంది అయితే 'బండిగాండ్లు' తిరగకుండా బిర్రు పెట్టి ఎద్దులను గుడి చుట్టూ తిప్పుతారు.

ఇంకా సుడిమాను బండిని లాగటం ఇక్కడ ప్రత్యేకం. బండి పైన పెద్ద బరువైన, పొడవైన 'సుడిమాను' ను నిలబెట్టి కడతారు. అది బండి ముందుకు వంగి బరువంతా ముందు వైపే వుంటుంది. 'అరక' అంటారు ఈ బరువును. ఈ బరువును మొయ్యాలంటే ఆరితేరిన ఎద్దులు తప్ప మొయ్యలేవు. ఈ బండిని అంకాలమ్మ గుడి చుట్టూ మూడుసార్లు తిప్పుతారు. ఒకసారి మా లేత ఎద్దులతో తిరునాళ్ళ బండి కడితే మా నాయనకు తెలియకుండా 'బండ సుబ్బన్న ఎద్దులను సుడిమాను బండికి కట్టి తిప్పాడు. 'పశమ్మలను' కొట్టి బరువు లాగించినందుకు మా నాయన బండ సుబ్బన్నను 'బండ' బూతులు తిట్టాడు.

ఈ తిరునాళ్ళకు రంగులరాట్నం ప్రత్యేక ఆకర్షణ. రకరకాలైన ఆటలు కూడా వస్తాయ్. దండిగా అంగళ్లు వస్తాయ్. రిబ్బన్లు, గాజులు, పెన్నులు, దువ్వెన్నలు... ఒకటేమిటి అన్నిరకాల ఆటవస్తువులు, తిండి పదార్థాలు వస్తాయ్. అన్నిటికంటే ముఖ్యంగా తిండి పదార్థాలలో 'బెండ్లు, బత్తె రసాలు, బుడ్డ కారాలు' ముఖ్యమైనవి ఇవి పిల్ల, పెద్ద అందరికీ ఇష్టమే. బెండ్లేమో వేలెడు పొడవుంటాయి. బత్తెరసాలేమో రూపాయ బిళ్ళ సైజులో ఉంటాయ్. ఇవి రెండూ తీపి పదార్థాలే. బుడ్డకారాలు, బెండ్లు, బత్తె రసాలు, కలింగర కాయలు కొనుక్కుని, చీకటి పడేసరికి ఇంటి ముఖం పడతారు. బండ్లలో వచ్చినవారు బండ్లలో వెడతారు. మిగతావారు నడిచి వెళతారు.

రాత్రికి అక్కడ ఎవరూ ఉండరు. అంకాలమ్మ అక్కా, చెల్లెలూ అక్కడ కలుసుకుంటారని నమ్మకం. తిరణాలకి పోయేటప్పుడు "ఎక్కడికిరా" అని అడిగితే తిరణాలకు అని తల ఎగరేసి చెప్పినవాడు .... వచ్చేటప్పుడు ఎక్కడనుండి అని అడిగితే నీరసంగా 'తిరనాల' నించి అంటాడు. తిరిగి, తిరిగి, ... ఎండకు రంగు సోడాలు తాగి అలసిపోయి ఉంటారు.

పీర్ల పండగ

ఇది సాయిబుల పండగే కానీ నిర్వహణ అంతా హిందువులదే. అయినా పండగకు మతాలెందుకు ఉంటాయి? అందరూ కలిసే చేసుకుంటారు. నెల పొడుపు కనిపించినప్పటినుంచీ 'బూబమ్మలు' దీపం కుండలో పెట్టి, నడివీధిలో వుంచి, దాని చుట్టూ తిరుగుతూ పాటలు పాడటంతో మొదలౌతుంది పీర్ల పండగ. పీర్లన్నిటినీ పెట్టెలో నుంచి దించి, కడిగి, కొత్త బట్టలు కట్టి,

'పీర్ల చావిడి' లో నిలబెడతారు. ప్రతి రోజూ పూజ చేసి బెల్లం పంచుతారు.

అయితే పీర్ల పండగల వేడుకలన్నీ చీకటి పడిన తరవాతనే. ప్రతి రోజూ వేషాలు వెయ్యటం పిల్ల, పెద్ద అందరూ ఆనందించేవాళ్ళు. వేషాలెయ్యటంలో బోగం సుబ్బారాయుడు ముఖ్యుడు. ఈ బోగం అన్న మాట వింటే ఆగ్రహోదగ్రుదౌతాడు. కానీ అతని వెనుక అందరూ అలాగే పిలుస్తారు. ఎందుకంటే ఊరినిండా సుబ్బారాయుళ్ళే. గుర్తించటం కష్టం. సుబ్బిశెట్టి పాత్ర పోషించడంలో కూడా సుబ్బన్నది ముఖ్య పాత్ర. ఈయన గంప చంకన పెట్టి, పెసర గుగ్గుళ్ళు, అలసంద గుగ్గుళ్ళు, ఉలవ గుగ్గుళ్ళు అమ్ముతుంటే ఆడవాళ్ళు సిగ్గు మొగ్గలైపోయే వాళ్ళు.

'ఈ గుగ్గుళ్ళు మీ ఆయనకు తినిపిచ్చే అక్కా..' అని, 'అత్తా ... ఈ గుగ్గుళ్ళు మామకు తినిపించు ... అస్సలు పక్కింటి తలుపు తట్టనే తట్టడు' అని, 'మరదలా.. ఈ గుగ్గుళ్ళు మా తమ్ముడికి తినిపించు ... ఇంకా చూడు.. అప్పుడు నువ్వు పగలంతా నిద్ర పోవాల్సిందే' అంటూ పరాచికాలాడుతూ సుబ్బిశెట్టి వేషాన్ని పండిస్తూ వుంటే ఆకలి, పేదరికం, దరిద్రం ఇవన్నీ కూడా కన్నీళ్లను రానిచ్చేవి కావు.

ఇంక సుబ్బారాయుడు వెయ్యని వేషం లేదనుకో. పరిచయమైన అన్ని వేషాలు వేసి, రాత్రి పొద్దు పోయేవరకు ఊరి జనాల్ని నవ్వించి, కవ్వించేవాడు. పగటి సరిగేసు రోజు ప్రత్యేకంగా పగలు వేషాలేస్తారు. ఒకసారి మా పెద్దన్న రామమూర్తి చదువుకుంటూ ఊర్లో ఉన్నప్పుడు పీర్ల పండగ వచ్చింది. పగటి సరిగేసు రోజు సుబ్బారాయుడి చేత 'భూతకి' వేషం వేయించారు. మూడు రోజుల ముందు నుండి 'భూతకి' తల తయారు చేయటానికి పెద్ద కుండకు కళ్ళు, నోరు దగ్గర బొక్కలు పెట్టి వెనకంతా బంకమట్టి కరిపిచ్చి, చిక్కెంటికలన్నీ బంకమట్టిపై కరిపిచ్చి, అది తలకు పెట్టి రెండు 'సంగటి గంప' లను వక్షాలకు పెట్టి, రెండు గడ్డి గంపలను పిరుదులకు పెట్టి, రెండు మూడు చీరలు చుట్టి, చేతికి వేపమండలు ఇచ్చి, నలుగురైదుగురు డబ్బాలు కొడుతూ దరువేస్తూ వుంటే భూతకి వేషంలో వున్న సుబ్బారాయుడు వీరంగం చేసి ఊర్లో అందరినీ భయపెట్టాడు. చిన్నపిల్లలకు జ్వరాలు కూడా వచ్చాయి. ఆ పని చేసినందుకు మా నాయన రామమూర్తి అన్నని తిట్టినాడనుకో.

అప్పుడెప్పుడో బద్వేలి నుండి పిచ్చామె ఒకతె వచ్చింది. ఆమె మాట, చూపు, చేష్టలు అన్నీ ప్రత్యేకంగా ఉండేవి. పిల్లలందరూ పిచ్చిదాని వెంటపడి అల్లరి చేస్తూ వేధిస్తూ వుంటే ... పెద్దవాళ్ళు పిల్లలను వారించి ఆమెను బయటకి పంపారు. మరుసటి సంవత్సరం పీర్ల పండక్కి సుబ్బారాయుడు 'బద్వేలి పిచ్చి' వేషం వేసి ఊరు అందరినీ ఆశ్చర్యపరిచాడు. పిల్లల్ని ఆహ్లాదపరిచాడు. చీర కట్టుకుని ముఖానికి నల్లని బొగ్గు పూసుకుని అచ్చం 'బద్వేలి పిచ్చి' లాగే చూపు, మాట, కదలిక ... ఇలా ఏ ఏటి కాయేడు సృజనాత్మకంగా సాగేవి పీర్ల పండగ వేషాలు.

(ఇంకా ఉంది)

పమ్మి భారతీ శర్మ

అందం అంటే ఏమిటి?

అందం అంటే ఏమిటి? అందానికి నిర్వచనం ఏమిటి? ఇప్పుడు పిల్లలు అనుకునేట్టు అందం అంటే శరీర ఛాయ, పొడవాటి జుట్టు, సన్నని శరీరాకృతి ఇదేనా? కాదు కదా! అందం అంటే తెలివి. అందం అంటే యుక్తి. అందం అంటే మానవత్వం. అందం అంటే సామాజిక స్పృహ. అందం అంటే... ఒక ఆహ్లాదకరమైన వాస్తవం...... అందంగా ఉన్నవన్నీ ఆరోగ్యానికి మంచివనీ చెప్పలేము.. అందంగా కనపడేవి అన్నీ మనకు ఉపయోగించేవి అనీ చెప్పలేము. ఓ చిన్న కథ.... అందం గురించి చెప్పుకుందాం.

పూర్వం గ్రీకులు అన్ని దేశాలనూ జయిస్తూ వారి విజయపతాకాన్ని ఎగురవేస్తున్న సమయంలో ... వారికి ఓ చిన్న ప్రాంతం ... ట్రాయ్ .... కట్టుదిట్టమయిన సరిహద్దు సైన్యంతో.... సామర్థ్యం గల భద్రతా వ్యవస్థతో, ఒక దుర్భేద్యమైన కోటతో వీరికి అడ్డుగోడగా నిలిచింది. అప్పుడు గ్రీకులు .. చాలా అందమైన పెద్ద ఆకారం గల చెక్క గుఱ్ఱాన్ని తయారు చేసి, దాన్ని ఆ ట్రాయ్ పట్టణ సరిహద్దుల్లో విడిచివస్తారు. దానిని చూసిన ఆ పట్టణ ప్రజలు (వారిని ట్రోజన్స్ అంటారు), దాని అందాన్ని, ఆకారాన్ని చూసి .... మురిసిపోయి, ఈ అందమైన గుఱ్ఱం మన దేశంలో ఉండాలి అన్న ఆశతో అతి కష్టం మీద ఆ గుఱ్ఱాన్ని తమ కోటలోకి తీసుకుపోయి, అందముగా ఓ ప్రాంతంలో ఉంచి అలంకరిస్తారు.

ఆ రాత్రి... అందరూ నిదురపోయాక.... ఈ గుఱ్ఱం లోంచి చాలా మంది బలిష్టులైన గ్రీకు సైనిక వీరులు బయటకు వచ్చి ఆ కోటను ముట్టడిస్తారు. అకస్మాత్తుగా జరిగిన దాడిని ప్రతిఘటించలేకపోయిన ఆ ట్రాయ్ పట్టణ ప్రజలు (ట్రోజన్స్), గ్రీకుల చేతిలో ఓడిపోతారు. వారి సామ్రాజ్యం గ్రీకుల వశమైపోతుంది.

కాబట్టి... అందం వెనుక ఎంత ప్రమాదం వుందో కదా... ఇలా ప్రతి విషయంలో అనకూడదు కానీ, అందం అంటే యుక్తి... సమయస్ఫూర్తి... ఇలా రకరకాల నిర్వచనాలున్నాయి. అందువల్ల అందం, తెలివి రెండూ ఉండాలి. పై పై వ్యామోహాలుకాకుండా శాశ్వతంగా ఆనందంగా ఉండే మార్గాన్ని ఎంచుకోవడం ఉత్తమం...

మీ భారతీ లక్ష్మి

గోభూమి

ఆంగ్ల మూలం : డా. పింగళి గోపి

తెలుగు సేత : ఎలెక్ట్రాన్

హరియాకి మనశ్శాంతి లేకుండా పోయింది. తమ మందలోంచి నాలుగు ఆవులు ఎలా గల్లంతై పోయాయో హరియాకి అంతుచిక్కలేదు. అలవాటు ప్రకారం పచ్చిక బయళ్లలో మేతకు తీసుకు పోయేముందు ఉదయం, తిరిగి తీసుకు రాబోయేముందు సాయంత్రం ఆవుల్ని లెక్కపెట్టాడు. సరిగానే ఉన్నాయి. వాటిని కంచె కట్టిన పొలం ప్రాంగణంలో వదిలి, గంట పోయినతర్వాత, భార్య, తల్లి, ఇద్దరు కూతుళ్లతో పాలు పితకడానికి వచ్చినప్పుడు నాలుగు ఆవుల సంఖ్య తగ్గినట్టు గమనించాడు. పచ్చిక బయళ్లలో కోసి, కట్ట కట్టి తీసుకువచ్చిన మూడు పచ్చగడ్డి మోపులు కూడా కనబడ లేదు. ఒక్కగంటలో అవి ప్రాంగణంనుంచి ఎలా మాయమయ్యాయి? బహుశా ఏ పశువుల దొంగలముఠా పనో అయ్యుండాలి. గోలగోల పెడ్తున్న తల్లిని కష్టంమీద సముదాయించి, ఉదయం లేస్తూనే వాటిని వెదకాలని నిశ్చయించుకొని, నిద్రపోవడానికి మంచమెక్కినా కలత చెందిన మనస్సు నిద్రని దూరం చేసింది.

భూమికి ముప్పై అయిదువేల కిలోమీటర్ల ఎత్తులో భూభ్రమణవేగంతో తేలియాడుతున్న ఒక విశాలమైన వ్యోమనౌకలో తమ నాలుగు ఆవులూ ఉన్నట్టు హరియాకి తెలిసే అవకాశం లేదు. ఆ ఆవులు పశుగ్రాసంతో సహా అపహరించబడ్డాయి. అవి ఏ విధమైన అలజడీ చేయకుండా, ఆ రోజు బయళ్లలో మేసిన పచ్చగడ్డిని నెమరువేసుకొంటూ మధ్యమధ్యలో అరుస్తున్నాయి. వాటి కళ్లలో ఏ విధమైన భయమూ లేదు. అద్దాల గోడల వెనుకనుంచి కొన్ని పరికరాల సహాయంతో వాటి తీరుతెన్నులను కుతూహలంతో పరిశీలించడం జరుగుతోంది. భూకాలమాన ప్రమాణాలలో రెండుగంటల అనంతరం నౌక ప్రధాన చోదకుడు విషాణ్ పరిశీలనా విభాగానికి వచ్చాడు. అక్కడ పర్యవేక్షణలో ఉన్న కకుద్మిని ప్రశ్నించాడు

"వారిని గురించి నీ అభిప్రాయమేమిటి?"

"ఇప్పుడే చెప్పడం కష్టం. ఏవిధమైన అలజడీ చేయకుండా ప్రశాంతంగానే ఉన్నారు. వారి భాషలో ఏదో మాట్లాడుకొంటున్నట్లనిపిస్తోంది. కానీ విచిత్రమేమిటంటే ఆ భాషలో అంబా అనే ఒక్క ధ్వని చుట్టూతా ఒకరి అభిప్రాయాలూ మరొకరు తెలుసుకుంటున్నారని అనుకొంటున్నాను. పరీక్షలకి ఇంకా వ్యవధి కావాలంటున్నాడు థోరేయ్," అన్నాడు కకుద్మి. థోరేయ్ నౌకలోని ప్రయోగ, పరిశోధనా విభాగానికి అధిపతి.

విషాణ్ ఓ దీర్ఘనిశ్వాసం విడిచాడు. మరో నక్షత్రమండలంలోని తమ నివాస గ్రహాన్నివదిలి పాలపుంత నక్షత్రమండలంలో ఉన్న సూర్యగ్రహకూటమిలోని భూగ్రహాన్నిచేరుకోడానికి వారి గ్రహసంవత్సర కాలప్రమాణాల ప్రకారం అయిదు సంవత్సరాలు గడిచిపోయాయి. విశాలవిశ్వంలో గాలించి, జీవరాశులున్న గ్రహాల్ని గుర్తించి, ఆ గ్రహాల సమీపంలో తమ అంతరిక్ష స్థావరాల్ని స్థాపించి, ఆ గ్రహాల మేధావుల్తో సంభాషించి పరస్పర జ్ఞానవితరణ, సమాచార వ్యవస్థని నెలకొల్పడం వారి ప్రకటిత విశ్వయాన లక్ష్యం. కానీ ఇది అసలు విషయం కాదు. రాబోయే వందల సంవత్సరాల కాలంలో కాలుష్యం పెరిగిపోయి వనరులు అంతరించిపోయి, తమ గ్రహం వాసయోగ్యంగా ఉండదు. ఇప్పట్నుంచే గ్రహాంతర వలసలకి అనుకూలమైన గ్రహాల్ని వెదకడం అక్కడి శాస్త్రజ్ఞుల, అధికారుల ప్రధాన లక్ష్యం. ఈ లోగుట్టు సంగతి విషాణ్ కి తెలుసు. విషాణ్ విశ్వాంతరిక్షయానంలో కడు ప్రజ్ఞావంతుడు. విశ్వాంతరాళంలో మార్గసూచికలని, విశ్వపటాలని రూపొందించడం, నిర్ధారించడం అతనికి ప్రత్యేకమైన అభిరుచి. కానీ వ్యక్తిగతంగా గ్రహాంతర జీవరాశుల అణచివేత అతనికి ఇష్టంలేదు.

విషాణ్ కకుద్మిని ప్రశ్నలతో విసిగించక వదిలి వెళ్ళాడు. థోరేయ్ చతుష్పాదుల దేహనిర్మాణ వ్యవస్థని క్షుణ్ణంగా అధునాతనమైన పరికరాలతో పరిశీలించసాగాడు. కకుద్మి ఆసక్తికరంగా చూస్తున్నాడు. ఆవులతో సంభాషణా కార్యక్రమం సజావుగా సాగటల్లేదు.

"హల్లో! మేం ఈడ్వరామ్ అనే నక్షత్ర మండలంలోని ఆరూష్ అనే నక్షత్రం చుట్టూ పరిభ్రమించే ఉశ్రీక అనే గ్రహంనుంచి స్నేహహస్తం అందించడానికి వచ్చాం." లౌడ్ స్పీకర్లో థోరేయ్ మాటలు ప్రతిధ్వనించాయి.

"అంబా!" అని ఆవులన్నీ అరిచాయి.

"మీ గ్రహవాతావరణం లోని వాయువులేమిటి? మా ప్రాథమిక అంచనాల ప్రకారమూ ఇరవై అయిదు శాతం ఆమ్లజా అనే జీవ వాయువు ఉందని తేలింది. నిజమేనా? మీ గ్రహంలో మూడొంతులు జీవాధారమైన మరులమ్ ఉందని తెలుస్తోంది. ఇదీ నిజమేనా?"

"మన నౌకలోని కృత్రిమవతావ రణంలో అవి శ్వాస పీలుస్తున్నాయికదా? మరులమ్ అవి నిశ్చింతగా తాగాయి కదా? వారి గ్రహంలో అవి ఎంత శాతమనేది మనం తర్వాత ఖచ్చితంగా తెలుసుకోవచ్చు కానీ, ప్రస్తుతానికి వారి గ్రహ పర్యావరణం మనకి అనుకూలమే అనుకోవచ్చు!" కకుద్మితన అభిప్రాయం వెలిబుచ్చాడు.

థోరేయ్ అవునన్నట్లుగా తలూపాడు.

లౌడ్ స్పీకర్ లో వచ్చిన ధ్వనులను ఆవులు చెవులు నిక్కరించి విని, అటూయిటూ కాస్త ఆశ్చర్యంగా చూసి "అంబా!" అని అరిచాయి.

కకుద్మికి ఆవులన్నీ మొండి ఘటాలుగా అనిపించాయి. అంబా అనే పదం చుట్టూతానే ఆ జీవుల సమాచార వ్యవస్థ కేంద్రీకృతమైందని అనుకొన్నాడు. అది ఏదో రహస్య సంకేతపదమై ఉండొచ్చు. అవి ఏ విధమైన ఆందోళనా లేకుండా కొత్తపరిసరాల్లో నిశ్చింతగా ఉండడం చాలా వింతగా అనిపించింది. లేకపోతే వాటి స్థావరంనుంచి అపహరించబడి, భూమికి వేల కిలోమీటర్ల దూరం పరగ్రహవాసుల నౌకలో

ప్రయాణం చెయ్యడమన్నది మెదడున్న ఏ జీవికైనా విస్తృతమైన భయాందోళనలు కలిగించడం సహజం. అవి నిశ్చింతగా నెమరు వేసుకొంటూనే ఉన్నాయి. ఇలా చలించకపోవడం ఆలోచనాపూర్వకమైన ఎత్తుగడకానీ కాదుకదా?

కొంతసేపటికి ధౌరేయ్ కీ, కకుద్మీకి వారు సాధుజీవులని నమ్మకం కుదిరింది. గాజు గోడలోని తలుపుతీసుకొని ఇద్దరూ ఆవుల్ని సమీపించారు. వారు కంగారు పడలేదు. ధౌరేయ్ ఒక పటాన్ని చూపుతూ విశ్వాంతరాళంలో తమగ్రహం ఎక్కడుందో ఒక అవుకి చూపించసాగాడు. అది చటుక్కున దాన్ని నోట కరుచుకొని తినబోతోంటే కంగారుగా దాన్ని లాగేశాడు. ఆ ఆవు తలాడించి 'అంబా' అని అరిచింది.

తర్వాత ఆవులకి పుస్తకాలు చూపించారు. రేడియోలూ విని పించారు. అనేకమైన భాషల్లో వీడియోలు చూపించారు. టెలివిజన్లు చూపించారు. అన్నింటినీ అవి అందుకొని తినే ప్రయత్నాలు చేశాయి. కొన్ని, తినబోయిన పుస్తకాల్ని వెంటనే ఉమ్మేసి అంబా అని అరిచాయి. ఉశ్రీక గ్రహవాసులైన ధౌరాయ్ కీ, కకుద్మీకి అలసట ప్రారంభమైంది.

"బహుశా వారికి అన్నింటినీ తిని పరీక్షచెయ్యడం అలవాటనుకొంటాను!"అన్నాడు కకుద్మీ.

గ్రహాంతర యానంలో కొన్ని శిశుదశలో ఉన్న గ్రహాలనుండి సేకరించబడిన పురుగుల్నీ, ఇతర జీవరాశుల్ని ముందు పెడితే ఆవులన్నీ వెంటనే విముఖత చూపించి దూరంగా తప్పుకొన్నాయి.

ధౌరేయ్ కకుద్మీని వెంటబెట్టుకొని నౌకాధికారి విషాణ్ ని అతని కేబిన్లో కలుసుకొని తన అంతిమ అభిప్రాయాన్నితెలియజేశాడు.

"సర్! వారు పరమ శాంతస్వభావులుగా, శాకాహారులుగా కనిపిస్తున్నారు. వారికి చలనమున్నజీవరాశుల్ని, మృతజీవుల్ని తినడం ఇష్టంలేదు."

"వారి అంతర్దేహనిర్మాణ వ్యవస్థ, శరీరంలోని మూలధాతువులు, జన్యు వర్గీకరణ ఎలా ఉన్నాయి?" విషాణ్ ప్రశ్నించాడు.

"చాలావరకూ మనలాగే ఉన్నాయి. దేహనిర్మాణంలో ఉన్న మౌలికమైన ధాతువులు కూడా ఒకటే. వారి గ్రహంలోకూడా జీవాధారమైన ఆమ్లజా ఉండడం మూలాన మనలాగే జీవనవిధానం కొనసాగుతోందని అనుకోవాలి. ఇవన్నీ మనకనుకూలంగానే ఉన్నాకానీ, వారి వాక్కు అర్థంకావటల్లేదు. మనం వెంటనే మన గ్రహానికి పోయి మరిన్ని కొత్తపరికరాలతో రావాలి," అన్నాడు ధౌరేయ్.

"వాళ్ళు సాధువులు కాబట్టి, మనం వారికి నెమ్మది నెమ్మదిగా మన భాష నేర్పి పరస్పరసమాచార వ్యవస్థని నెలకొల్పాలి. రాబోయేకాలంలో పరస్పర సహకారంకోసం ఇది చాలా అవసరం!" అన్నాడు నౌకాధికారి విషాణ్.

"సర్! మననాయకుల లక్ష్యాన్ని మీరు నిజంగా నమ్ముతారా?" కకుద్మి ప్రశ్నించాడు.

"అసలు గ్రహాంతరవాసుల్ని కనుక్కునే ఈ ప్రణాళిక గురించి నా అభిప్రాయం నీకు తెలుసు! గ్రహవాసులు లేని గ్రహాలనుండి ఖనిజసంపదని, ఇంధనాల్ని తీసుకుపోయెటంతవరకూ పర్వాలేదు కానీ, గ్రహవాసులెవరైనా ఉంటే వారిని అణిచిపారవేయడం నాకు మౌలికంగా, వ్యక్తిగతంగా నచ్చని విషయం. కానీ ప్రభుత్వం ఉద్దేశ్యం వేరు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల్ని ఆక్రమణకోసం ఉపయోగించడం అర్థరహితం. కానీ తప్పలేదు! ఇంటికి ఇలా కొన్నికోట్ల కోట్ల మైళ్ళ దూరంలో......" విషాణ్ మాట ఆపివేశాడు. మాటల్లో బెంగ గోచరించింది.

***

ఆవులకోసం వెతికి వేసారి పోయి హరియా రెండురోజులతర్వాత పోలీసు స్టేషన్ కి వెళ్ళాడు. యుగరాజ్ అనే పోలీసు అధికారికి తన ఆవులు అపహరించబడ్డ సంగతి చెప్పాడు. తాగిన మైకంతో యుగరాజ్ కళ్ళు ఎర్రగా ఉన్నాయి. "ఇందులో నాకేంటి?"

అతను అదోలా నవ్వుతూ అన్నాడు.

హరియాకి వెంటనే అర్థం కాలేదు. నెమ్మదిగా యుగరాజ్ మాట అర్థమైంది.

"ఏం కావాలి మీకు?"

"సాధారణంగా మేము దొరికిన వస్తువుల విలువలో ఏభై శాతం తీసుకొంటాం. నీ విషయం చూస్తే చాలా ప్రత్యేకమైనది. నాలుగు ఆవులు తప్పిపోయావంటున్నావ్. అంటే రెండు ఆవుల్ని సమర్పించుకోవాలి. ఆవుల్ని పెంచడం నాకు తెలియదు. ఆవుల్ని అమ్మడానికి కూడా నాకు సానుకూలత ఉండదు. మార్కెట్ ధరల ప్రకారం రెండు ఆవుల సొమ్ము నాకు అందచెయ్యి. లేదా ఒక ఏడాదిపాటు రోజుకి రెండు లీటర్ల పాలు నాకు ఉచితంగా పొయ్యి. ఇది నీకు చాలా లాభసాటిగా ఉంటుంది. నాకూ జనం దృష్టిలో పడే ఇబ్బంది ఉండదు."

"నేను సామాన్య గోపాలకుణ్ణి. మా సమష్టి కుటుంబం పెద్దది. ఆవుల జవాబుదారీ నాదే! అవి పోతే అందరూ నామీదే విరుచుకుపడ్తారు. ముసలివాళ్లున్నారు. పెళ్లిళ్లు కావాల్సిన అమ్మాయిలున్నారు. బడికి పోయే పిల్లలున్నారు. ఏడాదిపాటు రోజుకు రెండు లీటర్లు పాలు ఉచితంగా పోయడం నాకు వల్ల కాదు!" హరియా దీనంగా అన్నాడు.

"నీలాంటి వాళ్ళు నాకు బాగా తెలుసు. నీ పేదరికాన్ని చాలా నాటకీయంగా చెప్పావు. నాకు నమ్మశక్యంగా లేదు. నాకు ఉచితంగా పాలు పోస్తేనేకాని నీ ఆవుల్ని వెదికే ప్రయత్నం జరగదు! ఆ పైన నీ ఇష్టం!" యుగరాజ్ కరుగ్గా అన్నాడు. నష్టాన్ని ఏదో విధంగా భర్తీ చేసుకోవచ్చునని మనసు రాజీ పడిపోవడంతో, హరియా సరేనన్నాడు.

ఆవుల్ని ఎత్తుకుపోయిన స్థలానికి తను మధ్యాహ్నం వస్తానని చెప్పి,ఇనస్పెక్టర్ యుగరాజ్ హరియాని పంపించేశాడు.

***

అపహరణకు గురికాబడ్డ గోవులు గ్రహాంతరవాసుల అంతరిక్ష నౌకలో కునుకు తీయడానికి ప్రయత్నించాయి. నౌకా సిబ్బంది వాటిని సుఖంగా కునుకు తీయకుండా ఇబ్బంది పెడ్తున్నారు. డొక్కల్లో పొడుస్తూ, మెడమీదా, పొదుగులమీదా ఏవో ఇంజెక్షన్లనిస్తూ మాట్లాడించడానికి ప్రయత్నాలు, ప్రయోగాలు చేస్తున్నారు. అవి అన్నింటికీ బాధగా అంబా అని మాత్రమే అరుస్తున్నాయి. నౌకలోని సిబ్బందికి విసుగెత్తిపోయింది.

చివరికి నౌకాధికారి విషాణ్ జింజొనియమ్ అనే జన్యుపరమైన కంప్యూటర్ చిప్ ని ఆవులకి చిన్నపాటి శస్త్రచికిత్స చేసి, వాటి శరీరభాగాల్లో ఉంచడానికి నిర్ణయం తీసుకొన్నాడు. ఆ జన్యుచిప్ ఆవుల దేహంలోని కణజాలాన్ని, పొందికల్నీ నెమ్మదినెమ్మదిగా మార్చి వేసి వాగ్రూపంలో భావప్రకటనకి దారి తీస్తుంది.

"మీరు ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చారనుకొంటాను? ఏకంగా వారి గ్రహం మీద దాడి చేసేయవచ్చుగా?" కకుద్మి విషాణ్ ని ప్రశ్నించాడు.

"మాటరానివారిని లొంగదీసుకోవడం సులువు కావొచ్చు. అది నైతికం కాదు. కానీ మనం ఎవరినైనా ఆక్రమించ దలచుకొన్నప్పుడు వారి ప్రవృతినీ, మనోభావాల్ని తెలుసుకోవాలి. ఈ జన్యుచిప్ ని ఉపయోగించడం ద్వారా ఈ గ్రహాంతరవాసుల బుద్ధి క్రమేపీ వికసిస్తుంది. వారిలోంచీ జీవపరిణామ ప్రక్రియతో కొన్ని తరాలలో మేధావులు పుట్టుకొస్తారు. జన్యుచిప్ ని అమర్చి, మన పాలకులు అంగీకరిస్తే ఉశ్రీక గ్రహానికి తిరిగి పోవచ్చు. లేదా వారి ఆదేశాల ప్రకారం మరో నక్షత్ర గ్రహకూటమికోసం వెదుకులాట ప్రారంభించాల్సిరావొచ్చు. ఈ గ్రహకాలమాన ప్రకారం రెండువందల సంవత్సరాల తర్వాత తిరిగి వచ్చేసరికల్లా సాధుప్రవర్తనగల ఇలాంటి జీవులతో గ్రహమంతా పరిణామం చెందుతుంది. అప్పుడు మనం ఈ గ్రహం మీద స్థావరాలు వారి సహకారంతో నెలకొల్పుకోవచ్చు. వారితో కలిసి జీవిస్తూ విశ్వసౌభ్రాతృత్వానికి, విశ్వశాంతికీ నాంది పలకవచ్చు. భవిష్యత్ లో ఇది గ్రహాంతర సహకార సంబంధాలకి చాలా

అవసరం!" విషాణ్ ఆఖరి అస్త్రం ప్రయోగించక తప్పదన్న భావనతో అన్నాడు.

ఇదివరలో జన్యుచిప్ ని ఏ గ్రహంలోనూ ఏ జీవిమీదా ఉపయోగించవలసిన అవసరం విషాణ్ కి రాలేదు. జన్యుచిప్ ని ప్రవేశపెట్టినప్పుడు కొన్ని తీవ్ర పరిణామాలు మరణంతో సహా సంభవించవచ్చు. అటువంటిదేదైనా జరిగితే చిప్ లో మార్పులు చేయాల్సివస్తుంది. గోవుల్ని అపహరించిన స్థలానికి వెళ్ళి, వాటికి అలవాటైన ఆ గ్రహవాతావరణంలోనే ప్రయోగాత్మకంగా ఒక ఆవు శరీరంలో జన్యుచిప్ ని అనుసంధానించవలసిందిగా ఆదేశమిచ్చాడు. అంతా సవ్యంగా జరిగితే, మిగిలినవాటిలో కూడా చిప్ ని ప్రవేశపెట్టవచ్చునని చెప్పాడు.

ఉన్నవాటిలో బలిష్టమైన ఒక ఆవుని కకుద్మి ఉపనౌకలో భూగ్రహానికి తీసుకుపోయాడు. అల్పశాతం తప్పిదం మూలాన ఉపనౌక అపహరణ స్థలానికి రెండు వందల మీటర్ల దూరంలోఓ రోడ్డు పక్కన దిగింది. అది మిట్ట మధ్యాహ్న సమయం. ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ప్రాంతమంతా ఏ విధమైన సంచారమూ లేకుండా నిర్మానుష్యంగా ఉంది. కకుద్మి రోడ్డునీ, అల్పదూరంలో ఉన్న కొన్ని నిర్మాణాలనీ చూసి ఆశ్చర్యపోయాడు. అంతలో హరియా ఒక పొలికేక పెట్టాడు.

"అదిగో! నా ఆవు గంగా! పక్కనే ఎవరో ముసుగు మనిషి ఉన్నాడు. కనబడటల్లేదా?"

ముందస్తుగానే హరియా ఖర్చుతో ఒక బార్ లో నాలుగు పెగ్గుల మందు బిగించిన యుగరాజ్ వెంటనే పిస్తోలు తీసి ప్రత్యేకమైన శిరస్త్రాణం ధరించిన కకుద్మి వైపు గురిచూసి కాల్చాడు. అది వెంట్రుకవాసిలో తప్పి కకుద్మి పక్కనుంచి దూసుకుపోయింది. కకుద్మి పరుగు తీస్తూ ప్రధాన నౌకకి ప్రమాద సూచికలు తెలియజేశాడు. యుగరాజ్ మరోసారి పిస్తోలు పేల్చాడు. కకుద్మి ఒక చెట్టుచాటున నక్కాడు. తుపాకి మోతలు విని ఇళ్ళలోంచి జనాలు బయటకి వచ్చారు. చెట్టుచాటున నక్కిన కకుద్మి మీదకు ఇద్దరు మనుషులు కొడవళ్ళతో దూకారు. కకుద్మి తన కాళ్ళతో వాళ్ళని బలంగా తన్నడంతో వాళ్ళు కిందపడి మరి లేవలేకపోయారు. ఒక కొడవలి కకుద్మి రక్షణవస్త్ర సముదాయంలో చిక్కుకుపోయింది. హరియా, యుగరాజ్లు ముందుకు పరుగెత్తారు. యుగరాజ్ మూడోసారి పిస్తోలు గురి చేసేలోగా ఒక సుడిగాలి వచ్చి కకుద్మిని అప్పటికే అయిదుమీటర్ల ఎత్తులో ఉన్న ఉపనౌకలోకి తీసుకుపోయింది. హరియా, యుగరాజ్, కొడవళ్ళతో కలబడ్డ ఇద్దరూ, దృశ్యాన్ని తిలకించిన కొందరు ఊరి జనులూ నోట మాటరాక విభ్రాంతికి గురై నిల్చుండి పోయారు. ఉపనౌక శరవేగంతో పైకి లేచి ప్రధాన నౌకని చేరుకొంది.

ద్విపాదులనుంచి లభ్యమైన కొడవల్ని అంతరిక్షనౌక ప్రయోగశాలలో థొరేయ్ పరీక్షలు చేయసాగాడు. ఒకటికి రెండుమార్లు సూక్ష్మదర్శినిలోకి, అటుతర్వాత, దానికి అనుసంధానమైన జన్యువిశ్లేషణాపరికరం తెరమీదకూ చూసి, పక్కనే నిలబడి ఉన్నకకుద్మితో విషాణ్ ని పిలవమని అడిగాడు. కకుద్మి పిలుపందుకొని విషాణ్ ప్రయోగశాల చేరుకొన్నాడు.

"ఏమిటి విశేషం?" విషాణ్ ప్రశ్నించాడు.

"ఈ గ్రహాన్ని ఇదివరలో మన గ్రహవాసులు దర్శించడం కానీ జరిగిందా?" థొరేయ్ ప్రశ్నించాడు

"ఈ నౌక పది తరాల క్రితమే నిర్మించబడింది. అంతకు క్రితం ఏడెనిమిది నిర్మించబడ్డాయి. అంతరిక్షంలో ఈ నౌక నలుగురి నౌకాధిపతుల చేతుల్లో తిరిగింది. నేను అయిదో వాణ్ని. ఈ నౌక పలుదిశలా పయనిస్తోనే ఉంది. ఈ గ్రహాన్ని మన పూర్వీకులెవరైనా సందర్శించారేమో నాకు తెలియదు. ఒకవేళ అలాజరిగి ఉన్నా, ఆ వివరాల్నినాకు చెప్పడం జరగలేదు." అన్నాడు విషాణ్.

"అలాంటి అనుమానం ఎందు-

కొచ్చింది?" కకుద్మి ధౌరాయ్ ని ప్ర-శ్నించాడు.

"ఆ ద్విపాదుల శ్వేదముద్రలు కొడవలి పిడిమీద కనబడ్డాయి. వారి కణజాలంలో ఉన్నజన్యువులు మనం చతుష్పాదులలో ప్రవేశబె-ట్టదలచిన జన్యుచిప్ జన్యువుల-ను పోలి ఉన్నాయి. అంటే ఎవరో మన ట్రేడ్ మార్క్ జన్యుచిప్ ని ఈ గ్రహవాసులలో ఎప్పుడో ప్రవేశ పెట్టి ఉంటారు. అయితే పరిణామ మా-ర్గమధ్యంలో అది ఎక్కడో వికటిం-చింది. ఒక చీలిక చతుష్పాదులు ద్విపాదులుగా జీవపరిణామానికి లోనైయ్యారు. ఆ కారణంగా ద్వి-పాదుల్లో ఏ యితర జీవరాశుల-మీదా, ఆఖరికి తమలో తమ మీదా శాంతి స్వభావం లేదు. అనేకానేక-మైన చతుష్పాదులు అంతరించి-పోతున్నారు. ప్రతిచిన్న విషయానికీ ద్విపాదులు అలజడులు, ఆం-దోళనలు లేవదీసే స్థితికి జన్యు-పరిణామం జరిగిపోయింది. ద్వి-పాదులు స్వయం వినాశనం వైపు అడుగులు వేస్తున్నారు. మనం వారితో సత్సంబంధాలు నెలకొల్ప-డమనేది వృథాప్రయాస!" అన్నాడు ధౌరాయ్.

***

"ఏం జరిగింది? "యుగరాజ్ పై అధికారి ప్రశ్నించాడు. యుగరాజ్ తన పై అధికారికి జరిగింది వివరించ సాగాడు.

"నేను కాల్చిన ఆకారం పొడుగాటి పారదర్శకమైన హెల్మెట్ ధరించి ఉంది. ఆ హెల్మెట్లో ఏవో చిన్నచిన్న రంగురంగుల దీపాలు వెలుగుతు-న్నాయి. తన తోకకి తగిలించిన ట్రా-న్స్మిటర్లో ఏదో తెలియని భాషలోఆ ఆకారం అరవ సాగిం ది.

"తోక చివర ట్రాన్స్మిటరా? తాగుడు మైకంలో కానీ ఉన్నావా? నీకు తాగుడు అలవాటే కదా? ఎన్ని సార్లు హెచ్చరించినా నీకు బుద్ధి లేదు?" పై అధికారి చీవాట్లు వేశాడు.

"సర్! నేను ఆరు పెగ్గులు తాగి నా నా మాట తడబడదు. దృష్టి చెదరదు. ఒక్క తలకి తగిలించు-కొన్న పొడుగాటి హెల్మెట్ తప్పించి మిగిలిన శరీరభాగమం తా అచ్చు మన అవుల్ని పోలి ఉంది. కావలి-స్తే హరియాని అడగండి. కొడవ-ళ్ళతో కలబడ్డ కలియాని, జాదవ్ ని అడగండి!" అన్నాడు యుగరాజ్.

వాళ్ళు కూడా యుగరాజ్ చెప్పిన కథనాన్నే చెప్పారు. పై అధికారికి నమ్మక తప్పలేదు.

***

విషాణ్ వెంటనే నిర్ణయం తీసుకొన్నాడు. మిగిలిన ఆవుల్ని-కూడా భూమి మీద సురక్షితంగా వదిలేయ మని కకుద్మికి చెప్పాడు. కకుద్మి ఉపనౌకలో వాటిని ఈ మాటు సరిగా అపహరణ స్థలంలో వదిలేసి, తిరిగి ప్రధాన నౌకని చే-రుకొన్నాడు. విషాణ్ ఆ వెంటనే అంతరిక్షనౌకని ప్రమాదకర-మైన భూగ్రహంనుంచి బహు దూరంగా సూర్యనక్షత్ర పరిధిలోం-చి వెలు పలికి తీసుకుపోయా-డు. సెంటారిస్ నక్షత్ర మండలం వైపు నౌక మళ్ళింది. ఇంటికి తిరిగి వెళ్ళే ఆశ నిరాశే అయ్యింది. గు-రుత్వాకర్షణ తరంగాల మాధ్య-మంగా అధికా రుల ఆజ్ఞలు అలా వచ్చాయి మరి.

విషాణ్ తన కేబిన్లో ఆలోచనలో పడ్డాడు. నౌక సూర్యమండలపు అంచుల్లో ఉండగానే ఈ గ్రహం జీవరాశులున్న గ్రహమని గ్రహిం-పుకు వచ్చింది. గ్రహాన్ని చేరడం జరిగింది. గ్రహంలో తమలాగే, తమ రూపులోనే ఉన్న చతుష్పా-దుల్ని ఆలోచించే మేధావి వర్గమని తలచి ఎత్తుకురావడం జరి గింది. అది పొరబాటైపోయిం-ది. అవి సాధువులుగా ఉండడం తప్పించి ఏ మాత్రమూ జ్ఞాన సంపత్తి లేనివి. ద్విపాదులు తమ-గ్రహపు చతుష్పాదుల లాగే మేధావి వర్గానికి చెందినవారైనా, వారిని సమానులుగా పరిగణించి దరి-జేరడం మంచిది కాదు. గోరూప చతుష్పాద మేధావుల్ని వారు సహించలేరు. వారిలో హింసా ప్రవృతి బలంగా పేరుకుపోయింది. విశ్వంలో ఎక్కడివారక్కడ తమలో తాము కుమ్ముకుంటూ ఉండడమే మేలు. గ్రహాంతరయానాలు, వలసలూ ఎప్పుడో ఒకప్పుడు కొంప ముంచుతాయి. తమగ్రహంలో తిరిగి ఎప్పుడు కాలు పెడ్తాడో తె-లియదుకాని, చేరగానే రాజీనామా యిచ్చేయాలి!

***

ఏది ఏమైనా భూమిని విశ్వాంతర-గ్రహవాసులైన గోముఖ చతుష్పా-దుల దృష్టి నుంచి మరలిం చింది మన గోవుల సాధు ప్రవర్తనా, లేక మానవులు చాలా ప్రమాదకరమైన వారని గ్రహాంతరవాసులు గుర్తిం-చడం వలనా?

ప్రహేళిక

జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

(ఆధారాలు : 1) చ = అసలు అక్షరం 'డ'; 2) ర = అసలు అక్షరం 'త')

సి ర్లా ర్టు చై లుం చి - సి ర్లు చై గె యు వొం పు
న ర్లా ర్టు చై లుం చి - న ర్ల టై రా సుం చు
ష్త ర్ల హ టై లుం చి - క్త జ్ట టై లుం చు నం
మ్ర ర్లు చీ రి తు గేం బ - క్షా ప్తి గి ఖు చు

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

గతనెల జవాబు :

	ఇప్పుడిటు కలగంటి	-	నెల్ల లోకములకు
	నప్పుడగు తిరువేంక	-	టాద్రీశుగంటి
1.	అతిశయంబైన శే	-	షాద్రిశిఖరము గంటి
	ప్రతిలేని గోపుర	-	ప్రభలు గంటి
	శతకోటి సూర్యతే	-	జములు వెలుగగగంటి
	చతురాస్యు బొడగంటి	-	చయ్యన మేల్కంటి

జూన్ నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ పి మారుతీరావు, ఏలూరు;
శ్రీమతి లక్ష్మి, అనకాపల్లి;
శ్రీమతి లీలారుక్మిణి, బందరు.

కొత్త రామానందం

జగద్రధంలో జగన్నాధుడు

ప్రపంచంలో ఏ హిందూ ఆలయంలోనైనా సరే, ఊరేగింపు నిమిత్తం మూలవిరాట్టును కదిలించరు. అందుకు ఉత్సవ విగ్రహాలు ఉంటాయి. ఊరేగింపు సేవలో ఏటా ఒకే రధాన్ని వినియోగించడం అన్ని చోట్లా చూసేదే. ఈ సాంప్రదాయాలన్నింటికీ మినహాయింపు పూరీ జగన్నాధాలయం. బలభద్ర, సుభద్ర లతో సహా ఈ ఆలయంలో కొలువైన జగన్నాధుడిని ఏడాదికొకసారి గుడిలోంచి బయటకు తీసుకువచ్చి భక్తులకు కనువిందు చేస్తారు. ఊరేగించేందుకు ఏటా కొత్త రధాలను నిర్మిస్తారు. అందుకే.. జగన్నాధుడి రధయాత్రను అత్యంత అపురూపంగా భావిస్తారు భక్తులు.

అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ అవంతికా
పూరీ ద్వారావతీ శ్చైవ సప్తైతే మోక్షదాయికా

భారతదేశం లోని సప్త మోక్ష దాయక క్షేత్రాలలో ఒకటిగా భక్త కోటి చెప్పుకునే పరమ పుణ్య తీర్థం పూరీ ప్రాశస్త్యాన్ని వివరించే పద్యపాదమిది. ఆ పవిత్రధామాన్ని పురుషోత్తమ క్షేత్రం, శ్రీక్షేత్రం, శంఖు క్షేత్రం, నీలాద్రి పేర్లతో పిలుస్తారు. ఒడిస్సా రాష్ట్రంలోని పూరీ పట్టణం ఇల వైకుంఠ పురంగా వెలుగుతోంది. ఇచ్చటి ఆలయంలో అన్నదమ్ములు, సోదరి దేవతా మూర్తులుగా కొలువై పూజలందుకుంటున్న ఏకైక ఆలయము. అత్యంత రమణీయ శిల్పకళా సంపదతో ఆలయ గోపురం కలాకాంతులతో, శంఖాకారంలో శోభిల్లుతోంది.

37 వేల చదరపు మీటర్ల సువిశాల విస్తీర్ణంలో నిర్మించిన అద్భుత వాస్తు కట్టడం జగన్నాధుని ఆలయం. 214 అడుగుల ఎత్తున్న ఆలయాన్ని అనంతవర్మ చోడ గంగదేవ కళింగ శైలిలో పాంచ రాత్రీగమ విధానంలో నిర్మించాడంటారు. ఓ రాజకోటలా ఈ ఆలయాన్ని నిర్మించారు. గోపురాలతో, పెద్ద మండపాలతో దాదాపు 120 ఉపాలయాలు ఉన్నాయి. 20 అడుగుల ఎత్తున దుర్భేద్యంగా ఉన్న ఆలయ ప్రాకారాన్ని మేఘనాద ప్రాకారం అని పిలుస్తారు. దాని చుట్టుకొలత 640 అడుగులు. ప్రహరీకి నలువైపులా ముఖద్వారాలు ఉంటాయి. తూర్పు ద్వారాన్ని సింహద్వారమని, ఉత్తర ద్వారాన్ని వ్యాఘ్ర ద్వారమని, పడమర ద్వారాన్ని గజ ద్వారమని, దక్షిణ ద్వారాన్ని అశ్వ ద్వారమని అంటారు. సింహద్వారం ఎదుట అరుణస్తంభం ఉంది. ఏకశిలతో ఆ స్తంభాన్ని నిర్మించారు. ఆలయ శిఖరంపై సూర్యుని రధసారధి అనూరుని ప్రతిమ కనిపిస్తుంది. గోపుర శీర్ష స్థానంలో అష్ట ధా-

తువులతో తయారైన నీల చక్రాన్ని స్థాపించారు. శిఖరంపై సదా పతిత పావన పతాకం ఎగురుతుంటుంది. ఆలయ ప్రాంగణంలోనే ఆనంద బజార్, పాక శాల ఉన్నాయి.

స్థల పురాణం:

జగన్నాథుడు నీలమాధవుడనే పేరుతో గిరిజన దేవుడిగా, సవర తెగల పూజలందుకున్నాడని స్థలపురాణం. అడవిలో ఒక రహస్య ప్రదేశంలో ఉన్న జగన్నాథుణ్ణి గిరిజనుల రాజైన విశ్వావసుడు పూజించేవాడట. ఈ విషయం తెలుసుకున్న ఇంద్రద్యుమ్న మహారాజు ఆ రహస్యాన్ని ఛేదించడానికి విద్యావతి అనే బ్రాహ్మణ యువకుణ్ణి అడవికి పంపిస్తాడు. ఎన్నాళ్ళైనా స్వామి కార్యాన్ని సాధించలేని విద్యావతి విశ్వావసుడి కూతురు లలితను వివాహమాడతాడు. విగ్రహన్ని చూపమని పదే పదే ప్రాధేయపడుతున్న అల్లుడి మాట కాదనలేక పోయిన సవరరాజు అల్లుడి కళ్ళకు గంతలు కట్టి గుడి వద్దకు తీసుకువెడతాడు. విద్యావతి తెలివిగా వ్యవహరించి దారి పొడుగునా ఆవాలు జారవిడుస్తాడు. కొన్నాళ్ళకి అవి మొలకెత్తి దారి తెలియడంతో, ఇంద్రద్యుమ్నుడికి కబురు పెడతాడు. రాజు అడవికి చేరేలోగానే విగ్రహాలు మాయమయ్యాయి. దాంతో ఇంద్రద్యుమ్నుడు అశ్వమేధ యాగం చేస్తాడు.

నీలాచలంపై ఓ ఆలయాన్ని నిర్మించి నరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్టిస్తాడు. ఒకనాడు ఆయన అక్కడే నిద్రిస్తుండగా జగన్నాథుడు కలలో కనిపించి, సముద్ర తీరంలో చాంకీ నది ముఖద్వారానికి వేపకొయ్య ఒకటి కొట్టుకొస్తుందనీ, దానితో విగ్రహాలను తయారు చేయించమనీ ఆదేశిస్తాడు. విగ్రహ నిర్మాణానికి ఎవరూ ముందుకు రారు. ఏంచేయాలా అని రాజు ఆలోచిస్తున్న సమయంలో దేవశిల్పి విశ్వకర్మ వికలాంగుడి రూపంలో వస్తాడు. ఓ గదిలో విగ్రహాలను రహస్యంగా రూపొందిస్తాననీ, తానూ తెరిచే దాకా ఎవరూ ఆ గది తలుపులు తెరవకూడదన్న షరతుకు రాజు అంగీకరిస్తాడు.

కానీ, పద్నాలుగు రోజులు గడిచాక, రాణి గుండిచాదేవి తొందర పెట్టడంతో, గది తలుపులు తెరుస్తాడు. శిల్పి కానరాడు. చేతులు, కాళ్ళు లేని సగం చెక్కిన విగ్రహాలేఅక్కడ ఉంటాయి. చతుర్దశ భువనాలను వీక్షించడానికా అన్నట్టు ఇంతింత కళ్ళు మాత్రం ఉంటాయి. ఎంతో బాధపడిన రాజు, బ్రహ్మదేవుని ప్రార్థిస్తే, ఆయన ప్రత్యక్షమై, ఇకనుంచి ఆ విగ్రహాలు అదే రూపంలో పూజలందుకుంటాయని వరమిస్తాడు. తానే స్వయంగా వాటిని ప్రాణప్రతిష్ట చేస్తాడు. ప్రతిష్ట చేసిన విగ్రహాలకు అభయహస్తం, వరదహస్తం కనిపించవు. అన్నదమ్ములు, సోదరి అయిన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవతామూర్తులుగా కొలువై పూజలందుకుంటున్న దేవాలయం ఇదొక్కటే. రాతి విగ్రహాల స్థానంలో చెక్క ప్రతిమలే (దారు మూర్తులు) నిత్య పూజలందుకుంటున్నాయి.

ఈ విగ్రహాలను 18 సంవత్సరాలకు ఒకమారు నవకళేబర పేరిట పాతవాటిని మార్చి కొత్తవాటిని ప్రతిష్టిస్తారు. అధికాషాఢం వచ్చిన సంవత్సరంలో మూలవిరాటుల్ని ఆలయ ఆవరణలో ముక్తిమండపంలో ఖననం చేసి కొత్త విగ్రహాల్ని ప్రతిష్టిస్తారు. విగ్రహ నిర్మాణానికి ఉపయోగపడే దారువును అన్వేషించి, వాటికి పూజలు జరిపి, వాటిని పూరీ పట్టణానికి తరలించి విగ్రహాలు తయారు చేయిస్తారు. అర్ధరాత్రి దాటాక ప్రధానార్చకులు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట చేస్తారు. అంటే పాత విగ్రహం లోపలభాగంలో ఉండే ఓ రహస్య వస్తు విశేషాన్ని కొత్త విగ్రహంలోకి మారుస్తారు. దాన్నే బ్రహ్మ పదార్థంగా పిలుస్తారు.

అందరికీ కావలసిన దేవుడు

ఒరిస్సాలో ఒకప్పుడు బౌద్ధము, ఆ తర్వాత జైన వైష్ణవ మతాలు భక్తి తాత్వికత ప్రాబల్యంలో ఉండేవని క్రీ.శ. 12 వ శతాబ్దంలోని చరిత్రకారులు అంటున్నారు. పూరీ జగన్నాథుని ఆలయ నిర్మాణని-

కి ముందే ఆది శంకరాచార్యులు దేశం నలుమూలలలోని నాలుగు శంకర పీఠాలుగా ఒకటిగా ఇక్కడ గోవర్ధన మఠం స్థాపించారు. అలాగే రామానుజాచార్యులవారు కూడా ఇక్కడ మఠం స్థాపించారు. బెంగాల్ నశ ద్వీపానికి చెందిన శ్రీ చైతన్య మహాప్రభు (16 వ శతాబ్ది) పూరీకి వచ్చి జగన్నాథుని సేవించుకుంటూ, అక్కడే తనువు చాలించాడు. అన్ని మతాలకు, విశ్వాసాలకు కూడలి అయ్యింది పూరీ.

214 అడుగుల ఎత్తైన బ్రహ్మాండమైన ఆలయంలో కొలువు తీరియున్న జగన్నాథుడికి జరిగే సేవలు, ఉపచారాలూ, భోగాలూ, కూడా అంత భారీగానూ ఉంటాయి. స్వామి అలంకార ప్రియుడు. రోజుకు కనీసం అయిదారు సార్లు దుస్తులు, ఆభరణాలు మార్పించుకుంటాడు. ఇక ఆయనకు ఉన్నంత తిండి పుష్టి మరే దేవుడికీ ఉండవు.

ఆయనకు ఆరు సార్లు నైవేద్యాలు నివేదన చేస్తారు. ప్రతిసారీ 56 రకాలు కొత్త కుండల్లో వండిపెడతారు. ఈ వంటకాలు లేనిదే జగన్నాథునికి ముద్ద దిగదు. ఈ పదార్థాలు నియమ నిష్టలతో తయారు చేయటానికి వంట శాలలో 500 మంది వంటవాళ్లు, 300 మంది సహాయకులు పని చేస్తూంటారు. వీరు తమ జీవన సర్వస్వాన్నీ జగన్నాథుని నైవేద్య సేవకే అర్పిస్తారు. అందుకే పూరీ క్షేత్రాన్ని అన్న క్షేత్రమని, అలాగే జగన్నాథుని 'అన్న బ్రహ్మ' అని పిలుస్తారు. ఇంకో విశేషమేమిటంటే, జగన్నాథునికి, ప్రసాదాలు నివేదించిన తర్వాత వీటిని ప్రధానాలయ ప్రాంగణం లోని విమలాదేవి అనే అమ్మవారికి నివేదిస్తారు. అప్పుడే అది మహాప్రసాదమవుతుందని భక్తుల విశ్వాసం. తర్వాత వాటిని ఆలయ ద్వారానికి ఈశాన్య భాగంలో ఉన్న ఆనంద బజార్ విక్రయశాలకు తరలిస్తారు. జగన్నాథుని వంటశాలలో ప్రతి వంటకాన్నీ మహాలక్ష్మి దేవి అదృశ్య రూపంలో పర్యవేక్షిస్తుంటుందని నమ్ముతారు. ఈ పవిత్ర క్షేత్రంలో కుల మత విచక్షణలు, తారతమ్యాలు లేవు. అందరూ సమానమే అన్న 'సర్వం జగన్నాథం' నానుడి లోకి వచ్చింది.

జగన్నాథ రథయాత్ర

ఆషాడ శుద్ధ విదియ - పూరీ క్షేత్రంలో పండుగ రోజు. భక్తిభావం వెల్లువై పొంగులెత్తుతుంటుంది. జగన్నాథ జయ జయ ధ్వానాలతో పూరీ వీధులన్నీ మారుమోగుతుంటాయి. ఆ పర్వదినాన శ్రీ జగన్నాథుడు తన సోదరి, సోదరునితో రథాలు ఎక్కి ఊరేగుతూ అశేష ప్రజానీకానికి తన దర్శనం ప్రసాదించే జగత్ విఖ్యాత మహోత్సవం. పూరీ క్షేత్రంలో మూలవిరాట్టులే రథాన్ని అధిరోహిస్తారు.

ఈ రథయాత్రకు సరిగ్గా రెండు నెలల ముందు, అంటే వైశాఖ శుద్ధ విదియ నాడు రథాల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తారు. ఆ మర్నాడు, అంటే అక్షయ తృతీయ నాడు రథాల నిర్మాణానికి శ్రీకారం చుడతారు. 1072 వృక్ష భాగాల్ని అవసరమైన ప్రమాణాలబట్టి 2188 ముక్కలుగా విభజిస్తారు. వాటిలో 832 ముక్కల్ని జగన్నాథ రథం తయారీకి, 763 భాగాల్ని బలభద్రుడి రథం తయారీకి, 593 ముక్కలను సుభద్ర రథం తయారీకి వినియోగిస్తారు. రథాల్ని తయారు చేసేవారు శుచిగా ఉండి, నూతన వస్త్రాలు ధరించి నిర్మాణ కార్యక్రమం ప్రారంభిస్తారు.

జగన్నాథుడి రథాన్ని 'నందిఘోష' అంటారు. 45 అడుగుల ఎత్తున ఈ రథం పదహారు చక్రాలతో మిగతా రెండిటి కన్నా పెద్దదిగా ఉంటుంది. ఎర్రటి చారలున్న పసుపు వస్త్రంతో అలంకరిస్తారు.

బలభద్రుడి రథాన్ని 'తాళధ్వజం' అంటారు. దీని ఎత్తు 44 అడుగులు. ఎర్రటి చారలున్న నీలి వస్త్రంతో ఈ రథాన్ని కప్పుతారు.

సుభద్రాదేవి రథం పేరు 'పద్మధ్వజం'. దీని ఎత్తు 43 అడుగులు. ఎర్రటి చారలున్న నలుపు వస్త్రంతో అలంకరిస్తారు.

ప్రతి రథానికీ 250 అడుగులు పొడవున్న తాళ్ళను కడతారు. ఈ మూడు రథాలను ఆలయ తూర్పు భాగంలో వుండే సింహద్వారానికి ఎదురుగా ఉత్తర

ముఖంగా నిలబెడతారు.

మేళతాళాలతో గర్భగుడి లోకి వెళ్ళిన పండాలు (అర్చకులు) ఉదయకాల పూజాదికాలు నిర్వహించి, రత్నపీటలమీద నుంచి విగ్రహాలను కదిలిస్తారు. ముందుగా దాదాపుగా 5- 1/2 అడుగులున్న బలభద్ర విగ్రహాన్ని తీసుకువస్తారు. ఆయన రధం తాళధ్వజం పై ప్రతిష్టిస్తారు. అనంతరం ఇదే విధంగా సుభద్రాదేవి విగ్రహాన్ని కూడా బయటకు తీసుకువచ్చి, పద్మధ్వజం రథంపై ప్రతిష్టిస్తారు.

అయిదడుగుల ఏడంగుళాలు ఉండే జగన్నాధుని విగ్రహాన్ని ఆలయ ప్రాంగణం నుంచి బయటకు తీసుకువస్తుండగానే 'జయహో జగన్నాధా' అంటూ జయజయధ్వానాలు చేస్తారు భక్తులు. స్వామిని రధమందు ప్రతిష్టిస్తారు. విగ్రహాలను రధమందు ప్రతిష్టించే వేడుకను 'పహండీ' అంటారు. ఈ విగ్రహాలను తీసుకువచ్చేవారిని దైత్యులు అంటారు. వీరు సవరతెగ రాజు విశ్వావసు వారసులు. వారికే రధాలమీద ప్రతిష్టించే హక్కు ఉంది.

రాజే బంటు

పూరీ సంస్థానాధీశుడు అక్కడకు చేరి, జగన్నాధునికి నమస్కరించి స్వామి ముంగిట బంగారు చీపురుతో శుభ్రం చేస్తారు. అనంతరం స్వామి రథంపై

గంధం చల్లి, రథం పైభాగమందు ముమ్మారు ప్రదక్షిణం చేస్తాడు. పిమ్మట మూడు రథాలకు తాళ్ళు కట్టి భక్తులు ఆనందోత్సాహాలతో రథాలను లాగుతూ 'గుండిచాఘర్' దగ్గరకు చేరుస్తారు. కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో వున్న గుండీచా ఆలయం చేరటానికి 12 గంటల సుదీర్ఘ సమయం పడుతుంది. ఈ యాత్రను 'ఘోష యాత్ర' అంటారు. జగన్నాథ రథం కొన్ని నిముషాలపాటు సలేబాగా అనే ముస్లిం భక్తుని సమాధి దగ్గర ఆగుతుంది. జగన్నాథుని సేవలో తన జీవితాన్ని అంకితం చేసిన సలేబాగా భక్తితత్వానికి ప్రతీకగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది.

పిన్నిగారిల్లుగా పిలువబడే గుండీచా మందిరంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రలు ఎనిమిది రోజులపాటు బస చేస్తారు. అనేక సపర్యలు పొందుతారు. కదా వీరిని ఎవరైనా దర్శించుకోవచ్చును. ఆషాడమాసం పదవ రోజున విగ్రహాలని రథాలపై అధిరోహించి తిరుగు ప్రయాణం 'బహుదా యాత్ర' కొనసాగిస్తారు. జగన్నాథుడు మార్గమధ్యంలో మరో పిన్నిగారైన 'మోసీమా' ఆలయం వద్ద ఆగుతారు. ఆమె ఇచ్చే పాయసాన్ని స్వీకరిస్తారు. మరుసటి రోజు ముగ్గురు దేవతలూ బంగారు ఆభరణాలు ధరించి, లోనికి ప్రవేశించి రత్న సింహాసనం అధిష్టించడంతో రథయాత్ర పరిసమాప్తమవుతుంది.

'రథస్తం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే'

జగన్నాధుడు రథంలో ఊరేగుతున్నప్పుడు చూస్తే మరో జన్మంటూ ఉండదని శాస్త్ర వచనం.

ది. 4- 7- 2019 న జగన్నాధ రథయాత్ర.

డాలస్ లో 'యోగా డే' సందర్భంగా

ఒసాకా లో జి 20 సమ్మిట్ 2019 లో పాల్గొన్న వివిధ దేశాల నేతలు

RNI No. APTEL/2011/39497 JULY 2019 Postal No. HSE/1043/2017-19
Date of Publishing: 1st July Date of Posting: 8th July

Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001